


'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 1

శుక్రవారం 24-3-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఫ్యాషన్

కూల్ & కంఫర్ట్

మిగతా సీజన్‌ల కన్నా వేసవిలో డ్రెస్ ఎంపికకు కూల్ అండ్ కంఫర్ట్‌కే అధిక ప్రాధాన్యం ఇస్తాం. అందుకే, ఫ్యాబ్రిక్స్‌లలో కాటన్స్ ముందు వరసలో ఉంటాయి. కానీ, ఫ్యాషనబుల్ డ్రెస్సుల విషయంలో ఈ కాలం చాలా ప్రయోగాలు చేయచ్చు. డే అండ్ నైట్ పార్టీలకు వెస్టర్న్ టచ్ ఇస్తూనే సంప్రదాయ వేడుకల్లోనూ ప్రత్యేకంగా వెలిగిపోవచ్చు.



నైట్ ఫంక్షన్స్‌కి సిల్వర్ కలర్ డ్రెస్సులు ఈ సీజన్‌లో అగ్రస్థానంలో ఉంటాయి. గోల్డ్ కలర్ ఆ తర్వాతి స్థానంలోనే ఉంటుంది. ఫ్యాషన్ వేదికలపైనా సిల్వర్ అట్రాక్షన్ తన వైభవాన్ని చాటుతుంది.

స్లిట్స్ ఉన్న డ్రెస్సులు ఈ సీజన్‌కి సౌకర్యంగా ఉండటమేకాదు స్టైల్‌గానూ అనిపిస్తాయి.



డెనిమ్ ప్రతి సీజన్‌కీ ఫ్రెండ్లీగా మారిపోతుంది. అలాగే, వేసవి ఫ్యాషన్ జాబితాలోనూ తన స్థానం పదిలమేనని చాటుతోంది. టాప్స్ ఎంపికలో శ్రద్ధ తీసుకుంటే చాలు.



కార్గో ప్యాంటు, స్కర్ట్ వాటికి తగిన కార్సెట్ టాప్స్ ఈ వేసవికి సౌకర్యవంతమైన ఎంపిక. వదులుగా ఉండే కార్గో ప్యాంట్, స్కర్ట్, వాటికి ఉండి పాకెట్స్ ప్రత్యేక ఆకర్షణగానూ నిలుస్తాయి.



ఎక్కడ ఉన్నా ప్రత్యేకంగా కనిపించాలనుకునేవారికి షీర్ డ్రెస్సులు బాగా నప్పుతాయి. స్వచ్ఛమైన అనుభూతినిచ్చేలా ఫెయిర్‌లుక్‌తో ఆకట్టుకునే ఈ డ్రెస్సులు ఏ పార్టీలో అయినా బ్రైట్‌గా వెలిగిపోతాయి.



కటౌట్ డ్రెస్సులు పగలు, నైట్ ఫంక్షన్స్‌కు కూడా కొత్తదనాన్ని తీసుకువస్తాయి.

బ్యూటిప్స్

అవాంఛిత రోమాలను నివారించండి ఇలా...

ప్రస్తుతకాలంలో అవాంఛిత రోమాలతో చాలామంది బాధపడుతున్నారు. అది అందమైన ముఖాన్ని అంద విహీనంగా చేస్తుంది. వాటిని చూసుకున్నప్పుడల్లా స్త్రీలు ఎంతో బాధని అనుభవిస్తుంటారు. సాధారణంగా హార్మోన్ల అసమతుల్యత వల్ల ముఖంపై అవాంఛిత రోమాలు పెరుగుతుంటాయి. ఏది ఏమైనా అవాంఛిత రోమాలు అనేది ఒక దీర్ఘకాలిక సమస్య. దీనికి వాక్సింగ్, షేవింగ్, ఇతర చికిత్సలు చేయించటం వల్ల క్రమంగా మరింత పెరుగుతాయి. దీనికి శాశ్వత పరిష్కారం అంటూ ఏమి లేదు. కానీ కొన్ని సహజ నివారణలు ఉన్నాయి. అవేంటో చూద్దాం...

పసుపు



ఇది మనం ప్రతి రోజు మన వంటల్లో వాడేదే.. పసుపులో ఉండే యాంటీ బాక్టీరియల్ గుణాలు అవాంఛిత రోమాలును తొలగించి ముఖంలో తేజస్సుని, అందాన్ని మరింత రెట్టింపు చేస్తుంది. దీన్ని ఆయుర్వేదంలో ఒక ఔషధంలా ఉపయోగిస్తారు. పసుపుని శెనగపిండితో కలిపి ఉపయోగిస్తే మంచి ఫలితాలు లభిస్తాయి. పసుపు రోమాలను తొలగించటమే కాకుండా వాటి పెరుగుదలను కూడా అదుపులో ఉంచుతుంది. వీటితోపాటుగా ఆరోగ్యకరమైన ఆహారం కూడా ముఖ రోమాలు వదిలించుకోవటంలో సహాయపడుతుంది. సరియైన ఆహారం తీసుకోకపోవడం వలన ఇది అధికమయ్యే ప్రమాదముంది. ముఖంపై అవాంఛిత రోమాల బెడద తగ్గాలంటే ఫైటో ఈస్ట్రోజెన్లు అధికంగా ఉన్న ఆహారాన్ని తినాలని పరిశోధకులు సూచిస్తున్నారు. ఫైటో ఈస్ట్రోజెన్లు అధికంగా అవిసెగింజలు, సోంపు, అల్ఫాల్ఫాలో ఉంటాయి.

ఇంటిప్స్

కొందరికి చపాతీలు చేయడం బాగా కుదరదు. గట్టిగా రొట్టెల్లా వస్తుంటాయి లేదా తయారు చేసిన కాసేపటికే రబ్బరులా సాగుతుంటాయి. అలాంటప్పుడు చిన్న చిట్కాలు పాటించాలి.



- చపాతీ పిండిని పాలు లేదా గోరువెచ్చని నీళ్ళు, కొద్దిగా నూనె కలిపి, గంటపాటు నానబెడితే చపాతీలు మృదువుగా వస్తాయి.
- ఉడికించిన బంగాళదుంపను బాగా మెదిపి దానిని చపాతీ పిండిలో కలిపి ఆ పిండితో చపాతీలు చేస్తే, చపాతీలు మృదువుగా రావడమే కాదు, ఎక్కువసేపు తాజాగా ఉంటాయి.
- చపాతీలు వత్తేటప్పుడు మధ్యలో కాస్త నూనె వేసి మడతలతో వేసి హాట్ ప్యాక్‌లో ఉంచితే 6 నుండి 7 గంటల పాటు మెత్తగా ఉంటాయి.

న్యూస్‌మేకర్

హిజాబ్ బాక్సర్



ఢిల్లీలో ఇప్పుడు మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలు జరుగుతున్నాయి. అందరి దృష్టి ఆస్ట్రేలియా బాక్సర్ టినా రహిమి మీద నిలిచింది. ఆమె ప్రపంచంలోనే బహుశా మొదటి హిజాబ్ బాక్సర్. ప్రిలిమినరీస్‌లోనే రహిమి ఓడిపోయినా హిజాబ్ గురించి ప్రపంచానికి ఉన్న దృష్టి మారడానికి పోరాటం కొనసాగిస్తూనే ఉంటాను అని తెలిపింది.

‘ఏం పర్వాలేదు. నా మద్దతుదారులను నిరాశ పరిచాను. కాని 2024 ఒలింపిక్స్‌లో కచ్చితంగా గోల్డ్ మెడల్ సాధిస్తాను’ అంది 27 సంవత్సరాల టినా రహిమి.

ఆస్ట్రేలియా నుంచి తొమ్మిది మంది బాక్సర్ల బృందంతో ఢిల్లీలో జరుగుతున్న ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ షిప్‌కు హాజరైన టినా గట్టి పోరాటం ఇచ్చి ఏదో ఒక పతకం సాధించాలన్న పట్టుదలతో వచ్చింది. కాని మన టాలెంటెడ్ బాక్సర్ మనిషా మౌన్ చేతిలో ఓటమి పాలయ్యింది.



● ఢిల్లీలో మనిషా మౌన్‌తో టినా రహిమి

రింగ్‌లో హిజాబ్ ధరించి తలపడిన ఆమెను మెచ్చుకోలు కళ్లతో, ఆశ్చర్యం కళ్లతో, ప్రశ్నార్థకం కళ్లతో చూసినవారు ఆమెను మర్చిపోవడం మాత్రం కష్టం.

‘అనుకూలంగానో ప్రతికూలంగానో నన్ను అందరూ చూస్తుంటారు. నేను ముస్లింని. నా మతానుసారం దుస్తులు ధరించే స్వేచ్ఛ నాకు ఉంది. నేను ఎంచుకున్న రంగంలో ముందుకు సాగడానికి అవి ఏమాత్రం అడ్డు కాకూడదని భావిస్తాను. నన్ను చూసిన చాలామంది ముస్లిం యువతులు స్ఫూర్తి పొందుతూ ఉంటారు. ఈమె హిజాబ్‌తో ఏకంగా బాక్సింగ్ చేయగలిగితే చదువుకు, ఉద్యోగాలకు అది మనకు ఏం అడ్డం అనుకుంటారు. అలాగే అనుకోవాలని కోరుకుంటాను’ అంది రహిమి.

రహిమి 57 కేజీల విభాగంలో ఆస్ట్రేలియా తరఫున విజయాలు సాధిస్తూ ఉంది. 2022 కామన్‌వెల్త్ క్రీడల్లో (బర్మింగ్ హామ్) ఫెదర్ వెయిట్ విభాగంలో బ్రాంజ్ మెడల్ గెల్చుకుని ఆ ఘనత సాధించిన తొలి ఆస్ట్రేలియా ముస్లింగా నిలిచింది. అలాగే కామన్‌వెల్త్ క్రీడల్లో హిజాబ్‌తో బాక్సింగ్ చేసిన మొదటి మహిళగా కూడా.

‘ఇప్పటి వరకూ నా హిజాబ్ గురించి ఎటువంటి అభ్యంతరం రాలేదు. అయితే హిజాబ్‌ను సమర్థించే వారు నేను గెలవాలని గట్టిగా కోరుకుంటారు. హిజాబ్‌తో గెలిచింది అని గొప్పగా చెప్పుకోవాలనుకుంటారు. అది నాకు వొత్తిడి కలిగిస్తోంది’ అంటుందామె.

సిడ్నిలో స్థిరబడి ఆస్ట్రేలియన్ జాతీయత స్వీకరించిన ఈ ఇరానియన్ మహిళ అక్కడ మేకప్ ఉమెన్‌గా ఉపాధి పొందుతోంది.

‘అయితే 2017లో జిమ్‌లో నేను, నా స్నేహితురాలు సరదాగా స్త్రీల బాక్సింగ్ క్లాసులకు అటెండ్ అయ్యాం. బ్యాగ్‌లను పంచ్ చేస్తుంటే మంచి కిక్‌గా అనిపించింది. ఆ సరదా కాస్త సీరియస్ ప్రాక్టీసుగా మారింది. 2018 నాటికి నేను క్వాలిఫైడ్ బాక్సర్‌గా మారాను’ అంటుంది రహిమి. ఆస్ట్రేలియాలో ముస్లిం అథ్లెట్లకు మంచి ప్రోత్సాహం ఉంది. ప్రతి ఏటా అక్కడ ‘ఆస్ట్రేలియా ముస్లిం అచీవ్‌మెంట్ అవార్డ్స్’ ఇస్తారు. గత సంవత్సరం రహిమికి ‘స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ ది ఇయర్’ అవార్డు ప్రకటించారు.

‘హిజాబ్ వారి వారి ఎంపిక. ఎంచుకున్న వారికి అది ఏ విధంగానూ అడ్డు కాదు’ అంటుంది రహిమి.

> ‘ఇప్పటి వరకూ నా హిజాబ్ గురించి ఎటువంటి అభ్యంతరం రాలేదు. అయితే హిజాబ్‌ను సమర్థించే వారు నేను గెలవాలని గట్టిగా కోరుకుంటారు. హిజాబ్‌తో గెలిచింది అని గొప్పగా చెప్పుకోవాలనుకుంటారు. అది నాకు వొత్తిడి కలిగిస్తోంది’ అంటుందామె.

వంటిల్లు

పాలుగాని పాలతో...

వేగన్ స్వీట్స్

శాకాహారప్రియులు... మాంసాహారప్రియులు... ఇద్దరూ ఇష్టపడే రుచి పాలు - పాల ఉత్పత్తులు. వీటితోపాటు డెయిరీ లేని కొత్త ఆహారవిధానం ట్రెండింగ్‌లో ఉంది. అదే వేగన్ డైట్. పాలను దరి చేరనివ్వని వేగన్ ప్రియులు పెరుగుతున్నారు. యానిమల్ మిల్క్ వాడిన కారణంగా వీళ్లు స్వీట్లకూ దూరమే. అందుకే... ప్లాంట్ మిల్క్‌తో చేసుకునే స్వీట్లను చూద్దాం...

రబ్డీ ఖీర్



కావలసినవి: బాదం పాలు – 2 లీటర్లు ; బియ్యం– కప్పు ; కుంకుమ పువ్వు– చిటికెడు ; చక్కెర – కప్పు ; యాలకుల పొడి– అర టీ స్పూన్ ; జీడిపప్పు – 2 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ● బియ్యాన్ని కడిగి నానబెట్టాలి. మందపాటి పెనంలో (నూనె లేకుండా) జీడిపప్పును దోరగా వేయించి పక్కన పెట్టాలి. ● పెనం మీద మందపాటి పాత్రను పెట్టి పాలను మరిగించాలి. పాలు మరగడం మొదలైన తర్వాత మీగడ పైకి తేలుతుంటుంది. స్పూన్‌తో మీగడను తీసి చిన్న గిన్నెలో వేస్తూ పాలను మరగనివ్వాలి. ● నానిన బియ్యాన్ని మిక్సీలో కొంచెం బరకగా పొడి చేసి మరుగుతున్న పాలలో వేసి ఉండలు లేకుండా కలపాలి. ● ఈ మిశ్రమం ఉడుకుతున్నప్పుడు కుంకుమ పువ్వు వేయాలి. మిశ్రమం చిక్కబడుతున్నప్పుడు మరొక పాత్రలో టేబుల్ స్పూన్ నీటిని పోసి చక్కెర వేసి కలిపి ఐదు నిమిషాల సేపు ఉడికించాలి. గోధుమరంగులోకి మారిన తర్వాత ఈ చక్కెర పాకాన్ని పాలు– బియ్యప్పిండి మిశ్రమంలో వేసి బాగా కలిపి సన్నమంట మీద రెండు నిమిషాల పాటు కలుపుతూ ఉడికించాలి. ● ఇప్పుడు యాలకుల పొడి, వేయించిన జీడిపప్పు వేసి కలిపి దించేయాలి. రబ్డీ ఖీర్ చల్లారిన తరవాత కప్పులో వేసి కొద్దిగా పేణీ, ఇష్టమైన గింజలు, డ్రైఫ్రూట్స్ అలంకరించవచ్చు లేదా అలాగే కూడా తినవచ్చు.

గమనిక: రబ్డీ ఖీర్ చల్లారే క్రమంలో మరింతగా చిక్కబడుతుంది. కాబట్టి గరిటజారుడుగా ఉండగానే స్టవ్ మీద నుంచి దించేయాలి.

సోయా మిల్క్ జింజర్ పై

కావలసినవి: సోయా మిల్క్ – పావు లీటరు ; తాజా అల్లం రసం– టేబుల్ స్పూన్ ; చక్కెర– టేబుల్ స్పూన్.

తయారీ: ● మందపాటి పాత్రలో సోయామిల్క్ పోసి, మీగడ తేలకుండా కలుపుతూ మరిగించాలి. ● పాలు చిక్కబడుతున్నప్పుడు చక్కెర కలిపి కలియబెడుతూ మరిగించాలి. ● చక్కెర కరిగిపోయిన తర్వాత అల్లం రసం కూడా కలిపి రెండు నిమిషాల పాటు మరిగించాలి. ● అప్పటికి పాలు దాదాపు సగం అవుతాయి. ఈ దశలో స్టవ్ ఆపేసి మూత పెట్టాలి. ● వేడి తగ్గిన తర్వాత ఫ్రిజ్‌లో పెట్టి చల్లగా సర్వ్ చేయాలి. ● ఇది హెల్దీ డెజర్ట్. సర్వ్ చేసే ముందు డ్రై ఫ్రూట్స్, నట్స్ కలుపుకోవచ్చు.

వేగన్ మిల్క్ ఇంట్లోనే!

సోయాపాలు : మూడు కప్పుల సోయా గింజలను కడిగి మునిగేటట్లు నీటిని పోసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం మరోసారి గట్టిగా రుద్ది రెండు–మూడు సార్లు కడగాలి. పొట్టు వదిలిన వరకు వదలనివ్వాలి. గింజలను మిక్సీలో వేసి కొద్దికొద్దిగా నీటిని కలుపుతూ గ్రైండ్ చేయాలి. మెత్తని పేస్ట్‌ని పెద్ద పాత్రలోకి తీసుకుని ఒక కప్పు నీటిని పోసి కలిపి పలుచటి క్లాత్ లేదా జ్యూస్ స్ట్రెయినర్‌తో వడపోయాలి. చిక్కటి సోయాపాలు వస్తాయి. మరో కప్పు నీటిని పోసి గట్టిగా పిండేసి అవసరమనిపిస్తే మరో అరకప్పు నీటిని పోసి వడపోయాలి. ఈ పాలను మరిగించి చల్లార్చి ఫ్రిజ్‌లో పెట్టుకుంటే నాలుగు రోజుల పాటు తాజాగా ఉంటాయి.



బాదం పాలు

ఇవి కూడా రాత్రంతా నానబెట్టి ఉదయం మిక్సీలో గ్రైండ్ చేసి తగినంత నీటితో వడపోసుకోవడమే.

కొబ్బరి పాలు

తాజా కొబ్బరి ముక్కలను లేదా తురుమును మిక్సీలో వేసి నీటిని కలుపుతూ మెత్తగా గ్రైండ్ వడపోయాలి. చిక్కదనాన్ని బట్టి మరికొంత నీటిని కలుపుకుంటూ వడపోసుకోవాలి.

కోకోనట్ షీరా



కావలసినవి: తాజా కొబ్బరి తురుము – అర కప్పు ; కొబ్బరి పాలు – కప్పు ; నెయ్యి– అర కప్పు ; ఉప్మా రవ్వ– కప్పు ; బాదం – పది (సన్నగా తరగాలి) ; కిస్‌మిస్ – టేబుల్ స్పూన్ ; చక్కెర – కప్పు ; యాలకుల పొడి– టీ స్పూన్.

తయారీ: ● మందపాటి పెనంలో నెయ్యి వేడి చేసి రవ్వ వేసి సన్న మంట మీద దోరగా వేయించాలి. రవ్వ వేగిన తర్వాత కొబ్బరి తురుము, బాదం, కిస్‌మిస్ వేసి వేయించాలి. కొబ్బరి వేగిన వాసన తెలుస్తుంది. అప్పుడు కొబ్బరి పాలు, చక్కెర వేసి కలుపుతూ ఉడికించాలి. కొబ్బరిపాలు మరీ చిక్కగా ఉండి అడుగు పడుతూ ఉంటే అర కప్పు నీటిని వేసుకోవచ్చు. మిశ్రమం దగ్గరవుతున్నప్పుడు యాలకుల పొడి వేసి కలిపి, తేమ ఇగిరిపోయిన తర్వాత దించేయాలి.


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 1

శుక్రవారం 24-3-2023

సాక్షి CELEBRATING 15 YEARS

15 ఏళ్ల విజయ యాత్రను ముగించుకుని 16వ ఏట అడుగు పెడుతున్న సందర్భంగా పాఠకులకు, ఏజెంట్లకు మరియు ప్రకటనకర్తలకు సాక్షి శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రాహుల్‌కు రెండేళ్ల జైలు

'దొంగలందరి ఇంటిపేరు ఎందుకు మోదీయే ఉంటుంది?' అని వ్యాఖ్యానించిన కేసులో రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్ష పడింది.

వివరాలు 6లో ▸

4 రాష్ట్రాలకు బీజేపీ కొత్త అధ్యక్షులు

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పార్టీని బలోపేతం చేయడానికి ఢిల్లీ, రాజస్తాన్, బిహార్, ఒడిశాకు బీజేపీ కొత్త అధ్యక్షుల్ని నియమించింది.

వివరాలు 6లో ▸



నిఖత్ పంచ్ అదిరె

ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు నిఖత్ జరీన్, నీతూ, లవ్లీనా, స్వీటీ ఫైనల్‌కు దూసుకెళ్లారు.

వివరాలు 13లో ▸



అమృత్‌పాల్ @ ఆ ఏడుగురు

శాంతిభద్రతల్ని విచ్ఛిన్నం చేయడానికే అమృత్‌పాల్‌ను ఐఎస్‌ఐ దుబాయ్ నుంచి పంజాబ్‌కు పంపిందని పోలీసులు అనుమానిస్తున్నారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

'పది' విద్యార్థులకు ఉచిత ప్రయాణం



పదో తరగతి విద్యార్థులు తమ నివాస ప్రాంతాల నుంచి పరీక్ష కేంద్రాలకు వెళ్లి రావడానికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ నిర్ణయించింది. పల్లె వెలుగు, సిటీ బస్ సర్వీసుల్లో పదో తరగతి హాల్ టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపింది.

వివరాలు 3 ▸

దేశంలోనే తొలి జనరిక్ పశు ఔషధ కేంద్రం



పశు పోషకులకు తక్కువ ధరకే నాణ్యమైన జనరిక్ మందులను అందించే లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా విజయవాడలో ఏర్పాటు చేసిన పశు ఔషధ కేంద్రాన్ని మంత్రి సీదిరి అప్పలరాజు ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 52 పశు ఔషధ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

వివరాలు 3 ▸

విదేశాల్లోనూ ఉపాధికి శిక్షణ



రాష్ట్రంలోని యువత విదేశాల్లోనూ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ముందడుగు వేసింది. ఇందుకు తగిన నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు టీపీకేటీ గ్రూప్‌తో ఏపీఎస్‌ఎస్‌డీసీ, ఏపీఎన్‌ఆర్టీఎస్ ఒప్పందం కుదుర్చుకున్నాయి.

వివరాలు 11 ▸

పూర్తి చేసేది మేమే

పోలవరంపై శాసనసభలో సీఎం వైఎస్ జగన్ స్పష్టీకరణ

ఈ ప్రాజెక్ట్ పేరు ఎత్తే అర్హత చంద్రబాబుకు లేదు

- చంద్రబాబు, గజదొంగల బ్యాచ్ ప్రాజెక్ట్‌ను పీల్చి పిప్పి చేశారు
- ఇది చంద్రబాబు ఏటీఎం అని స్వయానా ప్రధానే అన్నారు
- వాళ్ల ధ్యాస నిధులు కాజేయడంపైనే.. అందుకే ముందు పనులు వెనుక.. వెనుకవి ముందు
- ఇష్టారాజ్యంగా పనుల వల్లే దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్
- మనందరి ప్రభుత్వంలో సక్రమంగా ప్రాజెక్ట్ పనులు
- 45.7 మీటర్ల పూర్తి ఎత్తుతో ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నాం
- పోలవరం కోసమే ప్రధాని మోదీతో భేటీ
- చంద్రబాబు, ఎల్లో మీడియా దుష్ప్రచారం నమ్మొద్దు
- 12 నెలల నుంచి 18 నెలల్లో ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తాం



"పోలవరం ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుగా నిర్మిస్తోంది. ఇది కేంద్ర ప్రభుత్వం నిర్మించాల్సిన ప్రాజెక్టు. దీనికోసం కేంద్రం నిధులిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వానిది పర్యవేక్షణ బాధ్యత. అయితే డబ్బులు రావడంలో ఆలస్యమవుతోందన్న కారణంతో పనులు ఆగిపోకూడదని భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ కోసం మన డబ్బులు రూ.2,600 కోట్లు ఇచ్చాం. అవి కేంద్రం నుంచి తెచ్చుకోవడం కోసం వాళ్ల చుట్టూ తిరుగుతున్నాం. ఈ వాస్తవాలను పట్టించుకోకుండా ఎల్లో మీడియా ఏ రకంగా దుష్ప్రచారం చేస్తుందో, ఎవరెవరి హయాంలలో ప్రాజెక్టు కోసం ఏం చేశారో గమనించాలి. ఎట్టి పరిస్థితుల్లో ఈ ప్రాజెక్టును పూర్తి చేసేది మీ జగనే.

– సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'పోలవరం ప్రాజెక్ట్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి స్వప్నం. పోలవరం అంటే వైఎస్సార్... వైఎస్సార్ అంటే పోలవరం. పోలవరం ప్రాజెక్టును ప్రారంభించింది నాన్నే.. పూర్తి చేసేది ఆయన కొడుకుగా నేనే. మీ జగనే' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. 1995 నుంచి 2014 వరకు చంద్రబాబుకు పోలవరం అంటే ఏమిటో తెలియదని, ఆ ప్రాజెక్ట్ పేరు పలకడమే రాదని, అటువంటి చంద్రబాబుకు అసలు పోలవరం ప్రాజెక్ట్ పేరు ఎత్తే అర్హతే లేదని విమర్శించారు. 'పోలవరం ప్రాజెక్టను చంద్రబాబు ఏటీఎంగా వాడుకున్నారని సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీనే నిర్వచించారని గుర్తు చేశారు. చంద్రబాబు, ఆయన గజ దొంగల ముఠా పోలవరం ప్రాజెక్టును పీల్చిపిప్పి చేసి యథేచ్ఛగా దోచుకున్నారని ధ్వజమెత్తారు. పోలవరం ప్రాజెక్ట్ అంశంపై శాసనసభలో గురువారం స్వల్ప కాలిక చర్చలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. 'పోలవరం ప్రాజెక్ట్‌పై ఎల్లో మీడియాలో ఇటీవల వచ్చిన కథనాన్ని చూశాం. అసలు పనులు చేసింది చంద్రబాబేనంటూ ఒక అభూత కల్పనతో

మిగతా 2వ పేజీలో ▶

ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచినది వీరే..


మర్రి రాజశేఖర్ (వైఎస్సార్‌సీపీ)


బొమ్మి ఇజ్రాయెల్ (వైఎస్సార్‌సీపీ)


సూర్యనారాయణ రాజు (వైఎస్సార్‌సీపీ)


జయమంగళ వెంకట రమణ (వైఎస్సార్‌సీపీ)


పోతుల సునీత (వైఎస్సార్‌సీపీ)


చంద్రగిరి ఏసురత్నం (వైఎస్సార్‌సీపీ)


పంచుమర్తి అనురాధ (టీడీపీ)

అధికార పక్షానికి 6

ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆరుగురు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం

- క్రాస్ ఓటింగ్‌తో ఒక ఎమ్మెల్సీ నెగ్గిన టీడీపీ
- 23 ఓట్లతో గెలుపొందిన టీడీపీ అభ్యర్థి పంచుమర్తి అనురాధ
- కొన్నాళ్లుగా టీడీపీకి నలుగురు, జనసేనకు ఒక ఎమ్మెల్యే దూరం
- శాసనసభలో 19కి క్షీణించిన టీడీపీ బలం
- ఒక ఎమ్మెల్సీ దక్కించుకోవాలంటే 22 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం
- గడప గడపలో విఫలమైనవారు, వైఎస్సార్‌సీపీ టికెట్ దక్కదనే సంకేతాలున్న ఎమ్మెల్యేలే లక్ష్యంగా చంద్రబాబు ప్రలోభాల ఎర
- కొన్నాళ్లుగా వైఎస్సార్‌సీపీకి ఇద్దరు ఎమ్మెల్యేలు దూరం.. మరో ఇద్దరిని కొనుగోలు చేసి టీడీపీ అభ్యర్థికి క్రాస్ ఓటింగ్
- ఆది నుంచి ఇదే విధానాలను నమ్ముకున్న టీడీపీ అధినేత
- ఎన్టీఆర్‌కు వెన్నుపోటు నుంచి 23 మంది ఎమ్మెల్యేల కొనుగోళ్ల దాకా అదే పంథా
- తెలంగాణలో ఓటుకు కోట్లు వ్యవహారంలో సాక్ష్యాధారాలతో చిక్కిన బాబు

11లో

ఈ అనుబంధం నిరంతరం

'సాక్షి' 15వ వార్షికోత్సవం సందర్భంగా పాఠకులకు ఎడిటర్ లేఖ

2లో



రాష్ట్రంలో విత్తన పరిశోధన, శిక్షణ సంస్థ

- దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు
- గన్నవరం వద్ద 8 ఎకరాల్లో రూ.45 కోట్లతో నిర్మాణం
- రాష్ట్రంలో విత్తన పరీక్ష వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యం
- రైతులతో పాటు విద్యార్థులకూ శిక్షణ.. నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి కాకాణి

11లో

డీఎస్సీపై త్వరలో ప్రకటన

జూలై–ఆగస్ట్ నాటికి కార్యాచరణ

సీఎం జగన్ ఆదేశాలతో నివేదిక సిద్ధం చేస్తున్నాం: మంత్రి బొత్స



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ ప్రకటనపై త్వరలో స్పష్టత వస్తుందని, ఇందుకు సంబంధించి జూలై–ఆగస్టులో కార్యాచరణ చేపడతామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో గురువారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దశల వారీగా టీచర్ పోస్టులు భర్తీ చేశామన్నారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు ప్రస్తుతం ఉండాల్సిన టీచర్ పోస్టులు ఎన్ని? వాటిలో ఎన్ని పోస్టులు భర్తీ అయ్యాయి? ఇంకా ఎన్ని పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది? అనే అంశాలపై నివేదిక సిద్ధం చేస్తున్నామన్నారు. నివేదికను సీఎంకు వివరించి ఆయన తదుపరి ఆదేశాల మేరకు ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆవిష్కరణలకు ప్రోత్సాహం

- స్టార్టప్‌ల కోసం విశాఖలో ఐస్పేస్ మల్టీ డొమైన్ ఇన్నోవేషన్ హబ్
- 5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో స్టార్టప్ ఎకోసిస్టమ్ అభివృద్ధి
- ఐటీ, ఎలక్ట్రానిక్స్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరిశోధనలకు ప్రోత్సాహకం
- ఆర్‌అండ్‌డీ సెంటర్ల వ్యయంలో 50 శాతం రీయింబర్స్‌మెంట్
- 2023–27 పారిశ్రామిక పాలసీలో స్టార్టప్‌లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

11లో



ఇదండీ సంగతి



విదేశాలకు పారిపోలేదట!
ఆస్తులు కొనుగోళ్లకు వెళ్లాడట!!

పోలవరం పూర్తి చేసేది మేమే

▶ మొదటి పేజీ తరువాయి

కలరింగ్ ఇచ్చేందుకు ప్రయత్నించారు. చంద్రబాబు తాను ప్రజలకు మంచి చేసీ ఇదిగో ఫలానా మంచి చేశాను అని చెప్పి రాజకీయాలు చేయరు. కేవలం ఒక ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, వీళ్లందరికీ తోడు ఒక దత్తపుత్రుడు.. వీళ్ల మీద ఆధారపడి మాత్రమే చంద్రబాబు రాజకీయాలు చేస్తారు. ఒక అబద్ధాన్ని గొప్పగా వందసార్లు చెప్పించే చెప్పి అదే నిజమేనేమో అని భ్రమ కల్పించేలా గోబెల్స్ ప్రచారం చేయగల గొప్ప వ్యక్తి చంద్రబాబు. మాకున్న ఇబ్బంది, వాళ్లకున్న అనుకూలత ఇదే. అందులో భాగంగానే పోలవరం ప్రాజెక్ట్ పనులు చేసింది చంద్రబాబేనంటూ ఎల్లో మీడియాలో అభూత కల్పన సృష్టించేందుకు యత్నిస్తోంది. పోలవరం అనే పదం పలికే అర్హత చంద్రబాబుకు, తెలుగుదేశం పార్టీకి.. వీళ్లను మోస్తున్న ఈనాడు దినపత్రిక రామోజీరావుకు ఉందా అని నేను అడుగుతున్నాను' అని అన్నారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

పోలవరం వైఎస్సార్ డ్రీమ్ ప్రాజెక్టు

- 2004లో నాన్నగారు వైఎస్సార్ ముఖ్యమంత్రి అయ్యాక పోలవరం తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని చెప్పారు. అంత వరకు వీళ్లకు ఈ ప్రాజెక్టు గురించి తెలుసా? 2004కు ముందు తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు ఏం వెలగబెట్టారు? చంద్రబాబు 1995లో మొట్టమొదటసారిగా ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి 2014 వరకు అంటే 19 ఏళ్ల పాటు కనీసం ఈ ప్రాజెక్టు గురించి మాట్లాడారా? అప్పుడు రామోజీరావు, రాధాకృష్ణ, టీవీ5 ఏ గాడిదలు కాస్తున్నారు? వీళ్లంతా ఈరోజు పోలవరం ప్రాజెక్టు చంద్రబాబు కట్టారని, ఉరుకులు, పరుగులు తీయించారని కలరింగ్ ఇస్తున్నారు.
- పోలవరం చంద్రబాబు ఒక్కరికే ఏటీఎం కాదు. చంద్రబాబుకు ఒక గజ దొంగల ముఠా ఉంది. దోచుకో, పంచుకో, తినుకో అనే బ్యాచ్. ఈనాడు దినపత్రిక రామోజీరావు కొడుకు వియ్యంకుడుకి కూడా ఇది ఏటీఎం. నవయుగ అనే ఒక సంస్థ రామోజీరావు కొడుకు వియ్యంకుడిది. ఆ సంస్థకు నామినేషన్ పద్ధతిలో పనులిచ్చారు. ఇంకా కొందరు ఉన్నారు. సుధాకర్ యాదవ్.. అప్పట్లో ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు వియ్యంకుడు. నామినేషన్ పద్ధతిలో పనులు తీసుకుని యథేచ్ఛగా దోచేశారు. వీళ్లు ఏ స్థాయిలో దోచారంటే చివరకి ప్రధాన మంత్రే పోలవరం ప్రాజెక్ట్ వాళ్ల ఏటీఎం అని నిర్వచించారు.

నిధుల పారుదల మీదే టీడీపీ ధ్యాస

- వీళ్లు ఏ స్థాయిలో దోచేశారు అన్నదానికి చిన్న ఉదాహరణ.. మనం అధికారంలోకి వచ్చిన తర్వాత రివర్స్ టెండరింగ్ చేశాం. పనులు రద్దు చేసి రివర్స్ టెండరింగ్ ద్వారా కేటాయించాం. ఆ విధానంలో ఒక్క పోలవరం ప్రాజెక్ట్‌లోనే ఖజానాకు రూ.800 కోట్లు ఆదా అయింది. టీడీపీ ప్రభుత్వంలో పోలవరం పేరు చెబితే వారి జేబుల్లోకి నిధులు పారేవి. ఆ నిధులు లెక్కలు చూసుకునేందుకు ఈ పెద్దమనిషి చంద్రబాబు ప్రతి సోమవారం పోలవరం వెళ్లేవారు.
- ఒక్కో ప్రాజెక్టు కట్టడానికి ఒక్కో పద్ధతి ఉంటుంది. ప్రోటోకాల్ ప్రకారం పనులు చేసుకుంటూ వెళ్తే.. అనుకున్న వ్యవధిలో ప్రాజెక్టు సంపూర్ణంగా పూర్తై ఫలితాలు ఇస్తుంది. అప్పట్లో వాళ్ల దృష్టంతా నిధుల పారుదల మీదే. పోలవరం ప్రాజెక్టును పీల్చి పిప్పి చేసి డబ్బులు ఎలా తీసుకోవాలన్నదానిపైనే వాళ్ల ధ్యాసంతా. అందుకే ఎక్కువ డబ్బులొచ్చే పనులు ముందు.. తక్కువ డబ్బులొచ్చే పనులు తర్వాత చేస్తూ వెళ్లారు. ఇదీ టీడీపీ పోలవరం ఇంజనీరింగ్ డిజైన్.
- పోలవరంలో గోదావరి దాదాపుగా 2,400 మీటర్ల వెడల్పు ఉంటుంది. ఆ ప్రవాహాన్ని మళ్లించి డ్యామ్ నిర్మించాలి. ఇలా నీళ్లు మళ్లించాలంటే ముందుగా స్పిల్ వే నిర్మించాలి. స్పిల్ వే మీదుగా గోదావరి నదిని మళ్లించిన తర్వాతే ఈ 2,400 మీటర్ల వెడల్పు ఉన్న గోదావరి ప్రవాహంలో మొదటి కాఫర్ డ్యామ్ కట్టాలి. ఆ తర్వాత దిగువ నుంచి నీళ్లు రాకుండా రెండో కాఫర్ డ్యాం నిర్మించాలి. ఇలా కట్టడం ద్వారా మధ్యలో నీళ్లు రాకుండా చేసిన తర్వాత ఎర్త్ కమ్ ర్యాక్ ఫిల్ డ్యాం నిర్మించాలి. అంటే ప్రధాన డ్యామ్ నిర్మించాలి. ఇదీ పద్ధతి.



శాసనసభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పోలవరం కోసమే ప్రధానితో సమావేశం

- సాంకేతికంగా అన్ని రకాల అనుమతులు లభించినందున ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేస్తాం. అందుకు అవసరమైన కేంద్ర ప్రభుత్వం సహకారం కోరేందుకే నేను ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశాను. ప్రధానికి వివరించిన అజెండాలో ఈ పాయింట్ కూడా ఉంది. ఈ ప్రాజెక్టు రూ.55,656.87 కోట్లకు సవరించిన అంచనాలను కేంద్ర కేబినెట్ ఆమోదించాలి. అందుకు సమయం పడుతుంది కాబట్టే అడ్‌హాక్ గ్రాంట్ కింద రూ.15 వేల కోట్లు కేటాయించమని ప్రధానిని కోరాం.
- సవరించిన అంచనాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినప్పుడు ఆ మేరకు సర్దుబాటు చేసుకోవచ్చని చెప్పాం. ఈ రూ.15 వేల కోట్లు పూర్తిగా డ్యామ్ ఎత్తు 45.7 మీటర్ల వరకు నిర్మించడానికి సరిపోతుంది. దాంతో పాటు 41.15 మీటర్ల వరకు పూర్తిగా భూసేకరణ, నిర్వాసితుల పునరావాస ప్యాకేజీకి కూడా సరిపోతుంది.
- తర్వాత కనీసం మూడేళ్లలో దశల వారీగా డ్యామ్‌లో నీటిని నింపుకుంటూ పూర్తి సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేసే పరిస్థితి వస్తుంది. అందులో ఎలాంటి తప్పూ లేదు. కావాలనే కొందరు సృష్టిస్తున్న అపోహలను నమ్మొద్దు. కేంద్ర ప్రభుత్వానికి కూడా చెబుతున్నాం. భూసేకరణ, పునరావాస ప్యాకేజీకి మేం వివరాలు ఇస్తాం.. మీరే డీబీటీ బటన్ నొక్కి వారి ఖాతాల్లో డబ్బులు వేయండి.. వారికి పరిహారం చెల్లించండి అని చెప్పాం. అంతా పద్ధతి ప్రకారం జరుగుతోంది. కొందరు ఉన్నవి లేనట్టుగా ఇష్టం వచ్చినట్లు మాట్లాడ్డం సరికాదు.


చంద్రబాబు హయాంలో అసంపూర్ణంగా పనులు

- చంద్రబాబు ప్రభుత్వం స్పిల్ వే పనులను పునాదుల స్థాయిలోనే వదిలేసింది. పునాదులు తర్వాత గేట్లు పెట్టడం వంటివన్నీ అసంపూర్ణంగా వదిలేశారు. మరోవైపు 2,400 మీటర్ల వెడల్పు ఉన్న గోదావరి నదీ ప్రవాహంలో ఏకంగా ఒకవైపు మొదటి కాఫర్ డ్యామ్, ఇంకోవైపు రెండో కాఫర్ డ్యామ్ పనులు మొదలు పెట్టారు.
- కాఫర్ డ్యామ్ పూర్తయితేగానీ నీళ్లు రాలేని పరిస్థితి. అలాంటప్పుడు నీళ్లు ఇంకోవైపు డైవర్ట్ చేసే స్పిల్‌వే పని అవ్వకుండా కాఫర్ డ్యామ్ ఎలా పూర్తి చేస్తారు? అప్పుడు 2,400 మీటర్ల వెడల్పున ప్రవాహం ఎలా వెళ్తుంది? స్పిల్ వే పూర్తి కాలేదు. అప్రోచ్ ఛానెల్ పనులు జరగలేదు. స్పిల్ ఛానెల్ పనులు జరగలేదు. ఇలాంటప్పుడు నీళ్లు ఎలా మళ్లిస్తారు?
- కాబట్టి కాఫర్ డ్యామ్ పనులు కూడా ఆగిపోయాయి. కారణం సీజన్ వచ్చిందంటే గోదావరి నదిలో నీళ్లు వదిలేయాలి. మరో ఆప్షన్ లేదు. మెయిన్ లైన్లోంచే నీళ్లు వదలాలి. 2,400 మీటర్ల స్థానంలో 1,600 మీటర్ల మేర కాఫర్ డ్యామ్ కట్టి రెండు గ్యాప్‌లు నాలుగు వందలు మీటర్లు చొప్పున వదిలారు. అప్పుడు నీళ్లు ఉధృతంగా వచ్చే చోట కేవలం రెండు గ్యాపుల్లో నుంచి ప్రవహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో డయాఫ్రమ్ వాల్‌ను దెబ్బ తీసింది. కాఫర్ డ్యామ్‌లో పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి.
- బుద్ధి ఉన్న వారెవరైనా.. స్పిల్ వే పూర్తి కాకుండా కాఫర్ డ్యామ్ పనులు ఎలా ముట్టుకున్నారని గడ్డి పెట్టాల్సింది. కానీ అలా చేయలేదు. కాఫర్ డ్యామ్ పూర్తి కాకుండా డయాఫ్రమ్ వాల్ అంటే మెయిన్ డ్యామ్‌కు పునాది గోడ వేశారు. ఇలా ఎందుకు కట్టారు.. బుద్ధుందా అని రెండో ప్రశ్న అడగాలి.
- మనం అధికారంలోకి వచ్చాక 2020లో గోదావరిలో ఎప్పుడూ ఊహకందని విధంగా వరద వచ్చింది. గోదావరి వందేళ్ల చరిత్రలో రెండో అతిపెద్ద వరద. స్పిల్ వే మీదుగా నీళ్లు మళ్లించలేని పరిస్థితి ఏర్పడింది. అప్పుడు స్పిల్‌వేలో పియర్స్ ఫౌండేషన్, గేట్లు పెట్టే పనులు జరుగుతున్నాయి. నీళ్లు అటువైపు మళ్లించడం సాధ్యం కాలేదు. రెండో వైపున చిన్న చిన్న గ్యాపుల్లోంచి నీళ్లు రావాలి. దాంతో కోతకు గురైంది.

45.7 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తాం

- ప్రజల్లో అపోహలు సృష్టించేందుకే డ్యామ్ ఎత్తు తగ్గిస్తున్నామని మాటి మాటికి దుష్ప్రచారం చేస్తున్నారు. 41.15 మీటర్ల ఎత్తుకే కడుతున్నారని చంద్రబాబు, ఈనాడు రామోజీరావు, ఆంధ్రజ్యోతి, టీవీ5 వీళ్లంతా ఒక పద్ధతి ప్రకారం దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజలందరికీ ఒక విషయం స్పష్టంగా చెబుతున్నాను. డ్యామ్ పూర్తి ఎత్తు మేరకు అంటే 45.7 మీటర్లకు నిర్మిస్తాం.
- డ్యామ్ భద్రత కోసం సీడబ్ల్యూసీ నిబంధనలను అనుసరించి ఒకేసారి డ్యామ్ అంతా నింపకూడదు. సీడబ్ల్యూసీ గైడ్ లైన్స్ ప్రకారం నిల్వ సామర్థ్యంలో మొదటి ఏడాది 1/3వ వంతు,, రెండవ ఏడాది 2/3వ వంతు, మూడవ ఏడాది గరిష్ట స్థాయిలో నీటిని నిల్వ చేయాలి.
- తొలి ఏడాది 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పించి డ్యామ్‌లో నీటిని నిల్వ చేస్తాం. 45.72 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికి అయ్యే వ్యయాన్ని కేంద్రం సర్దుబాటు చేయడానికి రెండేళ్ల వ్యవధి ఉంటుంది. కేంద్రం నిధులు ఇవ్వగానే ఆ తర్వాత రెండేళ్లలో నిర్వాసితులకు పునరావాసం కల్పించి పూర్తి స్థాయిలో.. అంటే 194.6 టీఎంసీలను నిల్వ చేస్తాం. అప్పుడు నిర్వాసితుల పునరావాస ప్యాకేజీ ఇవ్వడానికి కూడా వాళ్లకు సమయం వెసులుబాటు కూడా ఉంటుంది.
- నిర్వాసితులకు మరింత మేలు చేసేందుకు ప్రతి ముంపు కుటుంబానికి రూ.10 లక్షలు ఇస్తామన్న హామీకి కట్టుబడి ఉన్నాం. ఆ హామీ ప్రకారం కేబినెట్‌లో తీర్మానం చేసి జీవో కూడా ఇచ్చాం. 41.15 మీటర్లు వచ్చే లోపు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరో రూ.550 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. దానికి కూడా మేం సిద్ధంగా ఉన్నాం.

12 నుంచి 18 నెలల్లో ప్రాజెక్ట్ పూర్తి చేస్తాం



- మనం అధికారంలోకి వచ్చాక వీటన్నింటినీ రిపేరు చేస్తూ అడుగులు ముందుకు వేశాం. అప్రోచ్ ఛానెల్ మీదుగా స్పిల్ ఛానెల్‌ను, స్పిల్ ఛానెల్ దిగువన పైలెట్ ఛానెల్‌ను పూర్తిగా నిర్మించాం. ఈ రోజు స్పిల్‌వే అన్ని రకాలుగా పూర్తైంది. నీళ్లు కూడా స్పిల్ వే మీదుగా వస్తున్నాయి. 48 గేట్లు పెట్టాం. అందువల్లే గోదావరి వందేళ్ల చరిత్రలో రెండో అతిపెద్ద వరద వచ్చినా సమర్థవంతంగా స్పిల్‌వే ద్వారా వరదను నియంత్రించగలిగాం.
- ఎగువ కాఫర్ డ్యామ్‌ను గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసింది. ఆ రెండు ఖాళీలను కూడా పూర్తి చేశాం. జరిగిన నష్టాన్ని ఇసుక వేసి వైబ్రో కంపాక్షన్ చేసి.. అన్ని రకాలుగా ఎగువ కాఫర్ డ్యామ్ పూర్తి చేశాం. మెయిన్ డ్యామ్‌లో భాగమైన గ్యాప్ 3 వద్ద కాంక్రీటు పనులు పూర్తి చేశాం.
- 2021 జూన్ 11న గోదావరి వరద ప్రవాహాన్ని స్పిల్‌వే మీదుగా మళ్లించాం. అనూహ్య వరదల కారణంగా కాఫర్ డ్యామ్ దెబ్బతినకుండా అప్పటికప్పుడు ఒక మీటరు ఎత్తు కూడా పెంచగలిగాం. దిగువ కాఫర్ డ్యామ్‌లో కోతకు గురైన ప్రదేశాన్ని కూడా పూడ్చాం. పనుల సీజన్ మొదలు కాగానే ఎంత వేగంగా పనిచేయాలో అంతవేగంగా పని చేశాం.
- ఇప్పటికి పోలవరం నిర్మాణంలో స్పిల్ వే పూర్తయింది. డెడ్‌స్టోరేజీ ద్వారా, రివర్స్‌సూస్ ద్వారా గోదావరి డెల్టాకు నీరిచ్చే పరిస్థితి ఉంది. ఈ మధ్య కాలంలోనే ఎన్‌హెచ్‌పీసీ వాళ్లు డిజైన్స్ క్లియరెన్స్ కూడా ఇచ్చారు కాబట్టి ఈ సీజన్‌లో పనులు వేగంగా పద్ధతి ప్రకారం జరుగుతున్నాయి.
- వర్షాకాలం వచ్చినా మెయిన్ డ్యామ్ నిర్మిస్తున్నాం. 2022 నవంబర్‌లో తిరిగి దిగువ కాఫర్ డ్యామ్ పనులు మొదలుపెట్టాం. 2023 ఫిబ్రవరి 14 నాటికి దిగువ కాఫర్ డ్యామ్ పనులను విజయవంతంగా పూర్తి చేశాం. ఎన్‌హెచ్‌పీసీ వారి ద్వారా డయాఫ్రం వాల్ టెస్టులు చేసి, ఆ రిపోర్టులను సీడబ్ల్యూసికి, డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానెల్‌కు పంపించాం. వాళ్లు ఈ ఏడాది మార్చి 3, 4 తేదీల్లో ప్రాజెక్టును సందర్శించి సమావేశం నిర్వహించారు. డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న ప్రదేశాలలో సమాంతరంగా డయాఫ్రం వాల్ కట్టాలని నిర్ణయించాం. అ పనులు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. మరో 12 నెలల నుంచి 18 నెలల వ్యవధిలో ప్రాజెక్టు పనులన్నీ పూర్తి చేసేలా కార్యాచరణ వేగవంతం చేశాం.

ఈ అనుబంధం నిరంతరం!

ఉగాదులు ఏటేటా వస్తూనే ఉంటాయి. ఎన్ని మధురోహలను అవి మిగిల్చి వెళ్తున్నాయన్నదే ముఖ్యం. ఉషస్సులు రోజూ పూస్తూనే ఉంటాయి. వాటి కాంతులు ఎన్ని క్రాంతుల్ని వెలిగించాయన్నదే ప్రధానం. పుట్టిన ప్రతి జీవికీ కాలంలో ఒక కొలమానం ఉంటుంది. జట్టు కట్టిన ప్రతి సంస్థకు కూడా ఆయుర్దాయం లెక్కలుంటాయి. ఆ కొలమానాలు, ఆయుర్దాయాలు దస్తావేజుల కోసం మాత్రమే. ఎంతకాలం బతికామన్నది కాదు, ఎలా బతికామన్నది ముఖ్యం. క్వాలిటీ ఆఫ్ లైఫ్ ముఖ్యం. వ్యక్తికైనా, వ్యవస్థకైనా ఈ సూత్రం వర్తిస్తుంది. వ్యక్తుల జీవిత లక్ష్యాలను ఎవరికి వారే నిర్ణయించుకుంటారు. ఎంతవరకు విజయం సాధించారో తూకం వేయగల తీర్పరులు కూడా ఎవరికి వారే! వ్యవస్థల లక్ష్యాలను సమష్టి తత్వం నిర్ణయిస్తుంది. ఆ వ్యవస్థల జయాపజయాలపై భాష్యం చెప్పగలిగే వారెవ్వరు? ఆ వ్యవస్థల ద్వారా ప్రభావితమయ్యే విశాల పౌరసమాజం మాత్రమే. వ్యవస్థల పనితీరును బట్టి వాటిలో ఎప్పటికప్పుడు ఆయుష్షును నింపగలిగే ఆక్సిజన్ యంత్రం సమాజం దగ్గరే ఉంటుంది.

'సాక్షి'దినపత్రిక తెలుగింటి తలుపు తట్టి నేటికి సరిగ్గా పదిహేనేళ్లవుతున్నది. తన పదిహేనేళ్ల కాలగమనంలో ఏరోజున కూడా మిలియన్ కాపీల మార్కును తగ్గకుండా తలెత్తుకుని నిలబడిన పత్రిక బహుశా 'సాక్షి'ఒక్కటే! ఏబీసీ లెక్కల ప్రకారం సగటున 12 లక్షల సర్క్యులేషన్‌ను 'సాక్షి'సాధించింది. ఈ ఒక్క మెతుకు చాలు అన్నం ఉడికిందో లేదో తేల్చడానికి! పన్నెండు లక్షల తెలుగు కుటుంబాల్లో సాక్షి 'ఫ్యామిలీ'మెంబర్‌గా మారింది. 'సాక్షి'ని తమ ఇంటి మనిషిగా ఆ కుటుంబాలు నేటికీ సమాదరిస్తున్నాయి. ఒక పత్రికను ప్రజలు ఎందుకు ఇంతగా ఆదరిస్తారు? అందుకు తగిన కారణాలుండాలి కదా! ఉన్నాయి. లక్షలాది కుటుంబాలతో అనుబంధం పెనవేసుకోవడం వెనుక పదిహేనేళ్ల సౌభ్రాతృత్వం ఉన్నది. సంఘీభావం ఉన్నది. సాహచర్యం కొనసాగుతున్నది. తన పాఠక కుటుంబాల్లోని ప్రతి ఉద్వేగాన్ని 'సాక్షి'పంచుకున్నది. వారి ఆనందంలో కేరింతలు కొట్టింది. దుఃఖంలో కన్నీరు తుడిచింది. వారి పోరాట స్ఫూర్తికి పదును పెట్టింది. విజయాలకు పరవశించింది. కింద పడితే చేయందించింది. అడుగడుగునా తోడునీడగా నిలవడానికి తన శక్తిమేరకు 'సాక్షి'పని చేసింది.అందుకే ఈ చెక్కుచెదరని ప్రజాదరణ.

సమస్యలు వ్యక్తిగతమా... సామూహికమా అన్న తేడాను చూడలేదు. న్యాయమైన పరిష్కారం కోసం బాధితులతో కలిసి నడుం కట్టింది. సిద్దిపేటలో శ్రీనివాస్ అనే ఓ నిరుపేద కరోనాతో కన్నుమూశాడు. భార్యాబిడ్డల్ని అద్దె ఇంటి ఓనర్ గెంటేశాడు. ఇద్దరు బిడ్డలతో అభాగ్యురాలు నడివీధిన నిలబడి రోదించింది. 'సాక్షి'అండగా నిలబడింది. ప్రభుత్వం తరఫున ఆమెకో గదిని కేటాయింపజేసింది. ఉత్తరాంధ్ర గిరిజన పల్లెల్లో ప్రసవం కోసం గర్భిణీ స్త్రీలను డోలీల్లో మోసుకొని వెళ్లేవారు. కొండదారుల్లో కిలోమీటర్ల పర్యంతం అలా వెళ్లాల్సి వచ్చేది. అనేకమార్లు దురదృష్టకర మరణాలు కూడా సంభవించేవి. ఈ అమానుషత్వంపై 'సాక్షి'ఒక ఉద్యమాన్నే నడిపింది. ప్రభుత్వం మారిన వెంటనే స్పందన లభించింది. గర్భిణీ స్త్రీలను ప్రసవ తేదీకి వారం రోజుల ముందుగానే అతిథి గృహాల్లో చేర్చుతున్నారు. అనంతరం ఆస్పత్రికి పంపించి సుఖప్రసవం జరిగేలా చూస్తున్నారు. ప్రసవం తర్వాత అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి తల్లీబిడ్డల్ని ఇంటికి సాగనంపుతున్నారు. ఇవి మచ్చుకు మాత్రమే. ఇటువంటి ఉదాహరణలు 'సాక్షి'అనుభవంలో కొన్ని వందలున్నాయి.

ప్రజల తరఫున ఉద్యమాలకూ, పోరాటాలకు మాత్రమే 'సాక్షి'పరిమితం కాలేదు. సకుటుంబ సపరివారానికి సలహాదారు పాత్రను కూడా పోషించింది. సాధికారికంగా సలహాలివ్వగలిగే నిపుణులను పరిచయం చేసింది. ఈ పదిహేనేళ్లలో లక్షలాదిమంది విద్యార్థులు, ఉద్యోగార్థులూ తమ 'భవిత'ను 'సాక్షి'లో వెతుక్కున్నారు. సివిల్స్, గ్రూప్ 1, 2 వంటి పోటీ పరీక్షలైనా, అకడమిక్ కోర్సులైనా, క్యాట్, గేట్, నీట్, ఐఐటీ, ఎంసెట్ ప్రవేశ పరీక్షలైనా విద్యార్థులు ముందుగా చూసేది సాక్షినే. ఇప్పటికీ ఈ ఒరవడి కొనసాగుతూనే ఉన్నది. డైలీ ఫీచర్స్‌కు కొత్త అర్థాన్ని చెబుతూ 'ఫ్యామిలీ'పేరుతో ప్రతిరోజూ ఒక ఇంద్ర ధనుసునే 'సాక్షి'అందజేస్తున్నది. ఫ్యామిలీ బాస్‌గా ఇల్లాలినే పరిగణిస్తూ, ఆమె కేంద్రకంగానే ఫీచర్స్ కథనాలను రూపొందిస్తున్నది. స్ఫూర్తిదాయకమైన మహిళా విజయాలు, చైతన్యం, ఆర్థిక స్వావలంబన, పిల్లల పెంపకం, పెద్దల కేరింగ్ వంటి అంశాల్లో ఎన్నో అమూల్యమైన కథనాలు 'సాక్షి'పేజీలను అలంకరించాయి. ఫ్యామిలీ పేజీల శీర్షికలన్నీ కూడా పాఠకులకు కంఠోపాఠమే.

మట్టిలోని మాణిక్యాలను వెలికితీసే పనిలో కూడా 'సాక్షి'నిమగ్నమై పనిచేస్తున్నది. అటువంటి మాణిక్యాలకు 'సాక్షి'ఎక్సలెన్స్ అవార్డులను అందజేసి గౌరవిస్తున్నది. గుర్తింపు కోరుకోకుండా, ప్రశంసల కోసం పాకులాడకుండా తమ పోరాటాల్లో మునిగి తేలుతున్న ఎంతోమంది రియల్ హీరోలను వెతికి లోకానికి పరిచయం చేస్తున్నందుకు 'సాక్షి'గర్విస్తున్నది. సుస్థిర సేద్య పద్ధతులు కూడా వ్యవసాయరంగ సంక్షోభ పరిష్కారానికి ఒక మార్గమని బలంగా నమ్మిన 'సాక్షి'పదిహేనేళ్లుగా తన సాగు'బడి'లో ఈ పాఠాలను బోధిస్తున్నది. ఈ రోజున తెలుగు రాష్ట్రాల్లోని లక్షలాదిమంది రైతులు పాటిస్తున్న ప్రకృతి సేద్య విధానాల వెనుక తను పోషించిన వైతాళిక పాత్రను 'సాక్షి'వినమ్రంగా చాటుకుంటున్నది. చిన్నారులకోసం స్పెల్‌బీ, మ్యాథ్స్ బీ వంటి మెదడుకు మేత వేసే కార్యక్రమాలు, యువతరంలో క్రీడా స్ఫూర్తిని నింపడం కోసం 'సాక్షి ప్రీమియర్ లీగ్'పోటీలు ప్రతిఏటా 'సాక్షి'నిర్వహిస్తున్నది. ఇలా అన్ని వయసుల ప్రజలకూ, అన్ని శ్రేణుల సమూహాలకు ఉపయుక్తమయ్యే కార్యక్రమాలను భుజాన వేసుకొన్న 'సాక్షి'నేడు జనం గుండెచప్పుడుగా మారింది. అందుకే ఈ ఆదరణ.

'సాక్షి'పుట్టుకే ఒక లక్ష్యంకోసం. 'సాక్షి'వ్యవస్థాపకులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరచుగా చెప్పేమాట – 'ఎంతకాలం బతికామన్నది కాదు, ఎలా బతికామన్నది ముఖ్యం!' ఆయన బలంగా నమ్మే సిద్ధాంతం – విశ్వసనీయత! ఈ రెండంశాలు 'సాక్షి'కి సర్వదా శిరోధార్యాలు. ఏకపక్ష వార్తల చీకటి యుగాన్ని చీల్చి చెండాడుతూ, నాణేనికి మరోవైపు కోణాన్ని పరిచయం చేసే లక్ష్యంతో 'సాక్షి'ఆవిర్భవించింది. లక్ష్యసాధనలో విజయం సాధించిందని చెప్పడానికి పాఠకాదరణే ఒక కొలమానం. పత్రికా రచనలోనూ, ప్రచురణలోనూ నాణ్యత, విశ్వసనీయత పాళ్లను ఏమాత్రం తగ్గకుండా 'సాక్షి'సర్వశక్తులా ప్రయత్నిస్తున్నది. ఇన్నేళ్లుగా తమ కుటుంబ సభ్యురాలిగా అక్కున చేర్చుకున్న లక్షలాది పాఠక మహాశయులకూ, వారి ఆత్మీయతకూ 'సాక్షి'శిరస్సు వంచి నమస్కరిస్తున్నది. అండగా నిలబడుతున్న ప్రకటనకర్తలకు, తోడుగా నడుస్తున్న ఏజెంట్లకు, తెల్లవారక ముందే పాఠకుల ఇళ్లకు చేరవేస్తున్న పేపర్ బాయ్స్‌కు 'సాక్షి'సిబ్బంది – యాజమాన్యం తరఫున శతాధిక వందనాలు, ధన్యవాదాలు. గతంలాగే ఇకముందు కూడా పాఠక కుటుంబాల్లో సభ్యురాలి పాత్రను 'సాక్షి'పోషిస్తుంది. మీతో కలిసి నడుస్తుంది. కలిసి ఆడుతుంది. పాడుతుంది. అవసరమైతే మీతో కలిసి మీ తరఫున పోరాడుతుంది. ఈ అనుబంధం నిరంతరం కొనసాగుతుంది.

– ఎడిటర్

నేటి నుంచి రంజాన్

సాక్షి, హైదరాబాద్: నెలవంక దర్శనమివ్వడంతో రంజాన్ నెల ప్రారంభమైనట్లు సైరన్లు మోగించి మతగురువులు ప్రకటించారు. శుక్రవారం తెల్లవారుజామున సహర్‌తో ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయి. కాగా, మూడేళ్లుగా కరోనాతో హైదరాబాద్ నగరంలో రంజాన్ సందడి అంతగా కనిపించలేదు. ఈ ఏడాది కరోనా ప్రభావం తగ్గడంతో రంజాన్ కళ మళ్లీ తిరిగి రానుంది. ముస్లింలు ఉపవాస దీక్షలు కొనసాగిస్తున్నారు.

క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే జీవితం

- అదే రంజాన్ సందేశం
- ముస్లింలకు సీఎం జగన్ శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: ఎంతో పవిత్రమైన రంజాన్ మాసం ప్రారంభమవుతున్న సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మహనీయుడైన మహ్మద్ ప్రవక్త ద్వారా దివ్య ఖురాన్ ఆవిర్భవించిన ఈ మాసంలో.. నెల రోజులపాటు నియమ నిష్ఠలతో ముస్లింలు కఠిన ఉపవాస వ్రతం ఆచరించి అల్లాహ్ కృపకు పాత్రులవుతారని అన్నారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే జీవితమని రంజాన్ మాసం గొప్ప సందేశం ఇస్తోందని చెప్పారు. 'కఠిన ఉపవాస దీక్ష (రోజా) ఆచరిస్తూ, దైవ చింతనతో గడిపే ఈ మాసంలో ముస్లింలు తమ సంపాదనలో కొంత భాగాన్ని పేదలకు దాన ధర్మాల ద్వారా ఖర్చు చేస్తారు.

మనిషిలోని చెడు భావాల్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపుతూ మానవాళికి హితాన్ని బోధించే పండుగ రంజాన్. ఈ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లింలు అందరికీ శుభాకాంక్షలు' అని సీఎం పేర్కొన్నారు. ఈ మేరకు సీఎంవో గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది.

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన నూతన ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



సీఎం జగన్‌ను కలిసిన రామసుబ్బారెడ్డి

సాక్షి, అమరావతి: ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి గురువారం అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డిని సీఎం జగన్ అభినందించారు.

'సాక్షి' రక్తదాన శిబిరానికి విశేష స్పందన

- 15వ వార్షికోత్సవం సందర్భంగా విజయవాడలో రక్తదాన శిబిరం
- రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకుతో కలిసి నిర్వహణ
- రక్తదానం చేసిన సాక్షి సిబ్బంది, శ్రేయోభిలాషులు
- విశాఖలో ఆర్‌కే బీచ్ క్లీనింగ్



విజయవాడలోని సాక్షి ప్రధాన కార్యాలయంలో రక్తదానం చేస్తున్న దృశ్యం



విశాఖ ఆర్‌కే బీచ్‌లో చెత్త, వ్యర్థాలు సేకరిస్తున్న సాక్షి సిబ్బంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): సాక్షి దినపత్రిక 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఆటోనగర్‌లోని 'సాక్షి' ప్రధాన కార్యాలయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఈ రక్తదాన శిబిరం నిర్వహించారు. సాక్షి సిబ్బందితోపాటు శ్రేయోభిలాషులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. సాక్షి 15వ వార్షికోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్న పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకొచ్చారు. సాక్షి సిబ్బందితోపాటు విజయవాడ వన్‌టౌన్‌లోని కేబీఎన్ కళాశాల విద్యార్థులు, అజిత్‌సింగ్‌నగర్, సత్యనారాయణపురం, పటమట, ఆటోనగర్ తదితర ప్రాంతాలకు చెందిన శ్రేయోభిలాషులు కలిపి మొత్తం 60 మంది రక్తదానం చేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన రక్తదాన శిబిరం మధ్యాహ్నం 2 గంటల వరకూ కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని సాక్షి బ్రాంచి మేనేజర్ ఆర్.యశోద రాజ్, క్లస్టర్ ఇన్‌చార్జి ఎస్.వెంకటరెడ్డి, బ్యూరో ఇన్‌చార్జి ఒ.వెంకట్రామిరెడ్డి పర్యవేక్షించారు.

విశాఖలో ఆర్‌కే బీచ్‌ను శుభ్రం చేసిన 'సాక్షి' సిబ్బంది

బీచ్‌రోడ్డు: 'సాక్షి' దినపత్రిక 15వ వార్షికోత్సవం సందర్భంగా విశాఖపట్నం యూనిట్ ఆధ్వర్యాన ఆర్‌కే బీచ్ క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. 'సాక్షి' అడ్మినిస్ట్రేటివ్, ఎడిటోరియల్, రిపోర్టింగ్, యాడ్స్, సర్క్యులేషన్, టీవీ తదితర విభాగాలకు చెందిన సిబ్బంది గురువారం బీచ్‌లో చెత్త, వ్యర్థాలు సేకరించి జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బందికి అందించారు. విశాఖ సాగరతీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల మరింత అందంగా ఉంటుందని, పర్యాటకులను ఆకర్షిస్తుందని ఈ సందర్భంగా విశాఖపట్నం యూనిట్ బ్రాంచి మేనేజర్ చంద్రరావు అన్నారు.

ఆయుష్ శాఖ పోస్టుల పరీక్షల హాల్ టికెట్లు సిద్ధం

సాక్షి, అమరావతి: ఆయుష్ శాఖలోని పలు పోస్టుల భర్తీకి నిర్వహించనున్న పరీక్షల హాల్ టికెట్లను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. మెడికల్ ఆఫీసర్, లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఏప్రిల్ 1 నుంచి 3వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు.

రాష్ట్ర ఉపాధి హామీ మండలి భేటీ

సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనుల కల్పన పనులను పర్యవేక్షించే రాష్ట్ర ఉపాధి హామీ మండలి సమావేశం గురువారం తాడేపల్లిలోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో జరిగింది. ఉప ముఖ్యమంత్రి (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ) బూడి ముత్యాలనాయుడు, శాఖకమిషనర్ కోన శశిధర్, అడిషనల్ కమిషనర్ రావిరాల మహేష్ కుమార్ పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించిన ప్రజంటేషన్‌ను కమిషనర్ శశిధర్ సభ్యులకు ప్రదర్శించారు.

క్లుప్తంగా...

శ్రీనాథ్‌రెడ్డి మృతిపట్ల గవర్నర్ విచారం

సాక్షి, అమరావతి: సీనియర్ జర్నలిస్ట్, ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి మృతిపట్ల గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ విచారం వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాలపాటు జర్నలిస్టుగా, మూడేళ్లపాటు ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ఆయన విశేషసేవలు అందించారని పేర్కొన్నారు. దేవిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి కుటుంబసభ్యులకు గవర్నర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపినట్లు రాజ్‌భవన్‌వర్గాలు గురువారం వెల్లడించాయి.

ఆర్టీసీలో 'పది' విద్యార్థులకు ఉచిత ప్రయాణం

సాక్షి, అమరావతి: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఏప్రిల్ 3 నుంచి 18 వరకు నిర్వహించే పదో తరగతి పరీక్షలకు 6,64,153 మంది హాజరుకానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3,348 కేంద్రాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఆర్టీసీ బస్ పాస్‌తో నిమిత్తం లేకుండా హాల్ టికెట్ ఉన్న విద్యార్థులకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేఎస్‌బీ రెడ్డి గురువారం ఆదేశించారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పల్లె వెలుగు, సిటీ బస్ సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణానికి అనుమతించాలని పేర్కొన్నారు.

స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్‌పర్సన్, సభ్యుల బాధ్యతల స్వీకరణ


ప్రొఫెసర్ శెట్టిపల్లి రత్నకుమారి

సాక్షి, అమరావతి/ తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్ర 5వ ఫైనాన్స్ కమిషన్ చైర్‌పర్సన్‌గా ప్రొఫెసర్ శెట్టిపల్లె రత్నకుమారి, నలుగురు సభ్యులు బాధ్యతలను స్వీకరించారు. గురువారం సచివాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల స్టేట్ ఫైనాన్స్ కమిషన్‌ను నియమించిన విషయం తెలిసిందే. రత్నకుమారి గతంలో పద్మావతి మహిళా వర్సిటీ వీసీగా పనిచేశారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఏర్పాటు చేసే పలు కమిటీల్లో సభ్యురాలిగా కూడా ఉన్నారు. ఆమెతో పాటు మెంబర్ సెక్రటరీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంపీ రమణారెడ్డి, సభ్యులుగా రిటైర్డ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎంపీఎస్ పద్మారావు, రిటైర్డ్ రెక్టర్ ఎం.ప్రసాద రావులు కూడా బాధ్యతలు తీసుకున్నారు.

16.8 కోట్ల మంది డేటా చోరీ!

తెలంగాణ

- రక్షణ శాఖకు చెందిన 2.55 లక్షల మంది సహా వివిధ వర్గాల ప్రజల వివరాలు విక్రయం
- ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసిన హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు



హైదరాబాద్: వందలు.. వేలు.. లక్షలు కాదు.. ఏకంగా కోట్లాది మందికి సంబంధించిన వ్యక్తిగత సమాచారం చోరీకి గురైంది. రక్షణ శాఖ సహా వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు చెందిన లక్షలాది మంది ప్రభుత్వాధికారులు, ఉద్యోగుల డేటా అంగడి సరుకుగా మారింది. పాన్, ఫోన్ నంబర్లు, వాట్సాప్, ఫేస్‌బుక్ యూజర్ల వివరాలు క్రిమినల్స్ పరమయ్యాయి. దేశ భద్రతకు ముప్పు కలిగించే స్థాయిలో డేటా చోరీకి పాల్పడుతున్న ఓ ముఠా గుట్టును సైబర్‌క్రైం పోలీసులు రట్టు చేశారు. దేశవ్యాప్తంగా 16.80 కోట్ల మందికి చెందిన వ్యక్తిగత, రహస్య సమాచారాన్ని దొంగిలించి విక్రయిస్తున్న కేటుగాళ్ల ఆటకట్టించారు. ఢిల్లీ శివార్లలోని నోయిడా కేంద్రంగా ఈ దందా సాగిస్తున్న ముఠాలోని ఏడుగురు సభ్యులను అరెస్టు చేశారు. సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఈ కేసు వివరాలను గురువారం మీడియాకు వెల్లడించారు. రక్షణ శాఖలోని వివిధ హోదాల్లో పనిచేసే అధికారులు, నీట్ విద్యార్థులు, డీమ్యాట్ ఖాతాదారులు, ఐటీ సంస్థల ఉద్యోగులు, వాట్సాప్, ఫేస్‌బుక్ వినియోగదారులు, టెలికం, ఫార్మా కంపెనీలు, సీబీఎస్ఈ 12వ తరగతి విద్యార్థుల డేటా సహా మొత్తం 140 కేటగిరీలకు చెందిన సమాచారాన్ని నిందితులు చోరీ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. రక్షణ శాఖకు చెందిన (డిఫెన్స్ ఫోర్స్ ఢిల్లీ ఎన్‌సీఆర్ డేటాబేస్) 2.55 లక్షల మంది డేటా సైతం చోరీకి గురికావడంతో దేశ భద్రతకు ముప్పు వాటిల్లే వీలుందని ఆందోళన వ్యక్తం చేశారు. డేటా చోరీలో జస్ట్ డయల్ అనే సెర్చ్ ఇంజన్ పాత్ర ఉందని, ఈ కేసులో ఆ సంస్థ వారినీ విచారిస్తామని ఆయన పేర్కొన్నారు.

నిందితులు వీరే...

యూపీ పరిధిలోకి వచ్చే నోయిడాలో డేటా మార్ట్ ఇన్ఫోటెక్, గ్లోబల్ డేటా ఆర్ట్స్, ఎంఎస్ డిజిటల్ గ్రో అనే కంపెనీల(కాల్‌సెంటర్లు) ద్వారా నిందితులు కార్యకలాపాలు సాగిస్తున్నారు. ప్రధాన నిందితుడు ఏ1 కుమార్ నితీష్ భూషణ్‌తోపాటు టెలికాలర్ కుమారి పూజ, డేటా ఎంట్రీ ఆపరేటర్ సుశీల్ తోమర్, క్రెడిట్ కార్డుల డేటా విక్రయించే అతుల్ సింగ్, ఎంఎస్ గ్రో కంపెనీలో సేకరించిన డేటాను విక్రయించే ముస్కాన్ హసన్, గ్లోబల్ డేటాఆర్ట్స్‌లో జస్ట్ డయల్ ద్వారా డేటాను విక్రయించే సందీప్ పాల్, బల్క్ మెసేజ్‌లు పంపే జియా ఉర్ రెహమాన్‌లను ఢిల్లీలో అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 12 సెల్‌ఫోన్లు, 3 ల్యాప్‌టాప్‌లు, 2 సీపీయూలు, 140 కేటగిరీలలో డేటా చోరీ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇప్పటి వరకు సుమారు 100 మంది సైబర్ క్రిమినల్స్‌కు డేటాను విక్రయించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తెలిసిందని స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. డేటా చోరీపై సైబర్‌క్రైం పోలీసులకు అందిన పలు ఫిర్యాదుల ఆధారంగానే దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్నామన్నారు. దేశ భద్రతకు సంబంధించిన సమాచారం ముడిపడి ఉన్నందున డేటా చోరీ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.

నిందితులు చోరీ చేసిన డేటాలో 1.47 కోట్ల కార్ల యజమానుల, డొమైన్ వాయిస్ డేటాబేస్ 3.47 కోట్లు, మొబైల్ నంబర్ల డేటాబేస్ 3 కోట్లు, స్టూడెంట్ డేటాబేస్ 2 కోట్లు, వాట్సాప్ యూజర్లు 1.2 కోట్ల మంది డేటా చోరీ గురైంది. అలాగే జాబ్ సీకర్స్ డేటాబేస్ 40 లక్షలు, సీబీఎస్ఈ 12వ తరగతికి చెందిన 12 లక్షల మంది విద్యార్థులు, సివిల్ ఇంజనీర్ల వివరాలు 2.3 లక్షలు, డెబిట్ కార్డుల సమాచారం 8.1 లక్షలు, సీనియర్ సిటిజన్స్ 10.6 లక్షలు, వెబ్‌సైట్ ఓనర్స్ 17.4 లక్షలు, వర్కింగ్ ప్రొఫెషనల్స్ డేటా చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు.

దేశంలోనే తొలి జనరిక్ పశు ఔషధ కేంద్రం

విజయవాడలో ప్రారంభించిన మంత్రి అప్పలరాజు


జనరిక్ పశు ఔషధ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అప్పలరాజు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పశు పోషకులకు తక్కువ ధరలకే నాణ్యమైన పశువుల జనరిక్ మందులను అందించే లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా వైఎస్సార్ పశు ఔషధ నేస్తం పథకాన్ని అందుబాటులోకి తెస్తున్నామని పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 52 పశు ఔషధ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విజయవాడలోని పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి జనరిక్ పశు ఔషధ కేంద్రాన్ని గురువారం మంత్రి అప్పలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా మొబైల్ అంబులేటరీ క్లినిక్‌లను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి జనరిక్ పశు ఔషధ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పశువులకు ఏదైనా ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు మందుల కోసం పశు పోషకులు వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. ఆ భారం తగ్గించేందుకే ఈ స్టోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. డబ్ల్యూహెచ్‌ఓ సర్టిఫైడ్ జీఎంపీ క్వాలిటీ బ్రాండెడ్ డ్రగ్స్‌ను చాలా తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకురావాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. ఒక్కో కేంద్రం రూ.4.63 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేస్తుండగా.. 75 శాతం ప్రభుత్వం సబ్సిడీగా అందిస్తుందన్నారు. లబ్ధిదారులు కేవలం 25 శాతం వాటా చెల్లిస్తే సరిపోతుందన్నారు. పశు పోషకులు, ఔత్సాహిక వ్యాపారవేత్తలు, జాయింట్ లయబులిటీ గ్రూపులు, స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తి సంస్థలతో పాటు ఆసక్తి కలిగిన ప్రైవేటు వ్యక్తులను కూడా ఈ షాపుల ఏర్పాటుకు ప్రోత్సహిస్తామని చెప్పారు. ప్రతి జిల్లా పశు వైద్యశాలలో ఔషధ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని ప్రభుత్వమే కేటాయిస్తుందన్నారు. పశు వైద్యులు జనరిక్ మందులు మాత్రమే ప్రోత్సహించే విధంగా అవసరమైన సహకారాన్ని అందిస్తారన్నారు. అనంతరం వెటర్నరీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను మంత్రి పరిశీలించారు. ఈ తరహా ఆస్పత్రులను రాష్ట్రంలో అవసరమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉందన్నారు. రాష్ట్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ రెడ్నం అమరేంద్రకుమార్, అదనపు సంచాలకులు పి.సత్యకుమారి పాల్గొన్నారు.

38 వైద్యుల పోస్టుల భర్తీ

సాక్షి, అమరావతి: ఏపీవీవీపీ పరిధిలోని ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల పోస్టుల భర్తీలో భాగంగా గురువారం నిర్వహించిన వాక్–ఇన్ ఇంటర్వ్యూల్లో శాశ్వత ప్రాతిపదికన 38 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (సీఏఎస్ఎస్) పోస్టులు భర్తీ అయ్యాయి. ఇందులో 19 జనరల్ మెడిసిన్, 14 జనరల్ సర్జరీ, మూడు డెర్మటాలజీ, ఒకటి మైక్రోబయాలజీ, ఒకటి ఫోరెన్సిక్ మెడిసిన్ పోస్టులు ఉన్నాయి. ఐదు స్పెషాలిటీల్లో 128 పోస్టులను నోటిఫై చేయగా, 88 మంది వైద్యులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కాగా, 50 మంది శాశ్వత ప్రాతిపదికన పోస్టులకు ఎంపికైనప్పటికీ 38 మంది మాత్రమే తమకు కావాల్సిన స్థానాలను ఎంపిక చేసుకుని పోస్టింగ్ ఉత్తర్వులు పొందారు. మిగిలిన వారికి శుక్రవారం జూమ్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి కాంట్రాక్ట్ ప్రాతిపదిక పోస్టులు భర్తీ చేయనున్నారు.

నెలాఖరులోపు పంట నష్టం జాబితాలు

- వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్

సాక్షి, అమరావతి: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న ప్రతి రైతును ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ తెలిపారు. రాష్ట్రంలోని 22 జిల్లాల పరిధిలో 201 మండలాల్లో వరి, మొక్కజొన్న, అపరాలు, ఇతర పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. పంట నష్టాలను తగ్గించుకునేందుకు ఆర్బీకేల ద్వారా రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నామని తెలిపారు. పంట నష్టం అంచనా వేసేందుకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. పంట నష్టం అంచనాల జాబితాల రూపకల్పనకు ఈ నెల 30వ తేదీ గడువుగా నిర్ణయించామన్నారు. జిల్లాల నుంచి వచ్చే ఈ జాబితాలను ఏప్రిల్ 1 నుంచి 3వ తేదీ వరకు సామాజిక తనిఖీ కోసం ఆర్బీకేల్లో ప్రదర్శిస్తామన్నారు. ఫిర్యాదుల స్వీకరణ, వాటిపై పునఃపరిశీలన అనంతరం తుది జాబితాలను ఏప్రిల్ 4వ తేదీ కల్లా కమిషనర్ కార్యాలయానికి పంపించాలని ఆదేశించామని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

జన హృదయాల్లో 'సాక్షి' చెరగని ముద్ర

అన్ని వర్గాల ప్రజలకు బాసటగా నిలుస్తూ.. తెలుగు పత్రికా రంగంలో సంచలనంగా ఆవిర్భవించి.. అడుగులు ముందుకు వేసిన 'సాక్షి' 15 వసంతాలు పూర్తి చేసుకుని, 16వ ఏట అడుగు పెట్టింది. నిఖార్సైన జర్నలిజానికి నిలువుటద్దంగా నిలిచింది. తెలుగు ప్రజల్లో 'సాక్షి' చెరగని ముద్ర వేసుకుంది. ఈ 15ఏళ్లలో ఎన్నోకథనాలను ప్రచురించింది. అందులో కొన్ని..

కనిగిరి ప్రజల క'న్నీటి' సమస్యకు చెక్

మార్కాపురం, ఒంగోలు, కనిగిరిలో డయాలసిస్ మిషన్ల పెంపు

ట్యాంకర్ల ద్వారా స్వచ్ఛ జలాలు.. రూ.530 కోట్లతో కృష్ణా జలాలు


2017లో సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనం

కనిగిరి రూరల్: ప్రకాశం జిల్లా కనిగిరి ప్రాంతంలో ఫ్లోరైడ్ నీటి వల్ల ప్రజలు కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారనే విషయంపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించింది. దీనిపై 2017 జనవరిలో ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లిలో దీక్ష చేపట్టారు. ఆ వెంటనే అప్పటి టీడీపీ ప్రభుత్వం కనిగిరిలో డయాలసిస్ సెంటర్ మాత్రమే ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంది. వైఎస్ జగన్ సీఎం కాగానే ఏకంగా 17 డయాలసిస్ మిషన్లు ఏర్పాటు చేశారు. మార్కాపురం, ఒంగోలు రిమ్స్‌లో డయాలసిస్ మిషన్ల సంఖ్యను భారీగా పెంచారు. సమస్య మూలాలపై దృష్టి సారించి కృష్ణా జలాలు అందించేందుకు శ్రీకారం చుట్టారు. రూ.130 కోట్లతో ఏఐఐబీ స్కీం కింద కనిగిరి పట్టణానికి సమగ్ర మంచి నీటి పథకం మంజూరు చేశారు. ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.400 కోట్లతో నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని 442 గ్రామాలకు సురక్షిత జలాలను అందించేందుకు వాటర్ గ్రిడ్ పథకాన్ని మంజూరు చేశారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో నీటిని సరఫరా చేస్తున్నారు.

నిశ్చయంగా మానవుడు ఆత్రగాడుగా (తొందరపడే వాడిగా) సృష్టించబడ్డాడు ; తనకు కీడు కలిగినప్పుడు ఆందోళన చెందుతాడు ; మేలు కలిగినపుడు స్వార్థపరునిగా ప్రవర్తిస్తాడు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, మార్చి, 24

అప్రమత్తత అవసరమే!

పీడకల లాంటి కోవిడ్–19 మానవాళిని ఇంకా నీడలా వెంటాడుతూనే ఉంది. మొదలై మూడేళ్ళు నిండినా, ఇప్పటికీ ఏదో ఒక కొత్త రూపంలో వేధిస్తూనే ఉంది. దేశంలో కొన్నాళ్ళు సద్దుమణిగిన కరోనా ఈ మార్చిలో క్రమంగా పడగవిప్పింది. కరోనా కేసులు గత అయిదు వారాల్లో ఏకంగా 9 రెట్లు పెరగడంతో, కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా అప్రమత్తమైంది. డిసెంబర్ 22 తర్వాత సరిగ్గా మూడు నెలలకు బుధవారం మళ్ళీ ప్రధాని మోదీ సారథ్యంలో కరోనాపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించడం దాని ఫలితమే. ఒక వంక కరోనా, మరో వంక ఇన్‌ఫ్లుయెంజా కేసులు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుండడంతో తక్షణ కార్యాచరణకు ప్రభుత్వం కదిలింది. కరోనా కేసుల 'టెస్టింగ్ – ట్రాకింగ్ – చికిత్స – టీకాకరణ – కోవిడ్ సముచిత ప్రవర్తన' అనే అయిదంచెల వ్యూహంపై దృష్టి కొనసాగించాల్సిందిగా కేంద్ర ఆరోగ్య శాఖ అన్ని రాష్ట్రాలకూ గురువారం సూచించింది. త్వరలో దేశమంతటా మాక్ డ్రిల్స్ నిర్వహించడానికీ సమాయత్తమవుతోంది. వెరసి, దేశంలో ఆరోగ్య వ్యవస్థ సంసిద్ధత, టీకాకరణ వర్తమాన స్థితి లాంటి వాటిపై మరోసారి ఆలోచన, అంచనా మొదలైంది.

ఫిబ్రవరి రెండోవారంలో రోజూ సగటున 108 కేసులొస్తే, ఇప్పుడది రోజుకు 966 కేసులకు పెరగడం గమనార్హం. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న కరోనా కేసుల్లో 1 శాతమే భారత్‌లోనివనీ, మొత్తంగా దేశంలో ఉన్నవి 7600 కరోనా కేసులే అనీ అధికారిక లెక్క. అయితే టెస్టింగ్ గణనీయంగా తగ్గిన నేపథ్యంలో కేసుల అసలు సంఖ్య అంతకన్నా ఎక్కువే ఉండవచ్చు. ప్రస్తుతానికి మహా రాష్ట్ర, గుజరాత్, కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు ఎనిమిదింటిలో గరిష్ఠంగా కేసులు నమోదవుతున్నాయి. కరోనా వైరస్‌లో జన్యుపరమైన వేరియేషన్లను గమనించడానికి 50కి పైగా ప్రయోగశాలలతో కూడిన గ్రూపు 'ఇండియన్ సార్స్- కోవ్-2 జీనోమిక్స్ కన్సార్టియమ్' (ఇన్సాకాగ్) పనిచేస్తోంది. వీలైనంత ఎక్కువగా కోవిడ్ పాజిటివ్ నమూనాలను ఈ ఇన్సాకాగ్ ల్యాబ్‌లకు పంపి, జన్యు నిర్మాణక్రమాన్ని విశ్లేషిస్తే ఏ కొత్త వేరియంట్ వచ్చినా ఇట్టే కనిపెట్టవచ్చు. తక్షణ చర్యలు చేపట్టవచ్చు. అందుకే, ప్రభుత్వం సైతం ల్యాబ్‌ల ద్వారా వీలైనన్ని పాజిటివ్ శాంపిళ్ళను పరీక్షించి, జీనోమ్ సీక్వెన్సింగ్ విశ్లేషించాలని తాజాగా ఆదేశాలు జారీ చేసింది.

మునుపటి కరోనా వేరియంట్లకు భిన్నంగా ఈసారి మూడు అదనపు కొమ్ములున్న ఉత్పరివర్తనమైన ఎస్‌బీబీ.1.16 (మరో మాటలో 'ఆర్క్‌టూరస్') వేరియంట్ తాజా కేసుల విజృంభణకు కారణమని ప్రాథమిక విశ్లేషణ. దేశంలో తొలిసారిగా జనవరిలో బయటపడ్డ ఈ వేరియంట్ కేసుల సంఖ్య ఏ నెలకానెల పెరుగుతూ వస్తుండడం గమనార్హం. ఈ వేరియంట్ తీవ్రత, వ్యాప్తి ఎంత అన్నది అధ్యయనం చేయాల్సి ఉంది. కేసులు పెరుగుతున్నా, ఆస్పత్రి పాలవడం, ప్రాణాలు కోల్పోవడం లాంటివి ఎక్కువగా లేవు. అది పెద్ద ఊరట. నిజానికి, ఇప్పటి వరకు దేశంలో మొత్తం 220.65 కోట్లకు పైగా కరోనా టీకా డోసులు వేశారు. ఇది పెద్ద సంఖ్యే. వ్యాధినిరోధకత సాధించిన మన ప్రజానీకం ఇప్పటికే బీఏ.2.75, బీఏ.5, బీక్యూస్, ఎక్స్‌బీబీ.1.5 లాంటి పలు కరోనా వేరియంట్లను తట్టుకొని నిలబడింది. కొత్త వేరియంట్‌ను కూడా తట్టుకొంటే, మంచిదే. అలా కాకుంటేనే చిక్కు.

కరోనా, ఫ్లూ, సీజనల్ వ్యాధులు సహా కారణాలేమైనా తీవ్ర శ్వాసకోశ సమస్యలు అనేకం ప్రస్తుతం నమోదవుతూ ఉండడం ఆలోచించాల్సిన విషయం. ప్రస్తుత ఫ్లూ సీజన్‌లో దేశంలో శరవేగంగా వ్యాపిస్తూ, శ్వాసకోశ సమస్యలు కల్పిస్తున్న హెచ్3ఎన్2 వైరస్ సైతం కొన్ని దశాబ్దాలుగా ప్రపంచంలో ఉన్నదే. 'ఇన్‌ఫ్లుయెంజా–ఏ'లో ఉపవర్గానికి చెందిన ఈ వైరస్ కూడా కరోనా వైరస్‌లా మహమ్మారిగా విజృంభించి, 1968లో ప్రపంచవ్యాప్తంగా 20 నుంచి 40 లక్షల మరణాలకు కారణమైంది. మన దేశంలో 2010లో బయటపడ్డ ఈ రకం వైరస్‌కు ఒకసారి గురైతే జీవితకాల వ్యాధినిరోధకత వస్తుందట. అయితే కరోనా, దీర్ఘకాలం గొంతునొప్పి, దగ్గుతో వేధించే ఇన్‌ఫ్లుయెంజా – రెండూ ఎప్పటికప్పుడు జన్యు ఉత్పరివర్తనాలతో రూపం మార్చుకొనే ఆర్‌ఎన్‌ఏ వైరస్‌లే. అందుకే, ఇన్‌ఫ్లుయెంజా సైతం కరోనాలా ఒకరి నుంచి మరొకరికి మహమ్మారిలా విస్తరించే ముప్పుంది. దేశంలో ఏ,బీ రకాల ఇన్‌ఫ్లుయెంజాలు రెండూ ఉన్నందున తాత్కాలికంగా హడావిడి చేసి, సమస్యను అదుపు చేశామనడం కాక ప్రభుత్వ పక్షాన సమగ్ర ఆరోగ్య ప్రణాళికా రచన తప్పనిసరి.

రకరకాల మహమ్మారుల నివారణ, ఎదుర్కొనే సంసిద్ధత, కార్యాచరణలకు సంబంధించి 'మహమ్మారి నివారణ ఒప్పందం' చేసుకోవాలని విశ్వవేదికపై వివిధ దేశాలు, సంస్థలు ఇప్పటికే చర్చిస్తున్నాయి. ఆర్థికంగా, పారిశ్రామికంగా వర్ధమాన దేశాలైన 'గ్లోబల్ సౌత్'కు ప్రతినిధిగా, జీ20 దేశాలకు ప్రస్తుత సారథిగా భారత్ ఇందులో చురుకైన పాత్ర పోషించాలి. అందరికీ ఫలాలు సమంగా అందేలా చూడాలి. కరోనా, ఫ్లూ కేసులు వేలల్లో నమోదైన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వాలే కాదు, ప్రజలూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. సుదీర్ఘంగా వేధిస్తున్న వ్యాధులతో విసుగొచ్చి, ముందు జాగ్రత్తలు పాటించకుంటే మనకే నష్టం. ఈ వ్యాధికారక వాతావరణంతోనూ సహజీవనం చేయడం నేర్చుకోవాలి. సభలు, సమావేశాలు, సినిమాలు, షికార్లు, ప్రయాణాలు – ఇలా జన సమ్మర్దం ఉండే ప్రతిచోటా స్వచ్ఛందంగా మాస్కు ధారణ, భౌతికదూరం తప్పనిసరి చేసుకోవాలి. వీటితో పాటు తరచూ చేతుల పరిశుభ్రతను ఒక అలవాటుగా చేసుకోవాలని నిపుణుల సూచన. ఈ కనీస జాగ్రత్తలతో కరోనాతో సహా అన్ని రకాల వైరల్, ఫ్లూ దాడుల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు. మహమ్మారుల కథ ఇంకా ముగిసిపోలేదు. మన జాగ్రత్తలే మనకు రక్ష.

ఇది భారత్ భరించలేని బెడద

విశ్లేషణ



ప్రకాశ్ సింగ్

పాకిస్తాన్‌తో కలిసి వేర్పాటువాద శక్తులు పంజాబ్‌లో సమస్యను పెంచి పోషించడానికి ప్రయత్నిస్తున్నారనేది స్పష్టం. పోలీసులు ఇప్పటికైనా మేలుకున్నారు. కానీ రాష్ట్రం ఎదుర్కొంటున్న పలు సమస్యలపై పోరాడేందుకు ప్రభుత్వం, పోలీసు బలగాలకు దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం. అలాగే ఖలిస్తాన్ నిరసనకారులు లండన్‌లోని భారత రాయబార కార్యాలయం వెలుపల త్రివర్ణ పతాకాన్ని దించేయడం వంటి చర్యలకు దిగారు. వీరి కార్యకలాపాలను నిరోధించేందుకు సమర్థ చర్యలు చేపట్టాలని కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియాల మీద భారత్ ఒత్తిడి తేవాలి. యుద్ధప్రాతిపదికన ఖలిస్తాన్ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. లేదంటే 1980లలో పంజాబ్‌ను వెంటాడిన ఉగ్రవాద రాత్రులు పునరావృతమైతే దేశం వాటిని భరించలేదు.

'వారిస్ పంజాబ్ దే' చీఫ్ అమృత్‌పాల్ సింగ్, అతడి అనుచరులపై మోపిన ఉక్కుపాదం నాటకీయంగా ఉంది. అది రహస్యపూరితంగా కూడా ఉంది. వేర్పాటువాద బోధకుడు గత కొంతకాలంగా పెంచుకుంటూ వచ్చిన ప్రమాద తీవ్రతపై రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యంగా మేలుకుంది. ఫిబ్రవరి 23న జరిగిన అజ్‌నాలా ఘటన పోలీసులకు పెద్ద ఉపద్రవంలా మిగిలింది. ఈ ఘటనలో ఖలిస్తానీలు తుపాకులు పేల్చి పోలీసులను బాదిపడేశారు. అమృత్‌పాల్ సింగ్ అనుయాయి లవ్‌ప్రీత్ సింగ్ తూఫాన్ విడుదలను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. పోలీసులు ఈ వేర్పాటువాదికి దాదాపుగా లొంగిపోవడం కలవరపెట్టింది. తీవ్ర విమర్శలను ఎదుర్కొన్న తర్వాత, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం ఎట్టకేలకు మార్చి 18న అమృత్‌పాల్ సింగ్, అతడి మద్దతుదారులకు వ్యతిరేకంగా చర్య తీసుకోవాలని నిర్ణయించుకుంది.

ఉపరితల చర్యలు పనికిరావు

ఇలాంటి తీవ్ర ఘటనపై తీసుకునే ఏ పోలీసు చర్యకు అయినా మంచి నిఘా వ్యవస్థ, సమగ్ర ప్రణాళిక మద్దతు తప్పనిసరిగా ఉండాలి. పైగా ఈ పథకాన్ని అమలుపర్చే బృందాన్ని జాగ్రత్తగా ఎంచుకోవలసి ఉంది. అయితే పంజాబ్ పోలీసులు ఎక్కడో దారి తప్పినట్లు కనిపిస్తోంది. అసలు అందరికంటే ముందు అమృత్‌పాల్ సింగ్‌ను పోలీసులు అరెస్టు చేయవలసింది. అతడిని బహిరంగంగా కస్టడీలోకి తీసుకుని వుంటే అతడి అనుచరులు చెదిరిపోయేవారు. అమృత్‌పాల్ ఇప్పటికీ పరారీలోనే ఉన్నాడు. దీన్ని జీర్ణించుకోవడం కష్టం. పంజాబ్ పోలీసులు ఎల్లప్పుడూ శాంతిభద్రతల దృక్కోణంలో పనిచేస్తుంటారని పంజాబ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ సుఖ్‌చైన్ సింగ్ గిల్ వ్యాఖ్యానించారు. ఈ వాదన నచ్చజెప్పేలా లేదు. మారుమూల దాగి వున్న వ్యక్తిని పట్టుకోవడానికి పంజాబ్ అటు నాగాలాండ్ కాదు, ఇటు ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ కాదు. చూస్తుంటే పోలీసులు గందరగోళానికి గురై ఉండాలి. లేదా అమృత్‌పాల్‌ను ఇప్పటికే నిర్బంధించి ఉండాలి. కానీ బహిరంగంగా కోర్టుకు హాజరు పర్చకపోయి ఉండాలి. ఏ రకంగా చూసినా రాష్ట్ర ప్రభుత్వానికీ, పోలీసులకూ ఇది వృథా ప్రయాసగానే మిగిలిపోవచ్చు.

వారిస్ పంజాబ్ దే అనుయాయులకు వ్యతిరేకంగా నాలుగు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. సమాజంలో సామరస్యతను పాడు చేయడం, పోలీసులపై దాడి చేయడం, హత్యాయత్నం చేయడం, ప్రజాసేవకులు తమ విధులు చేపట్టకుండా అడ్డుకోవడం వాటికి కారణాలు. ఇవి సరే. కానీ భింద్రన్‌వాలే 2.0 అని తనను తాను చెప్పుకొంటున్న వ్యక్తిని బహిరంగంగా పట్టుకోకపోతే, ఈ ఉపరితల చర్యలతో ఉపయోగం ఉండదు.

రాష్ట్ర పోలీసులు ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. భటిండాలో



16 మంది ఖలిస్తానీ మద్దతుదారులను అరెస్టు చేశారు. లూధియానాలో 21 మందిని కస్టడీలోకి తీసుకున్నారు. అజ్‌నాలాలో ఏడుగురిని చుట్టుముట్టారు. మొత్తంగా 112 మందిని అరెస్టు చేశారు. ఫిరోజ్‌పూర్, భటిండా, రూప్ నగర్, ఫరీద్ కోట్, బటాలా, హోషియార్‌పూర్, గుర్దాస్‌పూర్, మోగా, జలంధర్ వంటి నగరాల్లో భద్రతా దళాలు తమ బలం తెలిపేలా జాతీయ పతాకం చేబూని మార్చ్ కూడా నిర్వహించాయి.

రాజకీయాలకో నమస్కారం!

ఈ చర్యలన్నీ స్వాగతించాల్సినవే. కానీ గత కొద్ది నెలలుగా, పంజాబ్ పోలీసులు వారి ఘనతకు తగినట్లుగా వ్యవహరించలేకపోయారు. అత్యంత శక్తిమంతులైన శత్రువులకు కూడా నరకం చూపించే తమ సమర్థతను వారు ప్రదర్శించలేకపోయారు. ఒకే ఒక వివరణ ఏమిటంటే, ఈ వ్యవహారంలో పోలీసులు కాస్త నెమ్మదిగా వ్యవహరించాలని సూచనలు అందివుండాలి. వారిస్ పంజాబ్ దే ప్రతీఘాతుక కార్యకలాపాల గురించి మాట్లాడుతూనే, పంజాబ్ రాజకీయ నాయకత్వం అమృత్‌పాల్ సింగ్ పేరును ప్రత్యేకించి పేర్కొనకపోవడంపై చాలామంది ఎత్తిచూపారు. నేటి రాజకీయాలకో నమస్కారం. వాటి వల్ల పోలీసులు ఏ చర్యా చేపట్టకపోవడమే సురక్షితమైన చర్య అనుకున్నట్టున్నారు. ఎందుకంటే ఇది వివాదానికి దారి తీయవచ్చు, పైగా అధికారంలో ఉన్నవారు తమకు మద్దతుగా నిలబడకపోవచ్చు అని వారు భావించి వుండాలి. ఇలాంటి అంశాలు రాష్ట్ర ప్రభుత్వ విశ్వసనీయతను, చిత్తశుద్ధిని దెబ్బతీస్తాయి.

నిస్సందేహంగా, అమృత్‌పాల్ సింగ్ ప్రతిష్ఠకు పెద్ద దెబ్బ తగిలింది. అజ్‌నాలా పోలీస్ స్టేషన్‌కు గురు గ్రంథ్ సాహిబ్‌ని తీసుకెళ్లాలనీ, దాన్ని ఒక కవచంగా ఉపయోగించాలనీ అతడు తీసుకున్న నిర్ణయాన్ని సిక్కు మతాధికారులు ప్రశ్నించారు. ఇప్పుడు, అతడు అదృశ్యమైపోవడం పట్ల కూడా తీవ్రంగా వ్యాఖ్యానిస్తున్నారు.

ఎందుకంటే ఎలాంటి ప్రమాదాన్నయినా నిర్భయంగా ఎదుర్కొవాలనీ, దాన్ని సవాలుగా తీసుకోవాలనీ బోధించే సిక్కు సంప్రదాయానికి ఇది భిన్నం.ఇక్కడ రెండు అంశాలను గుర్తు పెట్టుకోవాలి. ఒకటి పాకిస్తాన్‌తో, ఆ దేశ గూఢాచార సంస్థ ఐఎస్ఐతో సింగ్‌కు గల లంకె. ఒక సీనియర్ పంజాబ్ పోలీస్ అధికారి దీన్ని స్పష్టంగా పేర్కొన్నారు కూడా. అలాగే, తన మచ్చలను చిరుతపులి ఎన్నటికీ మార్చుకోలేనట్టుగా– తమ ప్రజలు ఆకలితో అలమటిస్తూ, దేశ ఖజానా దివాళా తీస్తున్న సమయంలో కూడా భారత్‌కు వ్యతిరేకంగా సమస్యలు సృష్టించడానికి పాకిస్తాన్ తన ఎత్తులను ఎన్నటికీ వదులుకోదనే విషయం స్పష్టమైంది. రెండోది ఏమిటంటే– పోలీసు, శాంతి భద్రతలు రాష్ట్ర పరిధిలో ఉంటున్నప్పటికీ వేర్పాటువాదం ఈ స్థాయిలో చెలరేగుతున్నప్పుడు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

ఉగ్రవాదులకు స్తూపాలా?

గత 10 సంవత్సరాలుగా పంజాబ్ పరిస్థితులు దిగజారుతున్నాయి. 2014లో దమ్‌దమీ టక్‌సాల్ సంస్థ 'ఆపరేషన్ బ్లూ స్టార్'లో చనిపోయిన జర్నైల్ సింగ్ భింద్రన్‌వాలే, ఇంకా ఇతర తీవ్రవాదులకు స్వర్ణ దేవాలయం ఆవరణలో స్మారక స్థూపం నిర్మించింది. పంజాబ్ వ్యాప్తంగా అనేక సందర్భాల్లో ఖలిస్తాన్, భింద్రన్‌వాలే పోస్టర్లను బహిరంగంగా ప్రదర్శించారు. అయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ వాటిని నిర్లక్ష్యం చేశాయి.

పంజాబ్ ఈరోజు అనేక రకాల సమస్యలతో పోరాడుతోంది. రాష్ట్రంలో ఉగ్రవాదాన్ని పునరుద్ధరించాలని పాకిస్తాన్ ప్రభుత్వం పకడ్బందీగా పథకం వేస్తోంది. దీనికి తోడుగా సరిహద్దుల అవతలి నుంచి సీమాంతర మాదక ద్రవ్యాల సమస్య కూడా తీవ్రంగానే ఉంది. పాకిస్తాన్ నుంచి డ్రోన్లతో ఆయుధాలు జారవిడవడం, రాష్ట్రం లోపల సాయుధ ముఠాలు పెరగడం, ఖలిస్తాన్ రూపకల్పనకు మద్దతిచ్చే శక్తులు పెరగడం– వీటన్నింటినీ దీర్ఘకాలిక పథకంతో పరిష్కరించాల్సి ఉంది. అరకొర స్పందనలు, తలొగ్గిపోయే చర్యలు వంటివి సరిపోవు.

కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా దేశాల్లో ఖలిస్తాన్ మద్దతుదారుల కార్యకలాపాలను నిరోధించేందుకు సమర్థ చర్యలు చేపట్టాలని భారత ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలి. ఖలిస్తాన్ అనుకూలవాద నినాదాలు చేస్తున్న నిరసనకారులు లండన్‌లోని భారత రాయబార కార్యాలయం వెలుపల త్రివర్ణ పతాకాన్ని కిందికి దించేయడంతో ఇలాంటి చర్య చేపట్టడం జరూరుగా మారింది. భారత ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన దీన్ని పరిష్కరించాల్సి ఉంది.

ఒక్కమాటలో చెప్పాలంటే, 1980లలో పంజాబ్‌ను వెటాడిన ఉగ్రవాద రాత్రులు తిరిగి సంభవిస్తే భారతదేశం వాటిని భరించలేదు.

వ్యాసకర్త మాజీ పోలీస్ అధికారి
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అమరవీరులు



భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లను స్మరించుకుంటున్నాను. మన మాతృభూమి భారతదేశం కోసం తమ ప్రాణాలు వదిలేసిన గొప్ప అమరులకు నివాళి. (మార్చ్ 23 అమర వీరుల దినోత్సవం ; ఈ ముగ్గురు వీరులను ఉరి తీసిన రోజు.)

– సీమా దుగ్గల్, ఐపీఎస్ అధికారి

అనకపోవడమే తప్పు



ప్రజాస్వామ్యానికి ఉచ్ఛస్థితి ఇది. 'గోలీ మారో (కాల్చేయండి) లాంటి వ్యాఖ్యానాలు ఏమాత్రం ఇబ్బంది లేనివి ; ద్వేషపూరిత ప్రసంగాలు సర్వసాధారణం. కానీ అవేవీ చేయని రాహుల్ గాంధీ లాంటివారికి మాత్రం జైలు శిక్షలు పడతాయి.

– జ్యోత్స్నా మోహన్, కాలమిస్ట్

విష వలయం



22 కోట్ల మంది పాకిస్తానీయుల అతి పెద్ద విషాదం ఏమిటంటే – న్యాయాధికారులు, రాజకీయ నాయకులు, అధికారులు ఒకరి నొకరు పెళ్లి చేసుకున్నారు. అందరినీ చూడండి. వాళ్లు ఒక మాఫియాలా తయారయ్యారు. ఇంక మీరు ఈ విష వలయం లోంచి ఎలా బయటపడగలరు?

– సాజిద్ ఎన్. తరార్, పాక్ వ్యాపారవేత్త

అసమానతకు కారణం



2020 లాక్‌డౌన్ కాలంలో కార్మికులు 3.7 ట్రిలియన్ డాలర్లు నష్టపోయారు. అదే సమయంలో బిలియనీర్లు 3.9 ట్రిలియన్ డాలర్లు లబ్ధి పొందరు. డబ్బులకు సంబంధించి ప్రపంచ చరిత్రలో అతి పెద్ద ఊర్ధ్వముఖ మార్పిడి ఇది.

– ఆరన్ ఖేరియాటీ, ఫెలో

మరో యుద్ధం?




నగోర్నో – కరబాఖ్ ప్రాంతం మీద ఎప్పుడూ ఒక కన్నేసి ఉంచండి. ఆర్మేనియా, అజర్‌బైజాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు చాలా తీవ్రస్థాయిలో ఉన్నాయి.

– ట్రెయ్ యూంగ్స్ట్, రిపోర్టర్

దివాళాకోరు రాజకీయం అంటే ఇదే!

సందర్భం



సి. రామచంద్రయ్య

మచిలీపట్నం వేదికగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ తమ పార్టీ 10వ ఆవిర్భావ దినోత్సవం నాడు చేసిన ప్రసంగం పూర్తిగా డొల్లతనంతో వైరుధ్యాల పుట్టగా సాగిపోయింది. 10 ఏళ్ల పవన్ కల్యాణ్ రాజకీయ ప్రస్థానం వెగటు కలిగించే ఓ ప్రహసనం. ఈ పదేళ్లలో తను చేసిన పొరపాట్లు ఏమిటో, తన వైఫల్యాలకు కారణాలేమిటో కనీసమాత్రంగా కూడా చెప్పకపోగా ఓట్లు వేయనందుకు ప్రజల్ని తప్పు పట్టిన తీరు ఆశ్చర్యం కలిగిస్తుంది. 2014లో 'జనసేన'ను స్థాపించి బేషరతుగా బీజేపీ, తెలుగుదేశంతో కలిసి ప్రచారం చేసి, ఆ పార్టీలు ఉమ్మడిగా ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి దోహదపడ్డారు పవన్. 2018 మార్చి 14న ఆ రెండు పార్టీలకు 'రాం రాం' పలికి వామపక్షాలు, బీఎస్పీతో పొత్తు కుదుర్చుకొని ఎన్నికలకు వెళ్లారు. ఆ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ వైఫల్యాలనూ, నారా లోకేష్ పాల్పడిన అవినీతినీ ప్రతి సభలో ఎండగట్టారు. అయితే, ప్రజలు పవన్ కల్యాణ్‌ను సీరియస్‌గా తీసుకోలేదు. అందుకే పోటీ చేసిన రెండుచోట్లా అవమానకరమైన రీతిలో ఓటమి పాలయ్యారు. 2019 ఎన్నికలలో అనేక వర్గాల ప్రజలు తెలుగుదేశం పార్టీకి దూరమయ్యారు. ఆ వర్గాలు వైఎస్సార్‌సీపీకి చేరువై, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం గట్టారు. ఈ నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో బలహీన వర్గాలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలపడ్డాయి. దీంతో, వెనుకబడిన వర్గాలు, కాపులు తిరిగి తెలుగుదేశం పార్టీకి దగ్గరయ్యే పరిస్థితులు లేక పోవడంతో, కాపులను వైఎస్సార్‌సీపీ నుంచి వేరు చేసి వారిని తెలుగుదేశం పార్టీ వైపు నడిపించడం అనే వ్యూహంతో గత కొంత కాలంగా పవన్ కల్యాణ్ పావులు కదుపుతున్నారు.

ఆ క్రమంలోనే, కులాలను కలుపుతానంటూ పవన్ ఓ చిత్రమైన పల్లవిని వినిపిస్తున్నారు. కులాలను కలపడం ఏమిటి? కొన్ని కొన్ని ప్రాంతాలతో రాజకీయ పరంగానో, సామాజిక పరంగానో కొన్ని కులాల మధ్య అపోహలు ఏర్పడటం సహజం. కానీ, అవి తాత్కాలికంగానే ఉంటాయి తప్ప కులపరంగా ప్రజలు విడిపోయి ఘర్షణలు పడే పరిస్థితి ఎక్కడా లేదు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటువంటి పరిస్థితి ఇప్పుడే కాదు గత 2 దశాబ్దాలు పైబడి ఎన్నడూ లేదు. పాలకులు అన్ని కులాల్నీ సమానంగా ఆదరించినపుడు కులాల మధ్య అంతరాలు ఏర్పడవు. జగన్ పాలనలో 'కులాల కుంపట్లు' లేనే లేవు. ఇది ఒక వర్గం మీడియా కావాలని చేస్తున్న దుష్ప్రచారం. కాపులు, బలిజలు తను ఎంత చెబితే అంత అన్నట్లుగా పవన్ కల్యాణ్ భావించడం విడ్డూరం.

కాపులు, బలిజల ఆత్మగౌరవం దెబ్బతిన్నప్పుడు పవన్ కల్యాణ్ ఏం చేశారు? చిరంజీవి ప్రజారాజ్యంపై కుల ముద్ర వేసిందెవరు? చిరంజీవి, అల్లు అరవింద్‌లు పార్టీ టిక్కెట్లు అమ్ముకొంటూ వేల కోట్లు సంపాదించారన్న ప్రచారాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజారాజ్యం



విజయావకాశాలను దెబ్బతీసిన పార్టీతో, వ్యక్తులతో పవన్ కల్యాణ్ అంటకాగితే కాపులు, బలిజలు హర్షిస్తారా?

కులాల్ని కలపాలంటే ముందుగా ఎవరైతే తమది గొప్ప కులమని, తమ బ్లడ్ ప్రత్యేకమైనదంటూ నోరు జారారో... వారిచేత మిగతా కులాలకు క్షమాపణలు చెప్పించగలగాలి. అందరిలో ప్రవహించేది ఒకటే రక్తం అని వారికి గడ్డి పెట్టాలి. ఎన్టీ రామారావు గానీ, డా॥ వైఎస్ రాజశేఖరరెడ్డి గానీ తెలుగునాట కుల రాజకీయాలు చేయలేదు. వారికి కులం రంగు పులమాలని అప్పట్లో కొందరు ప్రయత్నించినా, తమ ఉన్నత వ్యక్తిత్వాలతో, అన్ని వర్గాల ప్రజల పట్ల సమాదరణతో వారు కులాలకు అతీతంగా ఉన్నతమైన నాయకులుగా చరిత్రలో నిలిచిపోయారు. ఆ కోవలోనే నేడు వైఎస్ జగన్ తన పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అధిక ప్రాముఖ్యత ఇస్తున్నారు. చట్టసభల గడప ముఖం తెలియని అనేక బడుగు వర్గాలకు అవకాశాలు కల్పిస్తున్నారు. ఇందువల్ల, భవిష్యత్తులో ఆయన గెలుపు నల్లేరు మీద బండి ప్రయాణంలా సాగిపోతుందని గ్రహించినవారు.. తెలివిగా పవన్‌ను ముందుకు నెట్టి కులాల మధ్య కుంపట్లు రాజేస్తున్నారు.

ఒంటరిగా పోటీ చేస్తే తన గెలుపు కూడా కష్టం అని 2019 ఎన్నికల ఫలితాలు నేర్పిన పాఠంతో పవన్ కల్యాణ్ రాబోయే ఎన్నికలలో ప్రధాన ప్రతిపక్షం టీడీపీతో జత కట్టాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. ఆ కారణంగానే తమ పార్టీని విస్తరించడం లేదు. సీనియర్ నేతలెవరైనా వచ్చి తమ పార్టీలో చేరతారేమోననే అనుమానంతో తనకు నచ్చిన ఓ నాయకుడికి నంబర్ 2 స్థానం కల్పించి ముందు పెట్టుకున్నారు. ద్వితీయ శ్రేణి నాయకులకు టిక్కెట్లు ఇవ్వకపోయినా, వారి నుంచి పెద్దగా ప్రతిఘటన రాదు కనుక ఓ 15–20 సీట్ల మేరకు ఎన్నికల పొత్తుల్లో భాగంగా తీసుకొంటే సరిపోతుందనే ఆలోచన చేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

అయితే, తన వ్యూహాల్ని, ప్రణాళికలను, ఎత్తుగడల్ని ప్రజలు అర్థం చేసుకొని ఎక్కడ తనను నలుగురిలో ఎండగడతారేమోననే అనుమానంతో.. 'అధికార పక్షానికి వ్యతిరేకంగా ఓట్లు చీలనివ్వను' అంటూ ఓ సరికొత్త నేరేటివ్‌ను గత కొంత కాలంగా విన్పిస్తున్నారు. 2019 ఎన్నికలలో ఓటమి చెందిన చంద్రబాబు ఈ నాలుగేళ్ల కాలంలో ఎప్పుడూ తను చేసిన తప్పుల్ని ఒప్పుకోలేదు. కించపరిచిన బీసీలు, ఎస్సీలను క్షమాపణ కోరలేదు. కాపునేత ముద్రగడ పద్మనాభాన్నీ, ఆయన కుటుంబ సభ్యులనూ అవమానించిన తీరుకు బాధనూ వ్యక్తం చేయలేదు. తమ పాలనలో రైతులకూ, వెనుకబడిన వర్గాలకూ అన్యాయం జరిగిందని ఒప్పుకోలేదు. అయినప్పటికీ.. పవన్‌కు తెలుగుదేశం మీద, చంద్రబాబు నాయుడు మీద ప్రేమ ఎందుకు పుట్టుకొచ్చిందో ప్రజలు అర్థం చేసుకోవాలి. అయితే, పవన్ కల్యాణ్ మర్మం తెలియని చేగొండి హరిరామ జోగయ్య వంటి కాపు కుల ప్రముఖులు పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి కావాలనీ, చంద్రబాబు జాతీయ రాజకీయాలకు వెళ్లాలనీ తమ మనసులోని మాటగా చెబుతున్నారు. కానీ, ఇప్పటికే పవన్–చంద్రబాబుల మధ్య ఎంఓయూలు కుదిరిపోయాయన్న నిజాన్ని వారు ఎప్పటికి గ్రహిస్తారు?!

సినిమాలకు, రాజకీయాలకు గల తేడాను గ్రహించకుండా రాజకీయాలలో సైతం సెల్ఫ్ ప్రమోషన్ చేసుకోవడానికి పరిమితం అయ్యారు పవన్. తనకు కులం, మతం, ప్రాంతం లేదంటారు. మరోవైపు కులాల ప్రస్తావన తీసుకువస్తారు. పైగా, ఆయనకు డబ్బు మీద మోజు లేదట. డబ్బు అవసరం లేదట. రోజుకు 2 కోట్లు సంపాదిస్తానని చెప్తారు. ఇంకోవైపు నెలనెలా ఈఎంఐలు కడుతున్నట్లు చెప్తారు. ఈ వైరుధ్యాలు ఏమిటో ఎవరికీ అర్థం కాదు.


పవన్ కల్యాణ్‌కు పెద్దగా చదువు లేదు. కానీ పుస్తకాలు బాగా చదివాననీ, ఎంతో విజ్ఞానవంతుణ్ణనీ చెప్పుకుంటారు. రాజకీయాల్లో రాణించడానికి చదువే ప్రామాణికం కాదు. కామన్‌సెన్స్ ముఖ్యం. కాపుల్ని పెద్దన్న పాత్ర పోషించమని పవన్ చేసే హితబోధలో హేతుబద్ధత కనిపిస్తుందా? ఏ ఒక్క కులం కూడా సమూహంగా ఆలోచించదు. సమూహంగా వ్యవహరించదు. అందుకు కాపు కులస్థులు మినహాయింపేమీ కాదు. ప్రజలు తమ తమ స్థానిక స్థితిగతులను అనుసరించి, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఎన్నికల సమయంలో నిర్ణయాలు తీసుకొంటారు. ఎవరైతే మంచి పరిపాలన అందిస్తారో వారిలో ప్రజలు కులాన్ని చూడరు. ఇది చరిత్ర చెప్పే సత్యం. పవన్ కల్యాణ్‌కు ఈ వాస్తవాలు ఎవరు చెబుతారు? ప్రజలు స్థిరమైన వ్యక్తిత్వం లేనివారిని, ఎప్పటికప్పుడు మాటలు మార్చేవారిని ఎట్టి పరిస్థితుల్లో నమ్మరు. అందువల్ల పవన్ కల్యాణ్ గంపగుత్తగా కాపుల్నీ, బలిజల్నీ తన రాజకీయ స్వప్రయోజనాల కోసం వేరొక పార్టీకి బదలాయించాలని చేసే ప్రయత్నాలు విఫలం కాకతప్పదు. పవన్ కల్యాణ్ చేసే దివాళాకోరు కుల రాజకీయాల్ని ఏ వర్గమూ హర్షించదు, సహించదు.

వ్యాసకర్త ఏపీ శాసన మండలి సభ్యులు

విద్య – విష సర్పం

చదవడం అంటే అక్షరాల్ని గుర్తించడం కాదు. గుర్తించి గడగడా వల్లించడం కాదు. సారాన్ని గ్రహించలేనిది చదువు కాదు. అన్నం గిన్నెలో చేయి పెట్టినా, నీటి పాత్రలో వేలు ముంచినా ఆకలి తీరదు, దాహం తీరదు. ప్రాణం నిలువదు. అలాగే, అక్షరం కూడా! అక్షరాన్ని అక్షరంగా కాదు, ఒక నిండైన భావానికి రూపంగా చూడగలిగితేనే దాని సారం తెలుస్తుంది.

చదివినవారు కాదు, చదువుల సారం ఎరిగిన వారే నేర్పరి. చదువుకు సామాజిక ప్రయోజనం ఉంటుంది. వ్యక్తి వికాసానికి దోహదం చేస్తుంది. మనోవికాసం చెందిన మనుషులతో నిర్మితమైన సమాజం మానవీయంగా, మహోన్నతంగా విరాజిల్లుతుంది. ఏతావతా చెప్పాలంటే... మానవీయతను పరిమళింపచేసేదే చదువు. సంస్కారాన్ని నేర్పించి సామాజిక ప్రయోజనాన్ని నెరవేర్చనిది చదువే కాదు. అలాంటి చదువు వల్ల మరింత కీడే కలుగుతుంది కూడా. అలాంటి విద్యావంతుల వల్ల ఎంతో



జ్యోతిర్మయం

మానవ హననం జరిగింది. చరిత్రలో ఇందుకు ఎన్నెన్నో ఉదాహరణలు ఉన్నాయి.

అందుకే... నేర్చుకునే విద్యను ప్రజ్ఞతో నేర్చుకోవాలి, ప్రజ్ఞతో పరిశీలించాలి, ప్రజ్ఞతో పరీక్షించాలి. అప్పుడే దాని బాహ్య స్వరూపం కాకుండా అంతరంగం తెలుస్తుంది. సారం లభిస్తుంది. కొందరు బాగా చదువుతారు. ఉద్గ్రంథాలు వల్లె వేస్తారు. కానీ, అనైతికంగా జీవిస్తారు. అది అటు ఉంచి... కేవలం తమ పాండిత్యాన్ని ప్రదర్శిస్తారు. వాదాలలో గెలుస్తారు. ఇలాంటివన్నీ బాహ్య ప్రదర్శనలే! కానీ, వారి అంత రంగం మాత్రం స్వార్థంతో, అహంతో మలినమై ఉంటుంది. నిజానికి చదువు మన ఆంతరంగిక మలినాల్ని శుద్ధి చేయాలి. నిర్మల హృదయులుగా తీర్చి దిద్దాలి. మనిషికి నియతిని, నైతిక విలువల్ని పెంపొందించేదే నిజమైన చదువు.

నాగుపామును పట్టుకోవాలనుకున్నవారు తోక పట్టుకున్నా, నడుం దగ్గర పట్టుకున్నా దాని కాటుకు గురవుతారు. అలా పట్టుకోవడం ప్రమాదం. నైతిక విలువలు నేర్పని చదువు కూడా అలాంటిదే అంటాడు బుద్ధుడు. నేర్పరి అయినవాడు నాగుపాము ప్రక్కగా వెళ్ళి, పంగల కర్రతో తల వెనుక అదిమిపట్టి, వెనుక నుంచి లాఘవంగా తలను పట్టుకుంటాడు. అలా పట్టుకోవడం వల్ల అది కాటేయలేదు. ప్రమాదాన్ని కలిగించదు. చదువూ అంతే... జ్ఞానం, విజ్ఞానం మానవీయతలో ఉంటే మానవాభ్యుదయానికి దారులు తీస్తాయి. లేకుంటే మారణ గీతం పాడుతాయి.

– బొర్రా గోవర్ధన్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.తదియ రా.7.34 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** అశ్విని ప.3.51 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** ఉ.11.55 నుండి 1.29 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.30 నుండి 9.16 వరకు తదుపరి ప.12.29 నుండి 1.19 వరకు, **అమృతఘడియలు:** ఉ.8.43 నుండి 10.19 వరకు ; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.05, **సూర్యాస్తమయం:** 6.07.

శ్రీగిరిలో ఉగాది మహోత్సవాలకు పూర్ణాహుతి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో జరుగుతోన్న ఉగాది మహోత్సవాల్లో చివరి రోజైన గురువారం నాడు యాగపూర్ణాహుతి, వసంతోత్సవం, అవభృదం కార్యక్రమాలు నిర్వహించారు. పూర్ణాహుతిలో శాస్త్రోక్తంగా నారికేళాలు, సుగంధద్రవ్యాలు, ముత్యం, పగడం, నూతన వస్త్రాలు మొదలైన వాటిని హోమగుండంలో ఆహుతిగా సమర్పించారు. పూర్ణాహుతి అనంతరం వసంతోత్సవం నిర్వహించారు. చండీశ్వరస్వామికి ఆలయ పుష్కరిణి వద్ద అవభృదం, త్రిశూల కార్యక్రమాలు చేపట్టారు. చండీశ్వరస్వామికి ఆలయ పుష్కరిణిలో త్రిశూల స్నానం చేయించారు. ఉగాది మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు శ్రీభ్రమరాంబాదేవి ఉత్సవ మూర్తిని భ్రమరాంబాదేవి నిజాలంకరణ రూపంలో దర్శనమిచ్చారు. శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు అశ్వవాహనసేవ నిర్వహించారు.

ఉత్సాహంగా బోట్ రైడింగ్ పోటీలు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): జీ-20 సదస్సు నేపథ్యంలో విశాఖ ఆర్‌కే బీచ్‌లో గురువారం బోట్ రైడింగ్, కైట్ ఫెస్టివల్ పోటీలు జరిగాయి. కలెక్టర్ మల్లికార్జున జెండా ఊపి ఈ పోటీలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 28, 29, 30 తేదీల్లో జరగబోయే జీ-20 సమ్మిట్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. బోట్ రైడింగ్ పోటీలను ప్రజలు ఉత్సాహంగా తిలకించారు. ఈ పోటీల్లో మొత్తం 10 బృందాలు పాల్గొనగా..ఆర్‌కే బీచ్ నుంచి సాగరనగర్ బీచ్ వరకు పోటీలు జరిగాయి. కైట్ ఫెస్టివల్‌లో భాగంగా గుజరాత్ నుంచి పెద్ద పెద్ద ఆకారాల గాలిపటాలను తెప్పించారు. ఈ పోటీల్లో పాల్గొనే వారికి ఉచితంగా గాలిపటాలను అందించారు. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు రావడంతో కైట్స్‌ను పైకి ఎగరవేయడానికి నగర వాసులు ఇబ్బంది పడ్డారు. దీంతో కైట్ ఫెస్టివల్ నిరాశ మిగిల్చింది. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు, డీసీపీ సుమిత్ గరుడ్ తదితరులు పాల్గొన్నారు.


వివిధ ఆకృతుల్లో గాలిపటాలు


బోట్ రైడింగ్

సమగ్ర శిక్ష నుంచి రాష్ట్రానికి రూ.2,888 కోట్లు

2023-24కు ప్రాథమికంగా ఆమోదం తెలిపిన పీఏబీ

సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వం చేపడుతున్న విద్యా కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయని కేంద్రం కితాబిచ్చింది. రాష్ట్రంలో విద్యా పథకాలు, కార్యక్రమాల అమలు బాగుండటంతో విద్యాభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేసింది. 2023-24 విద్యా సంవత్సరానికి సమగ్ర శిక్ష నుంచి రాష్ట్రానికి రూ. 2,888 కోట్లు మంజూరుకు ప్రాజెక్టు అప్రూవ్ బోర్డు (పీఏబీ) ద్వారా ప్రాథమికంగా ఆమోదం తెలిపింది. గత విద్యా సంవత్సరంలో రూ. 2626.52 కోట్లు ఇవ్వగా, అందులో 95 శాతం వినియోగించి రాష్ట్రం మంచి ఫలితాలను సాధించింది. 2023-24 విద్యా సంవత్సరం వార్షిక పని ప్రణాళిక, ప్రాజెక్టు అప్రూవల్ బోర్డ్, వచ్చే విద్యా సంవత్సరం నిధుల కేటాయింపుపై కేంద్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ కుమార్ నేతృత్వంలో బుధవారం సమీక్ష జరిగింది. ఇందులో రాష్ట్రం తరఫున పాఠశాల విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు ఎస్.సురేష్ కుమార్ పాల్గొన్నారు. విద్యాభివృద్ధికి ఏపీ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, సంస్కరణలు, కృషి ఆచరణీయమని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు అభినందించినట్లు పాఠశాల విద్యా శాఖ అధికారులు తెలిపారు. అమ్మఒడి, విద్యా కానుక వంటి పథకాలు, టాయిలెట్, స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్స్, మధ్యాహ్న భోజన పథకం తదితర కార్యక్రమాల అమల్లో భాగంగా సమగ్ర శిక్షా లక్ష్యసాధనలో ఏపీ మిగిలిన రాష్ట్రాల కంటే ముందుందని కేంద్ర అధికారులు కొనియాడారు. మిగతా రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఏపీలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన తదితర కార్యక్రమాలను ప్రవీణ్ ప్రకాష్ కేంద్ర అధికారులకు వివరించారు.

ట్యాబులపైనా వంకర రాతలు

- విద్యార్థులను ప్రపంచస్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దే ప్రయత్నాలను జీర్ణించుకోలేని 'ఈనాడు'
- ఎక్కడో జరిగిన చిన్న ఘటనలను పెద్దగా చూపిస్తూ దుష్ప్రచారం
- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్. సురేష్‌కుమార్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నిరుపేద చిన్నారులకు ఇచ్చిన ట్యాబులపైనా ఈనాడు తన వంకర బుద్ధిని ప్రదర్శించింది. రాష్ట్రంలోని విద్యార్థులను ప్రపంచస్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను జీర్ణించుకోలేక ఈనాడు తన దుష్ట నైజాన్ని 'బడి ట్యాబుల్లో అన్నీ లభ్యం' వార్త ద్వారా బయటపెట్టింది. రాష్ట్రంలోని 8వ తరగతి విద్యార్థులకు అందించిన ప్రతి ట్యాబులోనూ సెక్యూరిటీ ప్యాచ్ వేశారు. అయితే, ఎక్కడో జరిగిన చిన్న ఘటనను పెద్దగా చూపిస్తూ ఈనాడు విషప్రచారం చేస్తోంది. ప్రభుత్వ ఉన్నత లక్ష్యాన్ని నీరుగార్చే ప్రయత్నానికి ఒడిగడుతోంది. దీన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యా శాఖ తీవ్రంగా ఖండించాయి. దీనిపై పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఎస్. సురేష్‌కుమార్ కూడా గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ వివరాలు..
'బడి ట్యాబుల్లో అన్నీ లభ్యం' వార్తను ఖండిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఒక ఉన్నతాశయంతో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు, 8వ తరగతి బోధిస్తున్న ఉపాధ్యాయులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబులను పంపిణీ చేసింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులు కూడా ప్రపంచంతో పోటీపడాలని, వారు ఉన్నత శిఖరాలు చేరాలన్నది సీఎం వైఎస్ జగన్ ఆకాంక్ష. అయితే, ఈ లక్ష్యాన్ని నీరుగార్చాలని ఎక్కడో జరిగిన చిన్నచిన్న విషయాలకు పత్రికాముఖంగా బురదజల్లే కార్యక్రమం జరుగుతోంది. నిజానికి.. ట్యాబుల విషయంలో ప్రభుత్వం ముందే అనేక రక్షణ చర్యలు తీసుకుంది. అవి ఏమిటంటే..

- ప్రతీ ట్యాబ్‌లో సెక్యూరిటీ ప్యాచ్ వేయడం..
- ప్రతీ ట్యాబ్ మొబైల్ డివైస్ మేనేజ్‌మెంటు పర్యవేక్షణలో ఉంటుంది.
- ప్రతీ ట్యాబు విధిగా ఇంటర్నెట్‌కు ఒకసారి కనెక్ట్ చేయాలి.
- అలా చేయడంవల్ల ట్యాబుల్లో ఏమైనా సెక్యూరిటీ ప్యాచ్ అప్‌డేట్ కాకపోతే అప్‌డేట్ అవుతుంది.
- ఎక్కడైనా ట్యాబులో ఏదైనా ఎర్రర్ వస్తే వార్డు వలంటీర్ ఆ ట్యాబు గురించి సంబంధిత శాఖ వారితో సంప్రదించి దానిని సరిచేసి రెండు పనిదినాల్లో విద్యార్థికి అందజేసే వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఇందుకు సంబంధించి జీఓ-29 ద్వారా ఇలాంటి వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. సమస్య ఉన్న ట్యాబులను గుర్తించి ఇప్పటికే సరిచేసి ఇచ్చే ప్రక్రియ కూడా జరుగుతోంది.
- కొన్ని సందర్భాల్లో ట్యాబులను మొబైల్ రిపేర్ షాపులకు తీసుకెళ్లి బలవంతంగా ఫ్యాక్టరీ రీసెట్ చేయిస్తున్నారు. అలాంటి ట్యాబుల వివరాలు, విద్యార్థి పేరు, మండలం, స్కూలుతో సహా ఇతర వివరాలు విద్యాశాఖకు వెంటనే తెలుస్తుంది. సదరు స్కూలు హెడ్మాస్టర్‌కు వెంటనే సమాచారం అందించి నెట్‌కు కనెక్ట్ చేయించి ట్యాబును లాక్ చేయిస్తున్నాం.
- ఇక 8వ తరగతి బోధించే ప్రతి ఉపాధ్యాయునికీ ట్యాబ్ ఉపయోగించే విధానం, చిన్నచిన్న ఎర్రర్‌లను ఏ విధంగా సరిచేసుకోవాలనే అంశాలపై పూర్తిస్థాయి శిక్షణను ప్రారంభిస్తున్నాం.
- ఇలా ఒక గొప్ప లక్ష్యంతో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ట్యాబులు వినియోగించుకుని జ్ఞానాన్ని పొందుతున్నారు. ఇలాంటి సత్సంకల్పాన్ని నీరుగార్చే ప్రయత్నాన్ని విద్యార్థులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యాశాఖ తీవ్రంగా ఖండిస్తోంది'.

స్పీకర్ తమ్మినేని ఎల్ఎల్‌బీ అడ్మిషన్‌పై విచారణ జరపాలి

సాక్షి, అమరావతి: అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఎల్ఎల్‌బీ అడ్మిషన్‌పై విచారణ జరిపించాలని టీడీపీ అధికార ప్రతినిధి ఎస్ నర్సిరెడ్డి కోరారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తాను డిగ్రీ పూర్తవకుండా మధ్యలోనే ఆపేసినట్లు సీతారాం పలు ఇంటర్వ్యూల్లో చెప్పారని, అలాంటప్పుడు డిగ్రీ పూర్తి కాకుండా ఎల్ఎల్‌బీ అడ్మిషన్ ఎలా పొందారో చెప్పాలన్నారు. 2019లో స్పీకర్ అయిన తర్వాత హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని మహాత్మాగాంధీ లా కాలేజీలో ఎల్ఎల్‌బీ 3 సంవత్సరాల కోర్సు చదవడానికి అడ్మిషన్ పొందారని తెలిపారు. ఈ వ్యవహారంపై అత్యున్నత స్థాయి విచారణ జరిపి ఇలాంటి అక్రమాలు ఇంకా ఎన్ని జరిగాయో తేల్చాలని డిమాండ్ చేశారు.

వారంలో మూడ్రోజులు క్షేత్రస్థాయిలోనే..

- బుధ, గురు, శనివారాల్లో పీహెచ్‌సీ, సచివాలయాల సందర్శన తప్పనిసరి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని డీఎంహెచ్‌ఓలందరూ వారంలో మూడ్రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్ ఆదేశించారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ ఆరోగ్య కార్యక్రమాలను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమాలన్నీ క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలుచేస్తే ప్రభుత్వ లక్ష్యాలు, ఉద్దేశ్యాలు నూటికి నూరు శాతం నెరవేరుతాయి. ఈ క్రమంలో ప్రజారోగ్య కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో సునిశిత పరిశీలనకు వైద్యశాఖ నడుం బిగించింది. ఈ నేపథ్యంలో.. బుధ, గురు, శనివారాల్లో డీఎంహెచ్‌ఓలు తమ జిల్లాల పరిధిలోని పీహెచ్‌సీ, సచివాలయాల్లో పర్యటించాలని నివాస్ ఆదేశించారు. ఇందుకోసం ఓ ప్రణాళికనూ రూపొందించారు. ఇక డీఎంహెచ్‌ఓలు తమ పర్యటనల నివేదికలను ఎప్పటికప్పుడు ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్లకు సమర్పించాల్సి ఉంటుంది.

విశాఖలో భవనం కూలి ముగ్గురు దుర్మరణం

- మరో ఐదుగురికి కేజీహెచ్‌లో చికిత్స
- వీరిలో ఓ మహిళ పరిస్థితి విషమం

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): విశాఖలో రెండంతస్తుల భవనం కూలిన ఘటనలో ముగ్గురు దుర్మరణం పాలవగా.. మరో ఐదుగురు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఓ మహిళ పరిస్థితి విషమంగా ఉంది. నగరంలోని 29వ వార్డు పరిధి రామజోగిపేటలో 40 ఏళ్ల కిందట నిర్మించిన భవనం 4 రోజులుగా కురుస్తున్న వర్షానికి బుధవారం అర్ధరాత్రి కుప్పకూలిపోయింది. ఘటనలో భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో అద్దెకు ఉంటున్న బిహార్‌కు చెందిన రామ్‌విలాస్ (30) (అలియాస్ ఛోటు), మొదటి అంతస్తులో అద్దెకు ఉంటున్న సాకేటి దుర్గాప్రసాద్ (17), సాకేటి అంజలి (14) మృతి చెందారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంటున్న విజయవాడ కృష్ణలంకకు చెందిన కొమ్మిశెట్టి శివశంకర్ (29), మొదటి అంతస్తులో అద్దెకు ఉంటున్న సాకేటి రామారావు (39), సాకేటి కల్యాణి, రెండో ఫ్లోర్‌లో అద్దెకు ఉంటున్న సన్నాపు కృష్ణ (30), పి.రోజారాణి గాయాలతో బయటపడ్డారు. 5 గంటల పాటు రాష్ట్ర విపత్తులు, ఫైర్ సర్వీస్ విభాగం, పోలీసులు శ్రమించి శిథిలాలోంచి మృతదేహాలను బయటకు తీశారు. క్షతగాత్రులను కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న కల్యాణి పరిస్థితి విషమంగా ఉంది. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఘటన ప్రాంతానికి చేరుకుని ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు.


రామజోగిపేటలో కూలిన మూడంతస్తుల భవనం

క్షయకు చెక్ పెట్టొచ్చు

వ్యాధిని పూర్తిగా నయం చేయొచ్చు

క్రమం తప్పకుండా మందులు వాడటం ముఖ్యం

నేడు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం



లబ్బీపేట (విజయవాడ తూర్పు): క్షయ నివారించదగిన వ్యాధే. సరైన చికిత్స పొందితే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చు. వాస్తవంగా 2023 నాటికే క్షయ రహిత సమాజం నిర్మాణం కావాలని ప్రభుత్వాలు భావించినప్పటికీ, క్షయ వ్యాధి గ్రస్తులు చికిత్స పొందడంలో అలసత్వం వహించడంతో వ్యాధి వ్యాప్తి చెందుతోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. 'నేను క్షయను నివారించగలను' అనే నినాదంతో వ్యాధిపై ఈ ఏడాది అవగాహన కలిగిస్తున్నారు. మార్చి 24వ తేదీన ప్రపంచ క్షయ నివారణ దినోత్సవంగా జరుపుతున్నారు.

వ్యాప్తి ఇలా....
క్షయ వ్యాధి గ్రస్తులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు నోటి ద్వారా బయటకు వచ్చే వ్యాధి కారక మైక్రో బ్యాక్టీరియా ఇతరులలోకి ప్రవేశిస్తుంది. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువని వైద్యులు చెబుతున్నారు. క్షయ వ్యాధి గ్రస్తులు మందులు ప్రారంభించిన రెండు వారాల తర్వాత అతని నుంచి మరొకరికి వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉండదు.

లక్షణాలివే..
రెండు వారాల కంటే ఎక్కువ రోజులు దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, ఏ కారణం లేకుండా బరువు తగ్గడం, ఆకలిలేక పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి వారికి కళ్లె పరీక్ష, ఛాతీ ఎక్స్‌రే ద్వారా వ్యాధిని నిర్ధారిస్తారు.

నియంత్రణ సాధ్యమే..
క్రమం తప్పకుండా ఆరు నెలల పాటు మందులు వాడటం ద్వారా క్షయను పూర్తిగా నియంత్రించవచ్చు. ప్రస్తుతం ప్రభుత్వం నేషనల్ ట్యూబర్‌క్యులోసిస్ ఎలిమినేషన్ ప్రోగ్రామ్ (ఎన్‌టీఈపీ)లో భాగంగా రోగులకు ఉచితంగా మందులు అందచేస్తోంది. క్షయ రోగులు చికిత్సతో పాటు పోషకాహారం తీసుకోవాలి. ఆహారంలో ప్రతిరోజూ రెండు గుడ్లు, పాలు, ఆకుకూరలు, చిక్కుడు, గోరు చిక్కుడు, నాన్‌వెజ్‌కి సంబంధించి కైమా వంటివి తీసుకుంటే మంచిది. క్షయకు చికిత్స పొందుతున్న వారికి పోషకాహారం కోసం ప్రతినెలా ప్రభుత్వం రూ. 500లు ఇస్తోంది.

నివారించదగిన వ్యాధే



క్రమం తప్పకుండా ఆరు నెలల పాటు మందులు వాడటం ద్వారా క్షయను పూర్తిగా నివారించవచ్చు. ప్రభుత్వం మంచి మందులు సరఫరా చేస్తోంది. కొందరు రెండు, మూడు నెలలు మందులు వాడి మానేయడంతో మొండి క్షయగా రూపాంతరం చెందుతోంది. ప్రతిరోజూ పల్మనాలజీ ఓపీకి 20 నుంచి 30 మంది క్షయ వ్యాధి లక్షణాలతో రోగులు వస్తున్నారు. వారికి కళ్లె పరీక్ష, ఛాతీ ఎక్స్‌రే తీసి వ్యాధిని నిర్ధారిస్తున్నాం.
– డాక్టర్ కె.శిరీష, పల్మనాలజిస్టు, జీజీహెచ్, విజయవాడ

కోటి రుద్రాక్ష అభిషేకానికి సీఎంకు ఆహ్వానం

అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ సెంట్రల్): విజయవాడ ముత్యాలంపాడు సాయిబాబా మందిరంలో ఈ నెల 28న జరగనున్న కోటి రుద్రాక్ష అభిషేకానికి విచ్చేయాలంటూ సీఎం జగన్‌కి ఆహ్వానించారు. మందిరం గౌరవ అధ్యక్షుడు, ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ ఛైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా సచివాలయంలో గురువారం సీఎంను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు.

క్లుప్తంగా

అత్యుత్తమ వంటకాల జాబితాలో... షాహీ పనీర్, దాల్, కుర్మా!



న్యూయార్క్: ప్రపంచంలోని అత్యుత్తమ వంటకాల జాబితాలో భారత్ నుంచి ఏకంగా ఎనిమిది వెరైటీలకు చోటు దక్కింది. టాప్–50 వంటకాల్లో షాహీ పనీర్ ఐదో స్థానంలో నిలిచింది. కీమాకు పదో స్థానం, చికెన్ కుర్మాకు 16, దాల్‌కు 26, గోవా వంటక విందాలూకు 31, వడా పావ్‌కు 39, దాల్ తడ్కాకు 40వ స్థానం లభించాయి. అయితే, 38 స్థానం దక్కిన ప్రపంచ ప్రఖ్యాత భారతీయ వంటకం చికెన్ టిక్కాను బ్రిటిష్ వంటకంగా పేర్కొనడం విశేషం! ప్రపంచ ప్రఖ్యాతి పొందిన పలువురు వంట నిపుణుల పర్యవేక్షణలో ప్రఖ్యాత ఫుడ్ గైడ్ టేస్ట్ అట్లాస్ ఈ జాబితాను రూపొందించింది. థాయ్‌లాండ్ వంటకం హానెంగ్ అగ్రస్థానంలో నిలిచింది. సింగపూర్ వంటకం సిచువాన్, చైనాకు చెందిన హాట్‌పాట్ తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

నాలుగు రాష్ట్రాలకు బీజేపీ కొత్త అధ్యక్షులు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నాలుగు రాష్ట్రాలకు బీజేపీ గురువారం కొత్త అధ్యక్షులను నియమించింది. రాజస్తాన్‌కు ఎంపీ సి.పి.జోషి, బీహార్‌కు ఓబీసీ నాయకుడు, ఎమ్మెల్సీ సమ్రాట్ చౌధరి, ఒడిశాకు మాజీ మంత్రి మన్మోహన్ సమాల్, ఢిల్లీకి వీరేంద్ర సచదేవ్‌ను అధ్యక్షులుగా నియమించింది. పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ మేరకు ప్రకటించారు. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలున్న రాజస్థాన్‌లో జోషి నియామకాన్ని నేతలు స్వాగతిస్తున్నారు.

తెలంగాణ, బెంగాల్ సహా 9 రాష్ట్రాలు సీబీఐకి నో

న్యూఢిల్లీ: తెలంగాణ, పశ్చిమబెంగాల్, రాజస్తాన్ సహా 9 రాష్ట్రాలు సీబీఐకి కేసుల దర్యాప్తులో సాధారణ అంగీకారాన్ని ఉపసంహరించుకున్నట్లు కేంద్రం తెలిపింది. ఆ రాష్ట్రాలు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, కేరళ, మేఘాలయ, మిజోరం, పంజాబ్, రాజస్తాన్, తెలంగాణ, పశ్చిమబెంగాల్ అని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ గురువారం రాజ్యసభకు లిఖితపూర్వకంగా వెల్లడించారు. ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్(డీఎస్‌పీఈ) చట్టం –1946లోని సెక్షన్–6 ప్రకారం..సీబీఐ కొన్ని రకాల కేసుల దర్యాప్తునకు ముందుగా సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

‘దొంగల ఇంటి పేరు మోదీ’ వ్యాఖ్యలపై...

రాహుల్‌కు రెండేళ్ల జైలు

పరువు నష్టం కేసులో దోషిగా తేల్చిన సూరత్ కోర్టు | **అప్పీల్‌కు అనుమతి, నెలపాటు శిక్ష నిలిపివేత** | **ఇప్పటికిప్పుడు అనర్హత వేటు పడదు: నిపుణులు**

సూరత్/ఢిల్లీ: ‘దొంగలందరి ఇంటిపేరు ఎందుకు మోదీయే ఉంటుంది?’ అంటూ వ్యాఖ్యలు చేసిన కేసులో కాంగ్రెస్ నేత, ఎంపీ రాహుల్ గాంధీకి గుజరాత్‌లోని సూరత్ కోర్టు గురువారం రెండేళ్ల జైలు శిక్ష విధించింది. ఐపీసీ సెక్షన్లు 499, 500 కింద రాహుల్‌ను దోషిగా చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ హెచ్.హెచ్.వర్మ నిర్ధారించారు. ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష ఖరారు చేసిన అనంతరం బెయిల్ మంజూరు చేశారు. పై కోర్టులో అప్పీలుకు వీలుగా జైలు శిక్షను 30 రోజులపాటు నిలిపేస్తున్నట్లు వెల్లడించారు. తీర్పు వెలువరించిన సమయంలో రాహుల్ కోర్టులోనే ఉన్నారు. ‘‘ఈ కేసులో దోషి పార్లమెంట్ సభ్యుడు. ఆయన ఏం మాట్లాడినా అది దేశ ప్రజలపై ప్రభావం చూపిస్తుంది. అందుకే కేసు తీవ్రత పెరిగింది. దోషికి తక్కువ శిక్ష విధిస్తే ప్రజలకు తప్పుడు సంకేతం పంపించినట్లు అవుతుంది. ఎవరైనా ఇతరులను ఇష్టారాజ్యంగా దూషించేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. ‘చౌకీదార్ చోర్ హై’ అంటూ చేసిన వ్యాఖ్యలపై నమోదైన కేసులో రాహుల్ గతంలో క్షమాపణ చెప్పారు. మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని అప్పట్లో సుప్రీంకోర్టు ఆయనకు సూచించింది. అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పు వచ్చినట్లు కనిపించడం లేదు’’ అని న్యాయస్థానంలో తన తీర్పులో పేర్కొంది.

కించపర్చే ఉద్దేశం లేదు

విచారణ సందర్భంగా రాహుల్ తన వాదన వినిపించారు. తనకు ఎవరిపైనా ఎలాంటి వివక్ష లేదని, దేశ ప్రజలందరినీ అభిమానిస్తానని చెప్పారు. ఎవరినీ కించపర్చే ఉద్దేశం లేదన్నారు. ‘‘ప్రజాప్రయోజనాల కోణంలోనే ఎన్నికల ప్రచారంలో ప్రసంగించా. అది నా విధి’’ అని తెలిపారు. ఈ కేసులో ఫిర్యాదుదారుకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని, నిందితుడు గతంలో ఏ కేసులోనూ దోషిగా తేలలేదని, ఎవరి నుంచీ క్షమాభిక్ష కోరలేదని, ఆయనకు తక్కువ శిక్ష విధించాలని రాహుల్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఈ వాదనను ప్రాసిక్యూషన్ తరఫు న్యాయవాది ఖండించారు. రాహుల్‌ను గతంలో సుప్రీంకోర్టు మందలించిందని గుర్తుచేశారు. ప్రాసిక్యూషన్ వాదనతో న్యాయస్థానం ఏకీభవించింది.



గురువారం సూరత్ కోర్టుకు వస్తున్న రాహుల్ గాంధీ

చట్టప్రకారం పోరాడతాం: కాంగ్రెస్

సూరత్ కోర్టు తీర్పుపై ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, అప్పీల్ దాఖలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. ‘‘పిరికిపంద, నిరంకుశ బీజేపీ ప్రభుత్వం రాహుల్ గాంధీపై, ప్రతిపక్షాలపై కక్షగట్టింది. ప్రభుత్వ అరాచక పాలనను ప్రశ్నిస్తున్నందుకు, అదానీపై అంశంపై జేపీసీ నియమించాలని డిమాండ్ చేస్తున్నందుకు మమ్మల్ని లక్ష్యంగా చేసుకుంటోంది. రాజకీయ ప్రసంగాలపై కేసులు పెట్టడం చాలా దారుణం. ఒక వేలు ఇతరుల వైపు చూపిస్తే నాలుగు వేళ్లు తమవైపే చూపిస్తాయని బీజేపీ నేతలు తెలుసుకోవాలి. ఇలాంటిది ఏదో జరుగుతుందని ముందే ఊహించాం. న్యాయ వ్యవస్థపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. చట్ట ప్రకారమే పోరాడుతాం’’ అని ఖర్గే స్పష్టం చేశారు.

రాహుల్ భయపడే ప్రసక్తే లేదు: ప్రియాంక

తన సోదరుడు రాహుల్ గొంతును నొక్కేయడానికి మోదీ ప్రభుత్వం సామ దాన భేద దండోపాయాలన్నీ ప్రయోగిస్తోందని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా మండిపడ్డారు. రాహుల్ గతంలో ఏనాడూ భయపడలేదని, భవిష్యత్తులోనూ భయపడే ప్రసక్తే లేదని చెప్పారు. ఎట్టిపరిస్థితుల్లోనూ సత్యమే మాట్లాడుతాడని ట్వీట్ చేశారు. దేశ ప్రజల కోసం గొంతెత్తుతూనే ఉంటారని పేర్కొన్నారు.

సత్యమే నా మార్గం: రాహుల్

సూరత్ కోర్టు తీర్పుపై రాహుల్ గాంధీ స్పందించారు. ‘‘సత్యం, అహింసపైనే నా మతం ఆధారపడి ఉంటుంది. సత్యమే నా దైవం. ఆ దైవాన్ని చేరుకొనే మార్గమే అహింస’’ అంటూ మహాత్మాగాంధీ చెప్పిన సూక్తిని ట్వీట్ చేశారు. స్వాతంత్య్ర యోధులు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వర్ధంతి సందర్భంగా వారికి నివాళులర్పించారు. సత్యం, ధైర్యసాహసాలే ఆలంబనగా మాతృదేశం కోసం నిర్భయంగా పోరాడడాన్ని ఆ మహనీయుల నుంచి నేర్చుకున్నామన్నారు.

క్షమాపణ చెప్పాలి: బీజేపీ

రాహుల్ గాంధీ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ అన్నారు. ఇతరులను దూషిస్తే శిక్ష తప్పదని చెప్పారు. రాహుల్‌కు జైలుశిక్ష విధించడంపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. ఎవరినైనా దూషించడానికి రాహుల్‌కు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని కాంగ్రెస్ కోరుకుంటోందా? అని ప్రశ్నించారు. ఇతరుల పరువుకు నష్టం కలిగించేలా మాట్లాడినందుకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ డిమాండ్ చేశారు.

రాహుల్‌కు కేజ్రీవాల్ మద్దతు

రాహుల్‌ను పరువు నష్టం కేసులో ఇరికించడం దారుణమని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. రాహుల్‌కు మద్దతు ప్రకటించారు. బీజేపీయేతర నాయకులు, పార్టీలపై కేంద్రం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందంటూ ట్వీట్ చేశారు. వారిని కేసుల్లో ఇరికించడం ద్వారా నిర్మూలించడమే ఉద్దేశమన్నారు.

అమిత్ షాకు సమన్లు ఇవ్వండి

సీబీఐ డైరెక్టర్‌కు జైరాం రమేశ్ లేఖ

న్యూఢిల్లీ: ‘‘మేఘాలయలో కాన్రాడ్ సంగ్మా సర్కారు దేశంలోనే అత్యంత అవినీతి ప్రభుత్వమని ఆరోపించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు సమన్లు జారీ చేయండి. అవినీతికి సబంధించిన వివరాలు ఆయన నుంచి సేకరించండి’’ అని సీబీఐని కాంగ్రెస్ పార్టీ కోరింది. పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఈ మేరకు సీబీఐ డైరెక్టర్ సుబోధ్ జైస్వాల్‌కు లేఖ రాశారు. ‘‘సంగ్మా ప్రభుత్వ అవినీతి గురించి తెలిసే షా ఆరోపణలు చేశారు. దానిపై చర్యల నిమిత్తం వివరాలు సేకరించండి’’ అని కోరారు.

ఏమిటీ కేసు?

2019 ఏప్రిల్ 13న కర్నాటకలోని కోలార్‌లో లోక్‌సభ ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ ప్రసంగిస్తూ ప్రధాని మోదీపై ఆరోపణలు గుప్పించారు. ‘దొంగలందరి ఇంటి పేరు ఎందుకు మోదీయే ఉంటుంది?’ అని అన్నారు. మోదీ సామాజికవర్గం పరువుకు రాహుల్ నష్టం కలిగించారంటూ గుజరాత్‌లోని సూరత్ వెస్ట్ బీజేపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పూర్ణేశ్ మోదీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాహుల్ విజ్ఞప్తి మేరకు విచారణ సూరత్‌లో జరగకుండా విధించిన స్టేను గుజరాత్ హైకోర్టు గత ఫిబ్రవరిలో తొలగించింది.

అనర్హత వేటు పడుతుందా?

ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం.. రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం జైలు శిక్ష పడిన రాజకీయ నాయకుడిపై శిక్ష ఖరారైన తేదీ నుంచి మిగిలిన పదవీకాలమంతా అనర్హత వేటు పడుతుంది. శిక్షాకాలం పూర్తయిన తర్వాత ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హుడవుతాడు. అయితే, అనర్హత వేటు వెంటనే పడదని సుప్రీం కోర్టు లాయర్ మహేష్ జెఠ్మలానీ చెప్పారు. ప్రజాప్రతినిధ్య చట్టం ప్రకారం మూడు నెలల గడువు ఇవ్వొచ్చని తెలిపారు. ఈ సమయంలో నేరారోపణ లేదా శిక్షపై అప్పిలేట్ కోర్టు స్టే ఇస్తే అప్పీల్‌పై విచారణ ముగిసే దాకా అనర్హత వేటు కూడా ఆగిపోతుందని వివరించారు. మూడు నెలల్లోగా నేరారోపణ లేదా శిక్ష రద్దు కాకపోతే దోషిపై అనర్హత వేటు వేయొచ్చని పేర్కొన్నారు. శిక్షను రద్దు చేసే అధికారం శిక్ష విధించిన కోర్టుకు కాకుండా అప్పిలేట్ కోర్టుకే ఉంటుందన్నారు. రాహుల్ గాంధీకి విధించిన జైలు శిక్షను అప్పిలేట్ కోర్టు రద్దు చేయొచ్చని, అదే జరిగితే అప్పీల్‌పై విచారణ ముగిసేదాకా ఆయనపై ఎంపీగా అనర్హత వేటు వేసే అవకాశం లేదని మహేష్ జెఠ్మలానీ వెల్లడించారు. ప్రజాప్రాతినిధ్య చట్టం కింద అనర్హత వేటు నుంచి తప్పించుకోవాలంటే శిక్షను అప్పిలేట్ కోర్టు రద్దు చేయడమో లేదంటే నేరారోపణపై స్టే విధించడమో జరగాలని సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది చెప్పారు. రాహుల్ గాంధీకి అప్పిలేట్ కోర్టు బెయిల్ మంజూరు చేసే అవకాశాలను కొట్టిపారేయలేమని అన్నారు. 2013 నాటి లిలీ థామస్, 2018 నాటి లోక్ ప్రహరి కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పులను ఆయన గుర్తుచేశారు. ప్రజాప్రతినిధుల శిక్ష రద్దయితే అనర్హత వేటు కూడా రద్దవుతుందని అప్పట్లో న్యాయస్థానం తేల్చిచెప్పిందని వివరించారు.

పోలీసు బూట్ల కింద నలిగి నవజాత శిశువు మృతి

ఆరుగురు పోలీసుల సస్పెన్షన్

రాంచీ: జార్ఖండ్ రాష్ట్రం గిరిదిహ్ జిల్లాలో సోదాల సమయంలో పోలీసుల బూట్ల కింద నలిగి శిశువు చనిపోయిన ఘటన తీవ్ర సంచలనం కలిగిస్తోంది. ఘటనకు సంబంధించి ఆరుగురు పోలీసులపై సస్పెన్షన్ వేటు పడింది. దియోరీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ దారుణం చోటుచేసుకుంది. కొషాడింఘి గ్రామానికి చెందిన భూషణ్ పాండేతోపాటు, మరో వ్యక్తిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు బుధవారం వేకువజామున 3.20 గంటల సమయంలో అతడి ఇంటికి వెళ్లారు. మూసి ఉన్న తలుపులను పోలీసులు బలవంతంగా తెరిచి లోపలికి ప్రవేశించినట్లు పాండే ఆరోపించాడు. లోపలికొచ్చిన పోలీసులు నాలుగు రోజుల వయస్సున్న తన మనవడిని బూటు కాళ్లతో తొక్కారని, శిశువు అక్కడికక్కడే చనిపోయాడని అన్నాడు. పాండే ఆరోపణలతో కూడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. మెజిస్ట్రేట్ సమక్షంలో శిశువు మృతదేహానికి పోస్టుమార్టం చేయించామని ఎస్పీ అమిత్ రేణు చెప్పారు. బూటుకాలితో గట్టిగా తొక్కడంతో శిశువు ప్లీహం ఛిద్రమైనట్లు తేలిందన్నారు. ఇందుకు సంబంధించి ఆరుగురు పోలీసులపై కేసులు నమోదు చేసి, సస్పెన్షన్ వేటు వేశామన్నారు. దోషులుగా తేలితే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

బర్త్ కంట్రోల్ మాత్రలతో బ్రెస్ట్ క్యాన్సర్ ముప్పు!

న్యూఢిల్లీ: హార్మోనల్ గర్భనిరోధక మాత్రల వాడకంతో మహిళల్లో రొమ్ము క్యాన్సర్ ముప్పు స్వల్పంగా పెరుగుతున్నట్లు యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)లోని యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్ అధ్యయనంలో వెల్లడయ్యింది. అన్ని రకాల హార్మోనల్ కాంట్రాసెప్టివ్ పిల్స్‌తో ఈ ముప్పు ఉన్నట్లు తేలింది. ఈ అధ్యయనం వివరాలను ‘ప్లస్ మెడిసిన్’ జర్నల్‌లో ప్రచురించారు. గర్భనిరోధక మాత్రల వల్ల బ్రెస్ట్ క్యాన్సర్ ముప్పు 20 శాతం నుంచి 30 శాతం దాకా పెరుగుతున్నట్లు గుర్తించామని పరిశోధకులు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్లతో కూడిన గర్భనిరోధక మాత్రల వినియోగం అధికంగా ఉంది. ఈ రెండు హార్మోన్లతో కూడిన మాత్రల వల్ల బ్రెస్ట్ క్యాన్సర్ తలెత్తే అవకాశం ఉన్నట్లు గతంలోనే తేలినా, కేవలం ప్రొజెస్టిరాన్ ఉన్న మాత్రల వల్ల కూడా ఈ ముప్పు ఉన్నట్లు స్పష్టంగా వెల్లడి కావడం ఇదే ప్రథమం.

ఐఎన్ఎస్ మాజీ అధ్యక్షుడు చాజ్‌లానీ కన్నుమూత

న్యూఢిల్లీ: ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ (ఐఎన్ఎస్) మాజీ అధ్యక్షుడు అభయ్ చాజ్‌లానీ కన్నుమూశారు. పత్రికా రంగంలో ఆయన దశాబ్దాలపాటు విశేషమైన సేవలు అందించారు. 2009లో కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. చాజ్‌లానీ మృతిపట్ల ఐఎన్ఎస్ అధ్యక్షుడు కేఆర్‌పీ రెడ్డి సంతాపం ప్రకటించారు. మీడియా రంగం అభివృద్ధికి ఆయన ఎంతగానో కృషి చేశారని కొనియాడారు.

పర్యాటక వీసాతోనూ ఉద్యోగ దరఖాస్తులు: అమెరికా

నిరుద్యోగ భారత టెకీలకు భారీ ఊరట

వాషింగ్టన్: మాంద్యం దెబ్బకు అమెరికాలో ఉద్యోగం కోల్పోయి కొత్త కొలువు దొరక్క దేశం వీడాల్సి వస్తుందేమోనని ఆందోళన పడుతున్న హెచ్–1బి వీసాదారులకు, ముఖ్యంగా భారత టెకీలకు భారీ ఊరట! బిజినెస్ (బి–1), పర్యాటక (బి–2) వీసాదారులు కూడా అమెరికాలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, ఇంటర్వ్యూలకూ హాజరు కావచ్చని ఆ దేశ పౌరసత్వ, వలస సేవల సంస్థ (యూఎస్‌సీఐఎస్) పేర్కొంది. ‘‘అమెరికాలో ఉద్యోగం కోల్పోయిన వారు 60 రోజుల్లోపు మరో ఉద్యోగం చూసుకోలేని పక్షంలో అమెరికా వీడటం తప్ప మరో మార్గంలేదనే అపోహలో ఉన్నారు. మరింత కాలం దేశంలో ఉండేందుకు వారికి పలు మార్గాలున్నాయి. 60 రోజుల్లోపు వీసా స్టేటస్‌ను (బి–1, బి–2కు) మార్చుకుంటే ఆ గ్రేస్ పీరియడ్ ముగిశాక కూడా అమెరికాలో ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలను కొనసాగించుకోవచ్చు’’ అని వివరించింది. అయితే ఉద్యోగం దొరికాక అందులో చేరేలోపు వీసా స్టేటస్‌ను తదనుగుణంగా మార్చుకోవాల్సి ఉంటుందని తెలిపింది. ఈ విషయమై పలువురు వెలిబుచ్చిన పలు సందేహాలకు సమాధానంగా సంస్థ ఈ మేరకు ట్వీట్ చేసింది. బి–1 వీసాను స్వల్పకాలిక బిజినెస్ ప్రయాణాలకు, బి–2ను ప్రధానంగా పర్యాటక అవసరాలకు అమెరికా జారీ చేస్తుంటుంది. మాంద్యం దెబ్బకు అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్ సహా పలు దిగ్గజ కంపెనీలు వేలాదిగా ఉద్యోగులను తొలగిస్తున్న విషయం తెలిసిందే. ఇలా గత నవంబర్ నుంచి అమెరికాలోనే 2 లక్షల మందికి పైగా నిరుద్యోగులయ్యారు. వీరిలో కనీసం లక్ష మంది భారతీయులేనని అంచనా!

అదానీపై జేపీసీ వేయాల్సిందే

అధికార, ప్రతిపక్ష సభ్యుల నినాదాలతో పార్లమెంట్ మళ్లీ వాయిదా


న్యూఢిల్లీ: ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్న రాహుల్ గాంధీ వ్యాఖ్యలు, అదానీ గ్రూప్‌పై జేపీసీ డిమాండ్ అంశాలు గురువారం కూడా పార్లమెంట్‌ను కుదిపేశాయి. ఉదయం రాజ్యసభ మొదలు కాగానే బీజేపీ, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. అదానీ గ్రూప్ వ్యవహారంపై చర్చకు అనుమతి ఇవ్వాలంటూ నిబంధన 267 కింద ప్రతిపక్షాలు ఇచ్చిన 12 నోటీసులను ధన్‌ఖడ్ తిరస్కరించారు. దీంతో, ఎవరికి వారు నినాదాలతో సభను హోరెత్తించారు. చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదావేశారు. తర్వాత అదే తీరు కొనసాగడంతో సభ శుక్రవారానికి వాయిదా పడింది. లోక్‌సభలో కూడా రాహుల్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వాలంటూ కాంగ్రెస్ సభ్యులు డిమాండ్ చేశారు. ప్రశ్నోత్తరాల తర్వాత ఇస్తానని స్పీకర్ ఓం బిర్లా చెప్పినా నిరసనలు కొనసాగించారు. దాంతో సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. తర్వాతా ఇరు వర్గాలు గందరగోళం కొనసాగించడంతో సాయంత్రం 6 గంటల దాకా వాయిదా పడింది. మళ్లీ సమావేశమయ్యాక డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్ అండ్ అప్రోప్రియేషన్ బిల్లును ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. ఆందోళనల మధ్యే స్పీకర్ గిలాటిన్‌ను ప్రయోగించి అన్నిశాఖల డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్‌ను ఓటింగ్‌కు పెట్టారు. 2023–24కు రూ.45 లక్షల కోట్ల బడ్జెట్‌కు మూడింట రెండొంతుల మెజారిటీతో సభ ఆమోదం తెలిపింది.

పార్లమెంట్ కాంప్లెక్స్‌లో ప్రతిపక్షాల మార్చ్

అదానీ గ్రూపు అవకతవకలపై జేపీసీ వేయాలంటూ ప్రతిపక్ష పార్టీల సభ్యులు పార్లమెంట్ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద నిరసనకు దిగారు. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ అంబేడ్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్లారు. జేపీసీ వేసేదాకా ఆందోళనలు కొనసాగుతాయని ఖర్గే చెప్పారు.

టికెట్ లేని ప్రయాణికుల నుంచి రూ.కోటి

దక్షిణ రైల్వే మహిళా టీసీ రికార్డు



చెన్నై: టికెట్ లేని ప్రయాణికుల నుంచి ఏకంగా రూ.1.03 కోట్ల జరిమానా వసూలు చేసి దక్షిణ రైల్వే చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ రోజలీన్ అరోకియా మేరీ రికార్డు సృష్టించారు. ఈ ఘనత సాధించిన తొలి మహిళగా నిలిచారు. రైలులో ప్రయాణికుల టికెట్లు చెక్ చేస్తూ, జరిమానాలు వసూలు చేస్తున్న మేరీ ఫొటోను రైల్వే శాఖ ట్విటర్‌లో పోస్ట్ చేసింది. విధుల పట్ల ఆమె అంకితభావాన్ని కొనియాడింది. ఈ పోస్ట్ వెంటనే వైరలయింది. నెటిజన్లు ఆమె నిబద్ధతపై ప్రశంసల వర్షం కురిపించారు. ‘భారత్ మరింత శక్తివంతంగా ఎదగాలంటే ఇలాంటి అంకితభావం కలిగిన మహిళలు అవసరం. రోజలీన్‌కు అభినందనలు’ అంటూ ఆమెను పొగిడారు.

ఎజెండా ఇదీ ...

- పంజాబ్ సమాజాన్ని మతం ఆధారంగా విడదీయడమే అమృత్‌పాల్ సింగ్ ప్రధాన ఎజెండా. ఉత్తరప్రదేశ్, బిహార్ నుంచి రాష్ట్రానికి వచ్చే నిరుపేదలైన కూలీలపై స్థానికుల్లో వ్యతిరేకత పెంచి అగ్గిరాజేయాలని చూసినట్టుగా పోలీసులు చెబుతున్నారు.
- విదేశీ సంస్థల నుంచి అందిన నిధులతో అక్రమంగా ఆయుధాలను కొనుగోలు చేసి పంజాబ్ యువతలో గన్ కల్చర్ పెంచడానికి కూడా ప్రణాళికలు రూపొందించాడు.
- పంజాబ్‌లో అనిశ్చితి రేపడానికి ఆనందపూర్ ఖల్సా ఫౌజ్ (ఏకేఎఫ్) పేరుతో ఒక ప్రైవేటు ఆర్మీని రూపొందించాడు. అందులో ఎక్కువ మంది నేరచరితులే. ఐఎస్ఐ ఆర్థిక సాయంతో అందరికీ ఆయుధాలు, వాహనాలు కొనుగోలు చేశాడు.
- డ్రగ్స్‌కు బానిసలైన వారిని, మాజీ సైనికాధికారులపై వలవేసి వారితో ఒక ఉగ్రవాద సంస్థ నెలకొల్పాలని ప్రయత్నించాడు. దుబాయ్ నుంచి వచ్చాక జల్లూపూర్ ఖెహ్రా గ్రామంలో డ్రగ్ డీ–ఎడిక్షన్ సెంటర్‌ని నెలకొల్పాడు.
- డ్రగ్ డీ ఎడిక్షన్ సెంటర్‌కి తీసుకువచ్చిన వారు ఆరోగ్యం బాగయ్యాక వారిస్ పంజాబ్ దే సంస్థలో చేరి ఎలాంటి విధ్వంసం రేపడానికైనా సిద్ధంగా ఉండాలి. అలా చేయలేని వారిని శారీరకంగా హింసించేవారని పోలీసుల విచారణలో తేలింది.

అమృత్‌పాల్‌పైనున్న కేసులు

వారిస్ పంజాబ్ దే చీఫ్ అమృత్‌పాల్ సింగ్ మొత్తం ఆరు క్రిమినల్ కేసుల్ని ఎదుర్కొంటున్నాడు. వాటిలో పోలీసు అధికారులపై హత్యాయత్నం, దాడి కేసులున్నాయి.

- ఫిబ్రవరి 16 : అమృత్‌పాల్‌పై కిడ్నాప్, దాడి కేసు నమోదు
- ఫిబ్రవరి 22 : విద్వేషాలు రెచ్చగొడుతున్నాడంటూ కేసు
- ఫిబ్రవరి 22 – యువతలో అసహనం నింపుతున్నాడని కేసు
- ఫిబ్రవరి 23 – అమృత్‌పాల్, అతని సాయుధ అనుచరులు పోలీసు అధికారులపై దాడులు, హత్యాయత్నం కేసులు
- మార్చి 18 : ఆయుధాల చట్టం కింద కేసు నమోదు
- మార్చి 19 : ర్యాష్ డ్రైవింగ్ చేసినందుకు జలంధర్‌లో కేసు



దుబాయ్‌లో డ్రైవర్‌గా పని చేసే అమృత్‌పాల్ సింగ్ రాత్రికి రాత్రే సిక్కు మత ప్రబోధకుడిగా వేషం మార్చడం వెనుక పాకిస్తాన్ ఐఎస్ఐ హస్తం ఉందన్న అనుమానాలున్నాయి. దేశంలో మత ఘర్షణలు రేపి, శాంతిభద్రతల్ని విచ్ఛిన్నం చేయడానికే ఐఎస్ఐ అమృత్‌పాల్‌ను దుబాయ్ నుంచి పంజాబ్‌కు పంపిందని పోలీసులు చెబుతున్నారు. భారత్‌కు వచ్చిన ఆరు నెలల్లో ఖలిస్తానీ ఉద్యమం పేరుతో అమృత్‌పాల్ సింగ్ వార్తల్లో నిలిచాడు. యువతపై మతం మత్తుమందు జల్లి వారి అండదండలతో దేశంలో అశాంతి రేపడానికి పన్నాగాలు పన్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. అమృత్‌పాల్ భారత్‌కు రావడానికి ముందు జార్జియాలో ఐఎస్ఐ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్నాడని ఇంటెలిజెన్స్ వర్గాలకు సమాచారం ఉంది.

ఐఎస్ఐ ఆదేశాల మేరకే నడుచుకున్న అమృత్‌పాల్ సింగ్

పంజాబ్ యువతలో గన్ కల్చర్ పెంచడానికి పన్నాగాలు

డ్రగ్స్ బానిసలను డీ ఎడిక్షన్ సెంటర్‌లో చేర్పించి వారితో ప్రైవేటు ఆర్మీ

అమృత్‌పాల్ @ ఆ ఏడుగురు...

ఖలిస్తాన్ ఉద్యమం పేరుతో దేశంలో మతకల్లోలం

కిరణ్‌దీప్ కౌర్

అమృత్‌పాల్ సింగ్ భార్య. బ్రిటన్‌కు చెందిన ఎన్నారై. రివర్స్ మైగ్రేషన్ పేరు చెప్పి ఇతర దేశాల్లో ఉన్న ఖలిస్తాన్ సానుభూతిపరుల్ని తిరిగి పంజాబ్ తీసుకురావడానికే ఈమెను అమృత్‌పాల్ పెళ్లి చేసుకున్నట్టుగా తెలుస్తోంది.అమృత్‌పాల్‌కు వివిధ దేశాల నుంచి వచ్చే ఆర్థిక సాయానికి సంబంధించిన లెక్కలన్నీ ఆమెకే తెలుసు.

దల్జీత్ సింగ్ కల్సి

అమృత్‌సర్‌కు చెందిన దల్జీత్ సింగ్ కల్సి అమృత్‌పాల్‌కు ఫైనాన్షియర్. పాకిస్తాన్ నిఘా ఏజెన్సీ ఐఎస్ఐతో కల్సికి సంబంధాలున్నట్టుగా ఆరోపణలున్నాయి. ఐఎస్ఐకి అమృత్‌పాల్‌కి మధ్య సంధానకర్తగా పని చేస్తూ ఉంటాడు. ప్రస్తుతం పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

పపల్‌ప్రీత్ సింగ్

అమృత్‌పాల్‌ను వెనుక నుంచి నడిపించేది ఇతనే. ఐఎస్ఐ ఆదేశాల మేరకే పపల్‌ప్రీత్ సింగ్ అమృత్‌సింగ్‌ను వెనుకుండి నడిపిస్తాడన్న వాదనలున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా పోలీసుల నుంచి పరారీ అవడానికి పపల్‌ప్రీత్ సింగ్ పూర్తిగా సహకరించాడు. వాహనాలు, వేషాలు మార్చడంలో సాయపడ్డాడు. అమృత్‌పాల్ బైక్‌పై వెళుతుండగా దానిని నడుపుతున్న వ్యక్తిని పపల్‌ప్రీత్‌గా పోలీసులు గుర్తించారు. ఐఎస్ఐతో నేరుగా సంబంధాలు కలిగి ఉన్న పపల్‌ప్రీత్ సింగ్ పంజాబ్‌లో ఉద్రిక్తతల్ని సృష్టించడానికి పన్నాగాలు రచించాడు. ఖలిస్తాన్ డిమాండ్‌తో అల్లకల్లోలం సృష్టించాలని భావించాడు. పపల్‌ప్రీత్ సింగ్ సూచనల మేరకే అమృత్‌పాల్ సింగ్ తనని తాను సిక్కు మత ప్రబోధకుడిగా, ఒక సామాన్యుడిగా కనిపించే ప్రయత్నం చేశాడు.

భగవంత్ సింగ్

అమృత్‌పాల్ సింగ్‌కు కుడిభుజం. పంజాబ్‌లో అజ్నాలా పోలీసు స్టేషన్‌లో హింసాకాండకు భగవంత్ సింగ్ బాధ్యుడు. అమృత్‌పాల్ సింగ్‌కు మీడియా, సోషల్ మీడియా సమన్వయకర్తగా ఉన్నాడు. అమృత్‌సింగ్ పరారయ్యాక భగవంత్ సింగ్‌ను పోలీసులు అరెస్ట్ చేసినప్పుడు అతను సోషల్ మీడియా లైవ్‌లో వచ్చి తమ అనుచరుల్ని రెచ్చగొట్టే ప్రసంగం చేశాడు. దీంతో పోలీసులు అతని ఛానెల్స్ అన్నీ బ్లాక్ చేసి అదుపులోనికి తీసుకున్నారు. జాతీయ భద్రతా చట్టం కింద విచారిస్తున్నారు. ప్రస్తుతం అస్సాం దిబ్రూగఢ్ జైలులో ఉన్నాడు.

గుర్మీత్ సింగ్

అమృత్‌పాల్ సింగ్ అనుచరుల్లో మొట్టమొదట పోలీసులకు చిక్కినవాడు గుర్మీత్ సింగ్ . పోలీసులు అమృత్‌సింగ్‌పై వేట తీవ్రతరం చేశారని తెలిసిన వెంటనే అమృత్‌సర్ నుంచి తప్పించుకోవడానికి స్థానికంగా గుర్మీత్ సింగ్ అన్ని ఏర్పాట్లు చేశాడు. అరెస్టయిన గుర్మీత్ కూడా దిబ్రూగఢ్ జైల్లోనే ఉన్నాడు

లవ్‌ప్రీత్ తుఫాన్ సింగ్

వారిస్ పంజాబ్ దే సంస్థలో కీలక సభ్యుడు. అత్యంత చురుగ్గా కార్యకలాపాలు నిర్వహిస్తాడు. అమృత్‌పాల్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశాడని ఒక వ్యక్తిని కిడ్నాప్ చేసిన నేరానికి పోలీసులు అతనిని అరెస్ట్ చేశారు. లవ్‌ప్రీత్‌ను బయటకి తీసుకురావడం కోసమే అమృత్‌పాల్ ఫిబ్రవరి 24న అజ్నాలా పోలీసు స్టేషన్‌లో విధ్వంసం సృష్టించాడు.

హర్‌జీత్ సింగ్

అమృత్‌పాల్ సింగ్‌కు మామ. ఖలిస్తానీ ఉద్యమానికి గట్టి మద్దతుదారుడు. పోలీసుల కన్నుగప్పి హర్‌జీత్ సింగ్ కారులోనే తొలుత పారిపోయాడు. ఆ తర్వాత హర్‌జీత్ పోలీసులకు లొంగిపోయారు. ఒకప్పుడు హర్‌జీత్ సింగ్ దుబాయ్‌లో రవాణా వ్యాపారంలో చేసేవాడు. అక్కడే అమృత్‌పాల్ కూడా మామతో కలిసి పనిచేశాడు. అక్కడ్నుంచి కెనడాకి మకాం మార్చాడు. గత నెలలోనే హర్‌జీత్ భారత్‌కు తిరిగి వచ్చాడు. అమృత్‌పాల్ దుబాయ్ నుంచి పంజాబ్‌కు వచ్చి ఖలిస్తానీ నాయకుడి అవతారం ఎత్తడం వెనుక హర్‌జీత్ ప్రభావం అధికంగా ఉంది.


సాక్షి, నేషనల్ డెస్క్

హరియాణాకు అమృత్‌పాల్ పరారీ?

అమృత్‌సర్: ఖలిస్తాన్ వేర్పాటువాద నాయకుడు, ఆరు రోజులుగా పోలీసుల కళ్లు గప్పి తప్పించుకొని తిరుగుతున్న అమృత్‌పాల్ సింగ్ సరిహద్దులు దాటి హరియాణాకు వెళ్లి ఉంటాడన్న అనుమానాలున్నాయి. ఈ విషయాన్ని పంజాబ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ పోలీసు సుకుచిన్ సింగ్ గిల్ గురువారం వెల్లడించారు. బైక్ మీద పారిపోయిన అమృత్‌పాల్ సింగ్, పపల్‌ప్రీత్ సింగ్‌లకు కురుక్షేత్రలోని తన ఇంట్లో ఆశ్రయం ఇచ్చిందని అనుమానాలున్న మహిళ బల్జీత్ కౌర్‌ని హరియాణా పోలీసులు అరెస్ట్ చేసి పంజాబ్ పోలీసులకు అప్పగించారు.బల్జీత్ కౌర్‌కు గత రెండేళ్లుగా పపల్‌ప్రీత్ సింగ్ తెలుసునని హరియాణా పోలీసులు తెలిపారు. ఇక అమృత్‌పాల్ ఏర్పాటు చేసిన ప్రైవేటు సైన్యంలో సభ్యుడైన తేజీందర్ సింగ్ గిల్‌ను కూడా లూథియానా జిల్లాలో పోలీసులు అరెస్ట్ చేసింది. తుపాకులకు ఎలాంటి లైసెన్స్ లేకుండా గిల్ సోషల్ మీడియా వేదికల్లో వాటి ఫోటోలను ఉంచేవాడని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు అమృత్‌పాల్ కోసం వేట సాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్నెట్ కనెక్షన్‌పై నిషేధం విధించారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శుక్రవారం । 24 । మార్చి । 2023



నేడు తెల్లచామంతితో అర్చన

ఇంద్రకీలాద్రి: వసంత నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని దుర్గమ్మకు శుక్రవారం తెల్ల చామంతితో అర్చన నిర్వహిస్తారు. రూ. 2,500 టికెట్ కొనుగోలు చేసి పూజలో పాల్గొనవచ్చు.



పెడన పీహెచ్‌సీ తనిఖీ

పెడన: స్థానిక పీహెచ్‌సీని కృష్ణా జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి. గీతాబాయి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌తో పాటు ఓపీ రిజిస్టర్లను పరిశీలించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహరి (శని)
విజయవాడ	6.19	4.56
మచిలీపట్నం	6.23	4.49
జగ్గయ్యపేట	6.26	4.52

న్యూస్‌రీల్

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు



చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్ష రాశారు. కృష్ణా జిల్లాలో మొత్తం 18,418 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 18,125 మంది హాజరయ్యారు. 293 మంది విద్యార్థులు హాజరుకాలేదు. ఎన్టీఆర్ జిల్లాలో 35,995 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 35,363 మంది విద్యార్థులు హాజరయ్యారు. 632 మంది విద్యార్థులు హాజరుకాలేదు. ఎన్టీఆర్ జిల్లాలోని కృష్ణలంక ప్రభుత్వ జూనియర్ కళాశాల, చిట్టినగర్ సయ్యద్ అప్పలస్వామి కళాశాల, వన్‌టౌన్‌లోని కేబీఎన్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ఆర్‌ఐవో పి. రవికుమార్ పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా మాల్ ప్రాక్టీస్ జరగలేదని ఆయన తెలిపారు.

31 నుంచి యువజనోత్సవాలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జాతీయ స్థాయి సాంస్కృతిక యువజనోత్సవాలను ఈ నెల 31వ తేదీ నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. కేఎల్ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను గురువారం కలెక్టర్ ఢిల్లీరావు ఆయన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతలో జాతీయ సమైక్యతను పెంపొందించే విధంగా యువజనోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. మాక్ పార్లమెంట్, క్విజ్, వివిధ విభాగాలలో సాంస్కృతిక కార్యక్రమాలు, గేమింగ్ పోటీలను నిర్వహిస్తామని కలెక్టర్ చెప్పారు. ప్రచార పోస్టర్ విడుదల కార్యక్రమంలో కేఎల్ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్ట్స్ విద్యార్థులు డమరకనాథ్ వెంకట్, సురేష్, గణేష్, హర్ష, బాలాజీ తదితరులు ఉన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పలువురు భక్తులు గురువారం విరాళాలను అందజేశారు. తిరువూరు గుడిమెట్ల లక్ష్మీరవీంద్రబాబు కుటుంబం గుడిమెట్ల రాఘవరావు, వజ్రమ్మల పేరిట రూ. 1,01,116, విజయవాడ భవానీపురానికి చెందిన ఐ. పూర్ణచంద్రరావు కుటుంబం రూ. 1,00,116 విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు బహూకరించారు.

28 నుంచి 'అమ్మ' శత జయంతి ఉత్సవాలు



విజయవాడ కల్చరల్: బాపట్ల జిల్లా జిల్లెళ్ళమూడి అమ్మ శత జయంతి ఉత్సవాలను ఈనెల 28 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జాతీయ స్థాయిలో నిర్వహించనున్నట్లు విశ్వజననీ పరిషత్ మేనేజింగ్ ట్రస్టీ పి. గిరిధర్ కుమార్ తెలిపారు. విజయవాడలోని కొత్త పూర్ణానందం విలాస్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ అమ్మ శాంతి సందేశం సమస్త మానవాళికి వినిపించడానికి ట్రస్ట్ ద్వారా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదురోజులపాటు ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి ప్రారంభించి, శతజయంతి విశిష్ట సంచిక ఆవిష్కరిస్తారన్నారు. ప్రచార కమిటీ కార్యదర్శి మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి మాట్లాడుతూ సిద్ధేశ్వరానంద భారతి, విశ్వయోగి విశ్వంజీ, కమలానంద భారతి, సీతారామ గురుదేవులు, వాసుదేవానంద గిరి స్వామీజీల అనుగ్రహ భాషణ ఉంటుందన్నారు. ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందన్నారు.



జగన్మాతకు పుష్పాభిషేకం

ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం దుర్గమ్మకు ఎర్రగులాబీలు, కనకాంబరాలతో అర్చన చేశారు. లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద ప్రతిష్ఠించిన దుర్గమ్మ ఉత్సవ మూర్తికి ఈ పుష్పాలతో అర్చన నిర్వహించారు. అమ్మవారికి జరుగుతున్న విశేష పుష్పార్చనను వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు వేదిక వద్దకు చేరుకున్నారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనం అందజేసిన అర్చకులు వారికి పుష్పాలను బహూకరించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

బానిస సెల్ కావొద్దు

పరీక్షల సమయం.. ఫోన్‌కు విరామం ఇచ్చేద్దాం

- సోషల్ మీడియాతో సమయం వృథా
- ఆన్ లైన్ గేమ్స్‌తోనూ ఇబ్బందులే
- మితిమీరిన వినియోగంతో నిద్రలేమి, నేత్ర, మానసిక రుగ్మతలు



కంచికచర్ల(నందిగామ): సామాజిక మాధ్యమం రెండు వైపులా పదునైన కత్తిలాంటిది. ఆశయం దిశగా సాగితే విజ్ఞానం, వినోదం ఉంటాయి. ఏ మాత్రం గురితప్పినా జీవితం తారుమారు అవుతుంది. యువత మార్కెట్‌లోకి ఏ ట్రెండ్ వచ్చినా అందిపుచ్చుకుంటుంది. వాటిని అనుసరిస్తుంది. ఫేస్‌బుక్‌లో లైకులు, కామెంట్లు, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లో కామెంట్లు, వాట్సాప్‌లో స్టేటస్‌లు ఇలా.. ఊహల గగనంలో విహరిస్తోంది. మరోవైపు ఆన్‌లైన్ వీడియో గేమ్స్‌కు అడిక్ట్ అవుతోంది. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు జరుగుతూనే ఉన్నాయి. వచ్చేనెల ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఇలాంటి సమయాల్లో సామాజిక మాధ్యమాలను వినియోగిస్తూ ఉంటే భవిష్యత్ పక్కదారి పట్టే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు.

ఫేస్‌బుక్ అంటే క్రేజ్..

ఫేస్‌బుక్ పేరు వింటేనే అందరిలో ఉత్సాహం మొదలవుతుంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఫేస్‌బుక్ దగ్గరయింది. యువత విషయంలో చెప్పాల్సిన అవసరంలేదు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గరపడుతున్న సమయంలో ఫేస్‌బుక్, ఇన్‌స్టా రీల్స్ ఎక్కువయితే విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను చేరుకోలేరు. ఈ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోకపోతే మొదటికే మోసం వస్తుంది.

పరిమితి దాటితే ప్రమాదమే..

సామాజిక మాధ్యమాలను రోజుకు 30నిముషాలకు మించి వినియోగిస్తే ఇబ్బందులు లేవని వైద్యులు అంటున్నారు. కానీ చాలామంది గంటల తరబడి ఇందులోనే గడుపుతుంటారు. ప్రతిరోజూ వాటిని వినియోగించి ప్రస్తుతం పరీక్షలు దగ్గరపడుతున్న సమయంలో ఆ వ్యసనాన్ని వదులుకోలేకపోతున్నారు. అలాంటివారు తమకు తామే ఓ పరీక్ష పెట్టుకోవాలని వైద్యులు, ఉపాధ్యాయులు అంటున్నారు. ప్రతి పది నిముషాలకు ఒకసారి ఫోన్ వైపునకు చేయి వెళ్తుందా.. ఫేస్‌బుక్, వాట్సప్ చూడాలనిపిస్తుందా.. అనే విషయాలు తమను తామే ప్రశ్నించుకోవాలి. పరిస్థితి చేయి దాటినట్లు భావిస్తే.. వారం పదిరోజులు వాటికి దూరంగా ఉండేటట్లు ప్రయత్నించాలి. ఇలా ఉండకలిగితే నియంత్రణలో ఉన్నట్లే లెక్క. ఉండకపోతే వాటికి బానిస అయినట్లే!

మానసిక రుగ్మతలు..

ఫేస్‌బుక్, వాట్సాప్, ఇతర సామాజిక మాధ్యమాలకు అలవాటు పడితే మానసిక రుగ్మతలతో పాటు కంటి సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం చాలామందికి సెల్‌ఫోన్ ఒక వ్యసనంగా మారుతోందని హెచ్చరిస్తున్నారు.

కంటిచూపుపై ప్రభావం..



ఎక్కువ సమయం సామాజిక మాధ్యమాలను వినియోగిస్తే కంటిచూపుపై ప్రభావం పడుతుంది. దీని వలన రెటీనా పొర దెబ్బ తింటుంది. కంటిచూపు మందగించటంతో పాటు ఎముకల సమస్యలు వస్తాయి. ఆరోగ్యం క్షీణిస్తుంది. సెల్‌ఫోన్ అతి వినియోగం మంచిది కాదు.

– కె. మధురిమ, వైద్యురాలు, పీహెచ్‌సీ, కంచికచర్ల

సమయం వృథా చేయవద్దు..



పదో తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గరపడుతున్న సమయంలో సామాజిక మాధ్యమాలకు అలవాటు పడి సమయాన్ని వృథా చేయకూడదు. ప్రస్తుతం ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నతస్థాయి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఫేస్‌బుక్, ఇతర సోషల్‌యాప్‌లకు అలవాటు పడ్డారు. దీని ఫలితంగా చదువులు పక్కదారి పడుతున్నాయి.

– కె. రామకృష్ణ, హెచ్‌ఎం, జెడ్పీ హైస్కూల్, గండేపల్లి

వైద్యులు నైతిక విలువలు పాటించాలి

ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి



లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్యులుగా నైతిక విలువలు పాటిస్తూ ప్రాక్టీస్ చేసినప్పుడే వృత్తిలో రాణించగలుగుతారని ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అన్నారు. నగరంలోని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో గురువారం ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులకు ఏపీ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నైతిక విలువలు పాటిస్తూ ప్రాక్టీసు చేయడంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ నేటి వైద్యం మెకానికల్‌గా మారిపోయిందన్నారు. రోగిని ఫిజికల్‌గా ఎగ్జామినేషన్ చేయకుండా, ఎంఆర్ఐ, సీటీ స్కాన్‌ల రిపోర్టుల ఆధారంగా వైద్యం చేయడం ప్రారంభించారన్నారు. అలా కాకుండా ముందు రోగికి వైద్యులు ఇంటరాక్ట్ అవ్వాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్, సైకియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు. సదస్సులో పాల్గొన్న ఎంబీబీఎస్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు.

ప్రీ క్వార్టర్స్‌కు రాష్ట్ర హ్యాండ్‌బాల్ జట్టు

విజయవాడ స్పోర్ట్స్: జాతీయ హ్యాండ్‌బాల్ జూనియర్ బాలికల పోటీల్లో రాష్ట్ర జట్టు వరుస విజయాలతో దూసుకుపోతోంది. పూల్–ఈలో ఉన్న జట్టు అదే పూల్‌లోని ఉత్తరాఖండ్ జట్టును 19–0 తేడాతో ఈ నెల 22వ తేదీన ఓడించింది. 23వ తేదీన అసోం జట్టును 25–6 తేడాతో ఓడించి ప్రీ క్వార్టర్స్‌కు చేరింది. జాతీయ పోటీల్లో రాణిస్తున్న జట్టు బృందాన్ని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పెనుమత్స సత్యనారాయణరాజు అభినందించారు.

ఆంధ్రా షిర్డీ.. అద్భుతః

- కోటి రుద్రాక్ష అభిషేకానికి ముస్తాబైన ముత్యాలంపాడు బాబా మందిరం
- ఈ నెల 28న కార్యక్రమ నిర్వహణ
- లోక కల్యాణార్థం ఏటా విశేష పూజలు
- ఇప్పటికే రెండు సార్లు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



కోటి రుద్రాక్ష అభిషేకానికి సిద్ధం చేసిన రుద్రాక్ష మాలలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సర్వమానవాళి సంక్షేమం కోసం ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఈనెల 28వ తేదీన కోటి రుద్రాక్ష అభిషేకం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి పర్యవేక్షణలో ఏటా లోక కళ్యాణార్థం విశేషంగా పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. దేశంలో ఎక్కడా నిర్వహించని విధంగా 2018లో లక్ష నారికేళ జలాలతో అభిషేకం చేశారు. ఇందుకుగానూ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ చోటు లభించింది. అలాగే 2021లో దశ సహస్ర వస్త్ర పూజ, 2022లో లక్ష కేజీల బియ్యంతో తండులాభిషేకం జరిపారు. తండులాభిషేకానికి సైతం వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ వచ్చింది. ఇప్పుడు నేపాల్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన కోటి రుద్రాక్షలతో ఈనెల 28వ తేదీన బాబాకు విశేషంగా అభిషేకం చేయటానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి కోటి రుద్రాక్షలను దర్శించారు.

10 నెలలుగా రుద్రాక్షలు సేకరణ..

గత 10 నెలల నుంచి నేపాల్‌లో మందిర సేవకులు పర్యటించి చెట్ల నుంచి రాలిపడిన రుద్రాక్షలను సేకరించి నగరానికి తీసుకువచ్చారు. తీసుకువచ్చిన రుద్రాక్షలను శుభ్రం చేసి గ్రేడింగ్ చేశారు. వాటిని మాలలు తయారు చేశారు. 108 రుద్రాక్షలను తీగతో కలిపి ఓ మాలగా రూపొందించారు. రుద్రాక్షలకు చతుర్వేదానుసారం విశేషంగా అభిషేకం చేసి భక్తుల చేతులమీదుగా బాబా మెడలో వేయిస్తారు.



మాజీ మంత్రి వెలంపల్లి చేతులమీదుగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అందుకుంటున్న గౌతంరెడ్డి(ఫైల్)

రెండు లక్షల మందికి భోజన ఏర్పాట్లు ..

ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మందిరంలో కోటి రుద్రాక్ష అభిషేకానికి ఏర్పాటు చేశాం. ఇప్పటికే రాష్ట్రంలోని యతీశ్వరులు, ప్రముఖులకు ఆహ్వానాలు పంపించాం. కోటి రుద్రాక్ష అభిషేకానికి రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే సుమారు రెండు లక్షల మందికి అన్నప్రసాద వితరణ చేయటానికి ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులు దాతల సహకారంతో ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరాన్ని ఆంధ్రాషిర్డీగా తీర్చిదిద్దాం.

– డా. పూనూరు గౌతంరెడ్డి, మందిర గౌరవాధ్యక్షుడు

క్రీడల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజా



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్.కె.రోజా


విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్రంలో క్రీడలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. రాష్ట్ర క్రీడా సంఘాల ప్రతినిధులతో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) గురువారం సమావేశమైంది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలోని టేబుల్ టెన్నిస్ హాలులో జరిగిన ఈ సమావేశానికి మంత్రి రోజాతో క్రీడా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీమోహన్, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్‌రెడ్డి, ఎండీ కె.హర్షవర్ధన్ హాజరయ్యారు. ముందుగా క్రీడా సంఘాల ప్రతినిధుల నుంచి పలు సలహాలు, సూచనలు, విన్నపాలు, ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం మంత్రి రోజా మాట్లాడుతూ గతంలో క్రీడాకారులకు రెండు శాతం రిజర్వేషన్ కల్పించామన్నారు. ఇకపై డైరెక్ట్ రిజర్వేషన్ పద్ధతిని ప్రభుత్వం అమలు చేయబోతుందన్నారు. దీనిలో ఎస్సీ, ఎస్టీలతో పాటు ఈబీసీ, విభిన్న ప్రతిభావంతులను చేర్చినట్లు చెప్పారు. త్వరలో దీనికి సంబంధించిన జీవోను ప్రభుత్వం విడుదల చేయబోతుందన్నారు. జీవో 74 ప్రకారం మరో 24 క్రీడలకు ప్రభుత్వం గుర్తింపు ఇస్తామన్నారు. స్పోర్ట్స్ పాలసీని త్వరలో అమలు చేస్తామన్నారు. క్రీడల అభివృద్ధికి కావాల్సిన మౌలిక వసతులను ప్రాధాన్యతాక్రమంలో సమకూర్చుతామన్నారు. అదేవిధంగా క్రీడా సంఘాలు, క్రీడాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

క్రీడా సంఘాలు ఏకతాటిపైకి రావాలి..

క్రీడా సంఘాల్లో వివాదాల కారణంగానే రాష్ట్రంలో క్రీడలు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. దీని కారణంగానే ప్రతిభ ఉన్న క్రీడాకారులు ప్రభుత్వ పారితోషకాలను, విద్యా, ఉద్యోగాల్లో అవకాశాలను అందుకోలేకపోతున్నారు. కబడ్డీ సంఘంలో వివాదంతో కబడ్డీ క్రీడాకారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతమన్నారు. సంఘాల ప్రతినిధులు పంతాలకు పోయి క్రీడాకారుల జీవితాలను నాశనం చేస్తున్నారన్నారు. ఇటీవల ఫుట్‌బాల్ సంఘంలోనూ ఇదే తరహాలో వివాదం చెలరేగిందన్నారు. మే నెలలో జరిగే ఫుట్‌బాల్ సంఘ ఎన్నికలను సిట్టింగ్ జడ్జి సమక్షంలో నిర్వహిస్తామన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన అధికారులకు అభినందన

విజయవాడ స్పోర్ట్స్: నాన్ కేడర్ ఎస్పీ నుంచి ఎస్పీ (ఐపీఎస్)గా ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన కె.శ్రీనివాసరావు, ఎ.బి.టి.ఎస్.ఉదయరాణి ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె. రాణాను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కె.శ్రీనివాసరావు ప్రస్తుతం జిల్లా ట్రాఫిక్ డీసీపీగా, ఉదయరాణి సిటీ సెక్యూరిటీ వింగ్ డీసీపీగా పని చేస్తున్నారు. ఇరువురు అధికారులను సీపీ ప్రత్యేకంగా అభినందించి సమర్థంగా విధులు నిర్వర్తించి ప్రజలకు సేవ చేయాలని సూచించారు.



ఉద్యోగోన్నతి పొందిన కె.శ్రీనివాసరావును, ఉదయరాణిని అభినందిస్తున్న సీపీ రాణా

శరవేగంగా భూముల రీ సర్వే

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా భూ సర్వే ప్రక్రియ తుది దశ పనులను వేగవంతంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఢిల్లీరావు సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్‌కు వివరించారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రీసర్వే పనుల ప్రగతిని సీసీఎల్ఏ కార్యాలయం నుంచి స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి. సాయి ప్రసాద్, అదనపు కార్యదర్శి ఏ. ఇంతియాజ్ అని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సర్వే అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టర్ వీడియోకాన్ఫరెన్స్ నుంచి కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ సర్వే ప్రక్రియకు సంబంధించి సరిహద్దు రాళ్లను పాతే ప్రక్రియ (స్టోన్ ప్లాంటేషన్) వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాకు కేటాయించిన 23,383 సరిహద్దు రాళ్లలో ఇప్పటికే 10 వేలకు పైగా రాళ్లను పాతడం జరిగిందని, మిగిలిన వాటిని నిర్దేశించిన గడువులోగా పూర్తి చేస్తామని కలెక్టర్ అన్నారు. సర్వే వివరాలను వెబ్ ల్యాండ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియ చేపట్టామన్నారు. ఇందులో భాగంగా 14 గ్రామాలకు గాను ఇప్పటికే 6 గ్రామాలకు సంబంధించి వివరాలను అప్‌లోడ్ చేశామన్నారు. మిగిలిన 8 గ్రామాలకు సంబంధించిన వివరాలను త్వరితగతిన అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రోన్ ఫ్లైయింగ్ కార్యక్రమంలో భాగంగా 300 గ్రామాలకు గాను 136 గ్రామాలలో ఫ్లైయింగ్ పూర్తయిందన్నారు. మిగిలిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఢిల్లీరావు సీసీఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి. సాయి ప్రసాద్‌కు వివరించారు. జేసీ శ్రీవాస్ నుపూర్, జిల్లా సర్వే అధికారి కె. సూర్యారావు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్

నున్న(విజయవాడ రూరల్): క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వికాస్ విద్యాసంస్థల కార్యదర్శి నరెడ్ల సత్యనారాయణరెడ్డి అన్నారు. నున్న గ్రామంలోని వికాస్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం అంతర్ కళాశాలల పురుషుల సాఫ్ట్ బాల్ పోటీలు ఆయన ప్రారంభించారు. నాకౌట్ కమ్ లీగ్ విధానంలో ఈ టోర్నీ జరుగుతోంది. తొలి రోజు ఎస్ఎస్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు 11–0 తేడాతో పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ జట్టుపై గెలుపొంది లీగ్‌కు చేరింది. తొలి లీగ్ మ్యాచ్‌లో వికాస్ బీపీ ఈడీ కాలేజీ 3–0 తేడాతో ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ కాలేజీపై గెలుపొందగా రెండో లీగ్ మ్యాచ్‌లో ఆంధ్రా లయోలా కాలేజీ జట్టు 4–0 తేడాతో ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కాలేజి జట్టుపై గెలుపొందింది.



సాఫ్ట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

చిన అవుటపల్లిలో నేషనల్ మానిటరింగ్ టీం

గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లి గ్రామంలో గురువారం నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీమ్, జిల్లా పంచాయతీ రాజ్ రిసోర్స్ సెంటర్ అధికారులు పర్యటించారు. గ్రామాన్ని బహిరంగ మల మూత్ర విసర్జన రహిత గ్రామంగా గడచిన కొన్ని సంవత్సరాలుగా పరిగణిస్తున్న నేపథ్యంలో ఈ బృందాలు మరోసారి గ్రామంలో పర్యటించాయి. ప్రభుత్వ కార్యాలయాలు సందర్శించాయి. సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, సంపద వనరుల కేంద్రం పరిశీలించి మరుగుదొడ్ల పరిస్థితిని సమీక్షించాయి. అంతేగాక సంపద వనరుల కేంద్రంలో తడిచెత్త, పొడి చెత్తను వేర్వేరుగా గ్రీన్ అంబాసిడర్‌లు ఏర్పాటు చేసి వాటి నుంచి ఎరువును తయారు చేసే ప్రక్రియను పరిశీలించాయి. జిల్లా పంచాయతీరాజ్ రిసోర్స్ సెంటర్ కన్సల్‌టెంట్ కె.నాగేశ్వరమ్మ, నేషనల్ మానిటరింగ్ టీమ్ సభ్యులు రాము, జయ, వెంకటేష్, తారక్, కుమార్ తదితరులు గ్రామంలో పరిస్థితులను భౌతికంగా తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి జేవీ నామేశ్వరరావు, సర్పంచ్ జి.విజయలక్ష్మి పాల్గొన్నారు.



చిన అవుటపల్లి పాఠశాలలో వసతులు పరిశీలిస్తున్న సెంట్రల్ మానిటరింగ్ టీమ్

క్లుప్తంగా

22,066 సంఘాలకు వైఎస్సార్ ఆసరా

ఎన్టీఆర్ జిల్లా డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు

కంకిపాడు(పెనమలూరు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత కింద ఎన్టీఆర్ జిల్లాలో 22,066 డ్వాక్రా సంఘాల సభ్యులకు రూ.192.96 కోట్ల మేర లబ్ధి చేకూరుతుందని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఇప్పటికే వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రభుత్వం రెండు విడతలు అమలు చేసిందని పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీన మూడో విడత ఆసరా సొమ్మును డ్వాక్రా సంఘాల సభ్యుల బ్యాంకు ఖాతాలకు జమ చేయనుందని పేర్కొన్నారు. నియోజకవర్గాల వారీగా గన్నవరంలో 2607 సంఘాలకు రూ.25.83 కోట్లు, జగ్గయ్యపేటలో 4,679 సంఘాలకు రూ.40.92 కోట్లు, మైలవరంలో 5,814 సంఘాలకు రూ.49.83 కోట్లు, నందిగామలో 4,162 సంఘాలకు రూ.34.90 కోట్లు, తిరువూరులో 4,804 సంఘాలకు రూ.40.78 కోట్ల మేర లబ్ధి చేకూరుతుందని వివరించారు. ఈ నెల 25వ తేదీ ఉదయం 11 గంటలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో లబ్ధిదారులకు ఆసరా సొమ్ము చెక్కు అందజేత కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా పది రోజులు పాటు ఆసరా సంబరాలు నిర్వహిస్తామని వివరించారు.

గంగాభవానీ జాతరకు పోటెత్తిన భక్తజనం


ప్రత్యేక అలంకారంలో అమ్మవారు


గంగాభవానీ ఆలయం వద్ద భక్తుల కోలాహలం

కోడూరు(అవనిగడ్డ): భక్తుల కొంగుబంగారంగా పూజలు అందుకుంటున్న కోడూరు గంగాభవానీ జాతరకు గురువారం భక్తులు పోటెత్తారు. ఈ మూల మూర్తికి చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. డప్పువాయిద్యాల నడుమ మహిళలు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. తలపై గండదీపాలు, మెడలో గారెల దండలతో పసుపు - కుంకుమ, సారెతో వచ్చి అమ్మవారికి సమర్పించారు. యువకులు డప్పువాయిద్యాలకు అనుగుణంగా కర్రసాము, వీరతాడుతో విన్యాసాలు చేసి ఆకట్టుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై భారీ ప్రభలను ఊరేగించారు. పోతురాజు, ధ్వజస్తంభం వద్ద కూడా భక్తులు పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకటసత్య నారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సోనోవిజన్ లక్కీడ్రా విజేతలు


లక్కీడ్రా కూపన్ తీస్తున్న గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు, పక్కన షోరూమ్ నిర్వాహకులు

పాతగుంటూరు: సోనోవిజన్ ఉగాది డిస్కౌంట్ సేల్ సందర్భంగా గుంటూరు కొనుగోలుదారులకు లక్కీడ్రాలో హోండా అమేజ్ కారు బహుమతిగా అందించినట్లు షోరూమ్ మేనేజింగ్ పార్ట్నర్ భాస్కరమూర్తి తెలిపారు. గుంటూరు లక్ష్మీపురం సోనోవిజన్ షోరూంలో గురువారం సాయంత్రం జరిగిన లక్కీడ్రాలో హోండా అమేజ్ కారు, ఎల్‌ఈడీ టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్‌మిషన్ బహుమతులుగా అందించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గుంటూరు మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సోనోవిజన్ కొనుగోలుదారుల సమక్షంలో జరిగిన లక్కీడ్రాలో హోండా అమేజ్ కారును చేబ్రోలుకు చెందిన కె.సాయిరామ్ సొంతం చేసుకున్నారు. గణితపూడికి చెందిన షేక్ మొహమ్మద్ ఖాసిం ఎల్‌ఈడీ టీవీ, గుంటూరుకు చెందిన కె.నాగమణి రిఫ్రిజిరేటర్, గుంటూరు చెందిన కె.త్రినాథ్ వాషింగ్‌మిషన్‌ను గెలుపొందారు. తక్కువ ధరలు, నమ్మకమైన సేవలు అందిస్తూ రాష్ట్రంలో అతిపెద్ద ఎలక్ట్రానిక్ షోరూమ్‌గా సోనోవిజన్ నిలిచిందన్నారు. అన్ని పెద్ద కంపెనీలకు చెందిన 2023 ఎయిర్ కండీషనర్ మోడల్స్ అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. ఉగాది డిస్కౌంట్ సేల్లో వడ్డీగాని, డీబీడీ గాని లేకుండా ఫైనాన్స్ లాభదాయకంగా ఉంటుందన్నారు. మొబైల్స్, ల్యాప్‌టాప్స్ ఎక్కువ డిస్కౌంట్ లభించడం తమ షోరూం ప్రత్యేకత అన్నారు. అంతే కాకుండా పది శాతం వరకు లభించే క్యాష్‌బ్యాక్ లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. అందరి కన్నా తక్కువ ధరలలో సోనోవిజన్ సేల్, మరింత నమ్మకమైన సర్వీస్ అందిస్తామని వివరించారు.

గుడివాడ-కంకిపాడు రహదారికి మహర్దశ

- రహదారి విస్తరణకు రూ.16 కోట్ల మంజూరు
- ముమ్మరంగా జరుగుతున్న విస్తరణ పనులు


గుడివాడ-కంకిపాడు రహదారి పనులు చేస్తున్న కూలీలు

గుడివాడరూరల్: రెండు జిల్లాల ప్రజలు ఎదురు చూస్తున్న గుడివాడ-కంకిపాడు రహదారి పునర్నిర్మాణ పనులకు మోక్షం లభించింది. గత ప్రభుత్వాలు ఈ రోడ్డును పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రహదారి నిర్మాణం, విస్తరణ పనులకు నిధులు మంజూరయ్యాయి. దీంతో రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దశాబ్దాల కాలంగా మరమ్మతులకే కానీ పునర్నిర్మాణానికి ఈ రోడ్డు నోచుకోలేదు. ఫలితంగా రోడ్డు అధ్వానంగా మారింది. ఈ మార్గంలో రాకపోకలకు ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఈ రోడ్డు పునర్నిర్మాణం జరిగింది. ఆ తరువాత పాలకులు ఈ రోడ్డును పట్టించుకోలేదు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డు మరమ్మతులను సైతం విస్మరించారు. గుడివాడ నుంచి పెదపారుపూడి వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఈ మార్గంలో రాకపోకలకు ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను గుర్తించిన గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) రోడ్డు విస్తరణ, నిర్మాణ పనులకు నిధులు మంజూరయ్యేలా కృషి చేశారు. ఫలితంగా సెంట్రల్ రోడ్ ఫండ్ నిధుల నుంచి రూ.16 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో గుడివాడ పట్టణంలోని కేటీఆర్ కళాశాల నుంచి మందపాడు రైల్వే గేటు వరకు సీసీ రోడ్డు నిర్మాణం, గుడివాడ ఫ్లై ఓవర్ నుంచి పెదపారుపూడి వరకు 2.5 కిలో మీటర్ల మేర విస్తరణ, తారురోడ్డు, దానికి రెండు వైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

శరవేగంగా నిర్మాణ పనులు

గుడివాడ - కంకిపాడు రహదారి నిర్మాణంపై ఎమ్మెల్యే కొడాలి నాని ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. దీంతో కాంట్రాక్టర్ రోడ్డు పనులను శరవేగంగా కొనసాగిస్తున్నారు. ఇప్పటికే కేటీఆర్ కళాశాల నుంచి మందపాడు రైల్వే గేటు వరకు రోడ్డు విస్తరణతో పాటు సీసీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. గుడివాడ ఫ్లై ఓవర్ నుంచి కొంత మేర తారురోడ్డు పనులు కూడా పూర్తయ్యాయి. ఫ్లై ఓవర్ దిగువ నుంచి పెదపారుపూడి వరకు రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రోడ్డును అనుకుని కాలువలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డు త్వరితగతిన శిథిలావస్థకు చేరకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. కాలువల వెంబడి రోడ్డుకు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు సైతం జరుగుతున్నాయి. రోడ్డు పనులు జరుగుతున్న తీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



గతంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా గుడివాడ- కంకిపాడు రోడ్డు పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ రోడ్డును నిర్మించారు. ఇప్పుడు ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రోడ్డు పనులకు మోక్షం కలిగింది. రోడ్డు విస్తరణకు నిధులు మంజూరుచేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– మసిముక్కు నాగరాజు(చంటి), బేతవోలు

ఎమ్మెల్యే కొడాలి నాని కృషితో..



2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన గుడివాడ - కంకిపాడు రోడ్డుకు నిధులు మంజూరు చేయలేదు. కనీసం మరమ్మతులు చేపట్టలేదు. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని రోడ్డు నిర్మాణం పట్ల చూపిన చొరవ, కృషితోనే ఇప్పుడు రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే కొడాలి నాని కృషిని ఎవరూ మరువలేరు. మరోమారు గుడివాడ నియోజకవర్గ ప్రజలు ఆయనకే పట్టం కడతారు.

– కె.ఫణికుమార్, పెదపారుపూడి

చేపలు పట్టే విషయంలో ఘర్షణ.. ఒకరి మృతి


సాయిచంద్ మృతదేహం

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): చేపలు పట్టేందుకు నిరాకరించడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఒకరు తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. జగ్గయ్యపేట పట్టణం ఎర్ర కాలువ కట్టకు చెందిన మేడేపల్లి సాయిచంద్ (26) పెయింటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఏడాదిన్నర క్రితం అనుమంచిపల్లి గ్రామంలోని బలుసుపాడు కాలనీకి తల్లిదండ్రులతో కలిసి వలస వెళ్లాడు. పెయింటింగ్ పనులు లేని సమయంలో చేపలు పట్టేందుకు వెళ్తుంటాడు. ఈ క్రమంలో అదే కాలనీకి చెందిన పాతకోటి పుల్లారావుతో కొంత కాలంగా సమీప చెరువులు, కాలువల్లో చేపలు పట్టేందుకు వెళ్తున్నాడు. రెండు రోజులుగా సాయిచంద్ అదే కాలనీకి చెందిన దాదావలీతో చేపలు పట్టేందుకు వెళ్తున్నాడు. దీంతో పుల్లారావు మధ్యాహ్న సమయంలో చేపలు పట్టేందుకు అతనితో వెళ్ల వద్దని, తనతోనే రావాలని సాయిచంద్‌ను అడిగాడు. అతను నిరాకరించడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. పుల్లారావు పక్కనే ఉన్న గడ్డపారతో సాయిచంద్ తలపై మోదాడు. తీవ్రంగా గాయపడిన సాయిచంద్ కుప్పకూలాడు. కాలనీ వాసులు అతడిని హుటాహుటిన జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. సీఐ అడపా నాగమురళి, ఎస్‌ఐ దుర్గాప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించి సాయిచంద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తన కుమారుడిని ముగ్గురు వ్యక్తుల ప్రోత్సాహంతోనే హత్య చేసినట్లు సాయిచంద్ తల్లి సంధ్యారాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పుల్లారావును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ

కృష్ణలంక(విజయవాడతూర్పు): ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి మరో బస్సు ఢీకొన్న ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఆర్టీసీ సిటీ బస్సు గుంటూరు జిల్లా మంగళగిరి ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్ నుంచి ప్రయాణికులతో విజయవాడ బస్టాండ్‌కు బయలుదేరింది. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో కనకదుర్గ వారధి మీదుగా జాతీయ రహదారిపై అమెరికన్ హాస్పిటల్ సమీపానికి చేరుకుంది. ఆ సమయంలో గుంటూరు నుంచి విజయవాడ బస్టాండ్‌కు వెళ్తున్న మరో బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో రెండు బస్సుల అద్దాలు ధ్వసమయ్యాయి. ఈ ప్రమాదంలో ప్రయాణికులు క్షేమంగా ఉన్నారు. రెండు బస్సులు ఢీకొనడంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బస్సులను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

పిడుగుల శబ్దానికి వ్యక్తి మృతి


వెంకటేశ్వరరావు మృతదేహం

పెడన: మండలంలోని నడుపూరు గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం గొర్రెలను మేపుతున్న వ్యక్తి పిడుగుల శబ్దాలకు తీవ్ర అస్వస్థకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రెవెన్యూ అధికారుల సమాచారం మేరకు.. నడుపూరు గ్రామానికి చెందిన పరసా వెంకటేశ్వరరావు(53) గురువారం సాయంత్రం పంట పొలాల్లో గొర్రెలను, గేదెలను మేపుతున్నాడు. వాతావరణంలో మార్పులు రావడంతో ఇంటికి బయలుదేరాడు. అదే సమయంలో పిడుగులు పడ్డాయి. వాటి శబ్దానికి వెంకటేశ్వరరావు తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. స్థానికులు, బంధువులు అతడిని గమనించి పెడనలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో అతడిని మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వెంకటేశ్వరరావు మృతి చెందాడు. పిడుగు పడా లేక లేక పిడుగుపాటు శబ్దానికి గుండెనొప్పి వచ్చి చనిపోయాడా అనేది పోస్టుమార్టంలో తేలుతోందని తహసీల్దారు పి.మధుసూదనరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

మైలవరం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన మండలంలోని పుల్లూరు సమీపంలో గురువారం తెల్లవారు జామున జరిగింది. తెలంగాణ రాష్ట్రం పాల్వంచకు చెందిన పాక చైతన్య, పాగోలు జాన్ ప్రణీత్, కొత్తగూడెంనకు చెందిన పాకాల సాయిరామ్, బండారు సాయివికాస్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. నలుగురూ కలిసి బుధవారం బాపట్ల జిల్లాలోని సూర్యలంక బీచ్‌కు కారులో వెళ్లారు. అక్కడ సరదాగా గడిపి తిరిగి ఇంటికి బయలుదేరారు. గురువారం తెల్లవారు జామున 3.15 గంటల సమయంలో వారు ప్రయాణిస్తున్న కారు పుల్లూరు సెంటర్‌లోని బస్ షెల్టర్ వద్ద రోడ్డుపై నిలిపిన వ్యాన్‌ను వెనక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చైతన్య అక్కడికక్కడే మృతి చెందాడు. చైతన్య మృతదేహన్ని మైలవరం ఆస్పత్రికి తరలించారు. కారు నడుపుతున్న సాయిరామ్, జాన్ ప్రణీత్, సాయివికాస్ తీవ్రంగా గాయపడటంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి జాన్‌ప్రణీత్ మృతి చెందాడని మైలవరం ఎస్‌ఐ పి.రామ్‌బాబు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు.

ప్రేమ పేరుతో వంచన

పామర్రు: ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని 15 ఏళ్ల బాలికను ఓ యువకుడు నమ్మించాడు. శారీరకంగా దగ్గరై ఆమె గర్భం దాల్చడానికి కారణమైయ్యాడు. తన ఇంట్లో ఒప్పుకోనందున పెళ్లిచేసుకోలేనంటూ తేల్చిచెప్పాడు. ఆ బాలిక ఇటీవల మగబిడ్డకు జన్మనిచ్చింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కొమరవోలు గ్రామానికి చెందిన దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె మైనర్ కావడంతో ఆమెను ఇంటి వద్దే ఉంచి దంపతులు నిత్యం కూలి పనులకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన యువకుడు దాసరి నాగగోవిందు ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని ఆ బాలికను నిమ్మించి శారీరకంగా దగ్గరయ్యాడు. ఇలా కొంత కాలం గడిచాక బాలిక గర్భం దాల్చింది. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పవద్దంటూ గోవిందు బాలికను బెదిరించాడు. కొన్ని నెలలు గడిచాక బాలిక తల్లిదండ్రులకు విషయం తెలిసి గోవిందును పిలిపించి మాట్లాడారు. తన ఇంట్లోవాళ్లు ఒప్పుకోనందున పెళ్లిచేసుకోలేని తేల్చిచెప్పాడు. ఈ నెల 22వ తేదీన ఆ బాలిక గుడివాడలోని ఓ ప్రయివేటు వైద్యశాలలో మగబిడ్డకు జన్మనిచ్చింది. తమ కుమార్తెను గోవింద్ మోసగించాడని పామర్రు పోలీస్‌స్టేషన్‌లో బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. గుడివాడ డీఎస్పీ సత్యానంద్ గురువారం కొమరవోలు వెళ్లి వివరాలను సేకరించారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పామర్రు సీఐ వెంకటనారాయణ, ఎస్‌ఐ అవినాష్ పాల్గొన్నారు.

వివాహిత మృతి కేసులో భర్త అరెస్టు

పెనమలూరు: అదనపు కట్నం కోసం భార్యను వేధించి ఆమె మరణానికి కారకుడైన భర్తను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు కథనం మేరకు.. కానూరు పరిధిలోని సనత్ నగర్‌కు చెందిన బిట్రా ఉమాకాంత్‌కు హైదరాబాద్ మేడ్చల్‌కు చెందిన సహజ (26)తో 2020 సంవత్సరంలో వివాహమైంది. పెళ్లి సమయంలో ఉమాకాంత్‌కు అత్తింటివారు కట్న కానుకలు అందజేశారు. అయితే సహజను అదనపు కట్నం కోసం భర్త ఉమాకాంత్, అత్త సక్కుబాయి, ఆడపడుచు కిరణ్మయి వేధిస్తున్నారు. ఈ వేధింపులను తాళలేక ఈ నెల 21వ తేదీన సహజ ఉరి వేసుకుని మృతి చెందింది. అత్తింటివారే తన బిడ్డను చంపారని సహజ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం ఉమాకాంత్‌ను అరెస్టు చేశారు.

అగ్నివీర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ స్పోర్ట్స్: దేశ రక్షణ శాఖ ప్రకటించిన అగ్నివీర్-వాయుసేన ఉద్యోగాలకు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలని యువజన సర్వీసుల శాఖ ఉమ్మడి కృష్ణా జిల్లా సీఈఓ యు.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. 2002 డిసెంబర్ 26, 2006 జూన్ 26వ తేదీ మధ్యలో జన్మించిన వారు ఈ ఉద్యోగాలకు అర్హులని పేర్కొన్నారు. ఇంటర్, డిప్లొమా, రెండేళ్ల ఒకేషనల్(ఫిజిక్స్, మ్యాథ మేటిక్స్ సబ్జెక్టులు) కోర్సులు చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. యువకులు 152.5 సెంటీ మీటర్లు, యువతులు 152 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలని స్పష్టంచేశారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులను httpr://:agnipathvayu.cdac.in వెబ్‌సైట్‌లో ఈ నెల 31వ తేదీ లోపు సమర్పించాలని సూచించారు.

క్లుప్తంగా

ఎక్సెల్‌ప్లాంట్ అభివృద్ధి పనుల పరిశీలన



పటమట(విజయవాడతూర్పు): అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ పరిశీలించారు. నగర పర్యటనలో భాగంగా గురువారం ఈ ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన అధికారులకు సూచనలు చేశారు. ప్లాంట్ ఆవరణలో సీసీ రోడ్లు వేయాలని, కొత్తగా ఆఫీసు బిల్డింగ్ నిర్మాణ పనులను, చెత్త వేయింగ్ (వే బ్రిడ్జి) పని తీరును పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. ప్లాంట్ ఆవరణలో ప్రహరీ పక్కన ఏర్పాటు చేసిన గ్రీనరీని పరిశీలించి మొక్కల మధ్య నీరు నిలవడం గమనించారు. అక్కడ పూర్తి స్థాయిలో మట్టితో పూడ్చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సత్యనారాయణరావు, ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, ఎ.డి.హెచ్ శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలి

గుణదల (విజయవాడ తూర్పు): మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఏపీ లైబ్రరీ అసోసియేషన్ కార్యదర్శి రవి శారద అన్నారు. న్యూ హోప్స్ ఆఫ్ న్యూ ఉమెన్ అనే అంశం పై ఆంధ్ర లయోల కళాశాలలో గురువారం సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళాభ్యుదయానికి విద్య ఎంతో దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థినులు సమయాన్ని వినియోగించుకుని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. గతంతో పోలిస్తే ఆధునిక ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారని తెలిపారు. లక్ష్య సాధనకు కృషి చేస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కె.శ్రుతి, డొల్లు కళాకారిణి లలిత మనీష, లయోల కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

పటమట(విజయవాడతూర్పు): డివిజన్‌లో సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ వెంకటసత్యం సర్కిల్–3 ఈఈ చంద్రశేఖర్‌ను కోరారు. 18వ డివిజన్‌లో మాదల వెంకటేశ్వరావు వీధిలో నూతన యూజీడీ పైప్ లైన్ వేయాలని, కరకట్ట రోడ్డు డ్రైన్, మాదిశెట్టి సీతయ్య వీధి, వారధి జంక్షన్ నుంచి వైట్‌హౌస్ వరకు, రామాలయం నుంచి వైట్‌హౌస్ జంక్షన్ వరకు వరద ముంపు డ్రైన్ల నిర్మాణాలకు టెండర్లు పిలవాలని అధికారులను కోరారు.

■ జక్కంపూడి వైఎస్సార్‌కాలనీలో 62,63 బ్లాకులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు గురువారం వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్ఈ నరసింహమూర్తిని కలిసి వినతిపత్రం అందించారు.

పేదలకు సాయపడాలి



గుణదల (విజయవాడ తూర్పు): ప్రజా సమస్యలు తెలుకుని వాటిని పరిష్కరించడంతో పాటు, పేదలకు సాయం చేయడంలో ముందుండాలని 5వ డివిజన్ కార్పొరేటర్ కలపాల అంబేడ్కర్ అన్నారు. క్రీస్తురాజపురం ఆర్‌సీఎం చర్చి వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో పేదల జీవనోపాధి నిమిత్తం రెండు తోపుడు బండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తూర్పు నియోజకవర్గంలో అనేక సేవాకార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆయా డివిజన్ పరిధిలో ఉండే పేదల జీవనోపాధి నిమిత్తం టిఫిన్ బండ్లు, తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అడపా పద్మ, చేబ్రోలు లక్ష్మి అనే పేద మహిళలకు రూ. 30 వేల ఖరీదు చేసే బండ్లను పంపిణీ చేశామన్నారు. డివిజన్ అధ్యక్షుడు మట్టా ప్రసాద్, స్థానిక నాయకులు చిత్రం లోకేష్, ఒగ్గు విశల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.32 లక్షలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ ద్వారా స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకల ఆదాయం రూ.4,32,448 లభించినట్లు ఈఓ గెల్లి హరిగోపీనాథ్‌బాబు తెలిపారు. ఆలయంలో హుండీల్లోని కానుకలను గురువారం లెక్కించారు. ఐదు నెలల 13 రోజులకు సంబంధించి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకల ద్వారా ఆదాయం లభించినట్లు పేర్కొన్నారు. ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

● కనకదుర్గమ్మకు పుష్పార్చన





అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ... జగజ్జనని కనకదుర్గమ్మకు భక్తజనం జేజేలు పలికారు. ఇంద్రకీలాద్రిపై వసంత నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజు గురువారం అమ్మవారికి ఎర్ర గులాబీలు, కనకాంబరాలతో అర్చన చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, దుర్గగుడి కార్యనిర్వహణాధికారి భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. పుష్పార్చనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

– ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)

స్వచ్ఛతపై అవగాహన కల్పించాలి



స్వచ్ఛ యాత్రను ప్రారంభిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, ఒంగోలు మేయర్ సుజాత తదితరులు

పటమట(విజయవాడతూర్పు): పొదుపు సంఘాల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పించాలని మేయర్ భాగ్యలక్ష్మి తెలిపారు. స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధి, గృహకల్ప శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛతా యాత్రను మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఒంగోలు మేయర్ జి. సుజాత ప్రారంభించారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 7న మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ యాత్రను ప్రారంభించిందని తెలిపారు. నగరాల్లో ఘన వ్యర్థాలను ప్రాసెస్ చేసి వ్యర్థాల నుంచి ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు వ్యక్తిగత/ పొదుపు సంఘాలు, మహిళా సారథ్య అసోసియేషన్లకు స్వచ్ఛత్సోవ్ -2023లో భాగంగా ఇందులో ఉమెన్ ఐకాన్స్ లీడింగ్ స్వచ్ఛత అవార్డు-2023 ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ యాత్ర ప్రధాన ఉద్దేశం స్వచ్ఛయాత్ర, గార్బేజ్ ఫ్రీ సిటీ(జీఎఫ్‌సీ) నెట్‌వర్క్, స్వచ్ఛ మషాల్ మార్చ్-స్వచ్ఛతా ప్రతిజ్ఞ నిర్వహించాలని పేర్కొన్నారు. రాష్ట్రం ప్రభుత్వ ఆదేశాలతో విజయవాడ, ఒంగోలు కార్పొరేషన్ల నుంచి 10 స్వయం సహాయక సంఘాలతోపాటు మెప్మా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ బృందాలు ఈ నెల 23 నుంచి 25వతేదీ వరకు తమిళనాడులోని చెన్నై, చెగలపట్నం ప్రాంతాల్లో పర్యటిస్తుందని తెలిపారు. పుదుచ్చేరి బృందం విజయవాడ, రాజమండ్రిలో పర్యటిస్తుందని చెప్పారు. అనంతరం ఆమె విజయవాడ నుంచి చెన్నై బయలుదేరిన స్వచ్ఛ యాత్ర బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డాక్టర్ పి. సంపత్‌కుమార్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్, మెప్మా డైరెక్టర్ విజయలక్ష్మి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సీవోవో కిరణ్‌కుమార్, వీఎంసీ అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, సీఎంవోహెచ్ డాక్టర్ పి. రత్నావళి, పట్టణ సాధికారత విభాగ పీడీ శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికుల సంక్షేమానికి 'యాత్ర'



సమగ్ర సర్వేయాత్రకు సంఘీభావం తెలుపుతున్న ఎలక్ట్రికల్ కార్మికులు, అసోసియేషన్ నేతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని 5 లక్షల ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికులకు ప్రభుత్వ, అసోసియేషన్ సేవలను అందించేందుకు ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికుల సంక్షేమ సమగ్ర సర్వేయాత్ర చేపట్టినట్లు ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మండవ కుటుంబరావు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మాచవరంలో గురువారం ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికుల సంక్షేమ సమగ్ర సర్వేయాత్ర ప్రారంభమైంది. కుటుంబరావు, అసోసియేషన్ అధ్యక్షుడు డి.వి.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీహరిరావుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమగ్ర సర్వేయాత్ర ఇక్కడ నుంచి ఇచ్ఛాపురానికి చేరుకుంటుందన్నారు. అనంతరం ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు రాష్ట్రవ్యాప్తంగా సర్వే చేస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో ఎలక్ట్రికల్ కార్మికులను గుర్తించి వారికి నైపుణ్యాలను పెంపొందించటంతో పాటు ప్రభుత్వ పథకాలు, సేవలు అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. డి.వి.సత్యనారాయణ, కె.శ్రీహరిరావు మాట్లాడుతూ ఇప్పటికే ఒక సారి సమగ్ర సర్వే యాత్ర నిర్వహించటం ద్వారా రాష్ట్రంలో 5 లక్షల మంది ఎలక్ట్రికల్ కార్మికులను గుర్తించి వారికి గుర్తింపును తీసుకువస్తున్నామన్నారు. తొలుత బల్బుకనిపెట్టిన థామస్ అల్వాఎడిసన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.పాల్‌రాజు, విజయవాడ ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె. మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులు రామ్మోహన్‌రావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌లపై పరిశోధనకు ఇజ్రాయెల్ కంపెనీ సహకారం



సమావేశంలో మాట్లాడుతున్న ఇజ్రాయెల్ డ్రోనెక్స్ ప్రతినిధులు

పెనమలూరు: డ్రోన్లపై విద్యార్థులు పరిశోధనలు చేయటానికి, డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ పొందటానికి తమ కంపెనీ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ఇజ్రాయెల్ దేశానికి చెందిన డ్రోనెక్స్ సంస్థ చైర్మన్ రాన్ఎడుట్ ప్రకటించారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం జరిగిన డ్రోన్ శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దేశ విదేశాల్లో విస్తరిస్తున్న డ్రోన్ టెక్నాలజీపై విద్యార్థులు దృష్టి పెట్టాలని సూచించారు. తమ సంస్థ ద్వారా పరిశోధనలు, శిక్షణ, టెక్నాలజీ, ఇంటర్న్‌షిప్ అందిస్తామన్నారు. కాలేజీలో డ్రోన్ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నీర్‌జండ్లర్, టెక్నాలజీ ఆఫీసర్ బ్రుస్‌తిన్, బెల్ విశ్రాంత అధికారులు బాత్రా, రాజశేఖర్, కాలేజీ డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి వద్ద భారీ వర్షం



దుర్గగుడి ఫ్లై ఓవర్ పరిసరాల్లో కురుస్తున్న వర్షం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం పరిసరాల్లో గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడితో పొడిగా ఉన్న వాతావరణం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతం కావడమే కాకుండా చిరు చల్లులు ప్రారంభమై భారీ వర్షంగా మారింది. సుమారు అర్ధగంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో అమ్మవారి ఆలయంతో పాటు రాజగోపురం పరిసరాలు, కొండ దిగువన కనకదుర్గనగర్, ఘాట్‌రోడ్డు, మహామండపం, ఫ్లై ఓవర్ పరిసరాల్లో భక్తులు పరుగులు పెట్టారు. లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద జరుగుతున్న వసంత నవరాత్రోత్సవాల పందిరిలో వర్షం నీళ్లు కారకుండా ఇంజినీరింగ్ సిబ్బంది ప్లాస్టిక్ పట్టాలను ఏర్పాటు చేశారు. అర్ధగంట తర్వాత వాన ఆగడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

వాహనచోదకులు హెల్మెట్ ధరించాలి



అవగాహన ర్యాలీ చేస్తున్న సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది

పాయకాపురం(విజయవాడరూరల్): వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని నున్న పోలీసు స్టేషన్ సీఐ కె.శ్రీనివారావు అన్నారు. గురువారం పోలీసు స్టేషన్ పరిధిలో పాయకాపురం వద్ద హెల్మెట్ ధరిస్తే వాహనచోదకులు ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడుకోవచ్చని సీఐ అన్నారు. ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని అలా చేస్తే కేసులు నమోదు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

26న సహస్ర నామ కుంకుమార్చన

రామవరప్పాడు:విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శోభకృత్ నామ సంవత్సర చైత్ర శుద్ధమి పంచమి వసంత నవరాత్రుల సందర్భంగా ఈ నెల 26న ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 9 గంటలకు మహాలక్ష్మి అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన, అష్టోత్తర శతకళార్చన అభిషేకం, మహాలక్ష్మి యాగం నిర్వహిస్తామని తెలిపారు. 108 కలశముల మంత్రజలముతో 108 మంది దంపతులతో అభిషేకాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పూజలో పాల్గొనదలచిన భక్తులు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

జాతీయ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు వంశీ



లబ్బీపేట(విజయవాడ తూర్పు): నలంద డిగ్రీ కళాశాలలో బీబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న వంశీ దుర్గా ప్రసాద్ పురుషుల జాతీయ జూనియర్ బాల్‌బాడ్మింటన్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం. అనురాధ తెలిపారు. ఈ నెల 24 నుంచి 29 వరకూ మహారాష్ట్రలోని అమరావతిలో శిక్షణ ఇవ్వనున్నారని, అనంతరం 30 నుంచి ఏప్రిల్ 3 వరకూ పోటీలు జరగనున్నట్లు ఆమె పేర్కొన్నారు. జాతీయ పోటీలకుఎంపికైన వంశీ దుర్గా ప్రసాద్‌ను నలంద విద్యా సంస్థల చైర్మన్ విజయ బాబు అభినందనలు తెలిపారు.

సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో మోడరన్ విద్యార్థులకు ర్యాంకులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సీఎంఏ ఫైనల్ పరీక్ష ఫలితాల్లో తమ అకాడమీకి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి జాతీయ స్థాయిలో ర్యాంకు పొందారని మోడరన్ అకాడమీ ఆఫ్ టెక్నికల్ అండ్ జనరల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పి.వినయ్‌రంజన్ గురువారం ప్రకటనలో తెలిపారు. 2022 డిసెంబర్‌లో జరిగిన సీఎంఏ ఫైనల్ పరీక్షల్లో కె.రంగనాథ్ జాతీయ స్థాయిలో 24వ ర్యాంకు, భూపతి రాజు శ్రీరామ్–29వ ర్యాంకు, కట్ట కుమార్‌రాజు–41వ ర్యాంకు పొందారని వినయ్‌రంజన్ తెలియజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

26న ఉగాది మహిళా పురస్కారాలు

విజయవాడ కల్చరల్: అమ్ముల విశ్వనాథ కళాసమితి ఆధ్వర్యంలో 26వ తేదీ ఆదివారం దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో ఉగాది మహిళా పురస్కారాల కార్యక్రమం నిర్వహిస్తునట్లు సమితి ప్రధానకార్యదర్శి అమ్ముల ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దండమూడి సుమతీ రామ్మోనరావు (సంగీతం), సునీత లఖంరాజు(సేవా రంగం), పద్మశ్రీ పెద్ది(విద్యారంగం), సీహెచ్ విద్యావతి(సాంస్కృతికరంగం), అవిరెడ్డి సునయన(థియేటర్ ఆర్ట్స్)కుఉగాది మహిళా పురస్కారాలు ప్రదానం చేయనున్నామని పేర్కొన్నారు.

వేధింపుల భర్తపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మద్యానికి బానిసైన తన భర్త వేధిస్తున్నాడంటూ వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన షేక్ జుబేదా నూజివీడుకు చెందిన తేజను ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఆటో నడుపుకుని జీవించే తేజ కొంత కాలంగా మద్యానికి బానిసై జుబేదాను వేధిస్తున్నాడు. తేజ కొంత కాలంగా మరో మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరచుకుని వేధిస్తుండటంతో బాధితురాలు పుట్టింటికి చేరింది. భర్త వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మహిళను దూషించిన వారిపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహిళను దూషించిన వారిపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వించిపేటకు చెందిన మురుగుల వాణిశ్రీ కుటుంబం నివసిస్తోంది. వాణిశ్రీ ఇంటి పక్కన రమేష్ కుటుంబం ఉంటోంది. గురువారం రమేష్.. వాణిశ్రీ ఇంటి ముందు మురుగు నీటిని పోస్తుండటంతో రెండు కుటుంబాల మధ్య వివాదం చోటు చేసుకుంది. దీంతో రమేష్‌తో పాటు అతని వదిన మహాలక్ష్మి, అమ్మానాన్నలు కూడా వాణిశ్రీని, తల్లి విజయమ్మను నోటికి వచ్చినట్లు దూషించడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భవానీదీక్షా గురుపీఠం సేవలు అభినందనీయం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వెలంపల్లి, రాయన భాగ్యలక్ష్మి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భవానీదీక్షా వ్యవస్థాపక గురుపీఠం సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఏపీ భవానీదీక్షా వ్యవస్థాపక గురుపీఠం ఆధ్వర్యంలో గురుభవానీల సత్కార కార్యక్రమం, పురస్కారాల ప్రదానోత్సవం గురువారం సాయంత్రం కొత్తపేటలోని శ్రీ నగరాల సీతారామస్వామి మహాలక్ష్మి అమ్మవార్ల కల్యాణ మండపంలో నిర్వహించారు. కార్యక్రమానికి పీఠాధిపతి ఈది ఎల్లారావు అధ్యక్షత వహించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, దుర్గగుడి మాజీ అధ్యక్షులు పైలా సోమినాయుడు, ఏపీ నగరాల సంఘం అధ్యక్షులు, గురుపీఠం గౌరవ అధ్యక్షులు బాయన బాబ్జి, హైకోర్ట్ న్యాయవాది దినేష్ బాబు చేతుల మీదుగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని సుమారు 600 మంది గురుభవానీలకు, దేవాలయాలలో సేవలు చేస్తున్న వలంటీర్లకు ఉచిత పురస్కారాలు అందజేశారు. సంస్థ ముద్రించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

రక్తదానం.. సామాజిక బాధ్యత



రక్తదానం చేస్తున్న అడపా శేషు

రక్తదానం చేయడం సామాజిక బాధ్యతని రక్తదాతలు తెలిపారు. సాక్షి దినపత్రిక 15వ వార్షికోత్సవం పురస్కరించుకుని గురువారం నగరంలోని ఆటోనగర్‌లో 'సాక్షి' కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. విద్యార్థులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు, సిబ్బంది 60 మందికి పైగా రక్తదానం చేశారు.

-పటమట/ఆటోనగర్(విజయవాడతూర్పు)

చాలా సంతోషంగా ఉంది



సాక్షి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సాక్షి యాజమాన్యం రక్తదాన శిబిరం ఏర్పాటుచేయడం అభినందనీయం. కోవిడ్ తర్వాత చాలా మంది అస్వస్థతకు గురవుతున్నారు. వారిలో చాలా మందికి రక్తం అవసరం ఏర్పడుతుంది. నేను కూడా రక్తదానం చేయటం సంతోషంగా ఉంది.

-కె.హరీష్, రామలింగేశ్వర నగర్

స్ఫూర్తిదాయకం



ప్రాణాలు కాపాడుకునేందుకు ఉపయోగపడే రక్తాన్ని దానం చేయటానికి క్యాంపు నిర్వహించటం స్ఫూర్తిదాయకం. చాలామందికి రక్తదానం చేయటంపై అపోహలు ఉన్నాయి. ఇలాంటి వాటిని తొలగించటమే కాకుండా మరి కొంతమందికి రక్తదానం చేయటానికి స్ఫూర్తి కలిగిస్తుంది.

-అన్నవరపు కొండారెడ్డి, రామలింగేశ్వర నగర్

97 సార్లు రక్తం దానం చేశా



నేను ఇప్పటికి 97 సార్లు రక్తం దానం చేశా. రక్తదానం చేయడంతో నేను ఆరోగ్యంగా ఉంటున్నా. బీపీ, షుగర్ ఇంత వరకు లేదు. ఎదుటి వారికి సేవ చేయడమే నా ధ్యేయం. ఎవ్వరు అడిగినా రక్తం ఇవ్వడానికి ఎల్లప్పుడు ముందుంటా.

-సాయికృష్ణ, విజయవాడ

తోటివారిని ఆదుకోవాలి



తోటి వారిని ఆదుకోవాలి. నేను ఇప్పటికి 30 సార్లు రక్తం ఇచ్చా. సాక్షి వార్షికోత్సవం సందర్భంగా ఉచిత రక్తదానం కార్యక్రమం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది.

– చరణ్, కంకిపాడు

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న జనశిక్షణ సంస్థాన్ అధ్యక్షురాలు విద్యాకన్నా

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థినులు ఉపాధి ఆధారిత సర్టిఫికెట్ కోర్సులు వినియోగించుకుని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జనశిక్షణ సంస్థాన్ అధ్యక్షురాలు నాగళ్ల విద్యాఖన్నా పిలుపునిచ్చారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో గురువారం జనశిక్షణ సంస్థాన్ సౌజన్యంతో పండ్ల రసాలు, జామ్‌ల తయారీ, చీరలపై ప్రింటింగ్ సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండ్ల రసాలు, జామ్‌ల తయారీతో పాటు చీరలపై ప్రింటింగ్ రంగంలో అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. విద్యతోపాటు సర్టిఫికెట్ కోర్సులు పూర్తిచేసి ఆర్థిక స్వావలంబన సాధించి మరో నలుగురికి ఉపాధి కల్పించడానికి కృషి చేయాలని సూచించారు. కాలానుగుణంగా అవకాశాలు వినియోగించుకుని లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీరజ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడటానికి అవసరమైన సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తున్నామన్నారు. జనశిక్షణ సంస్థాన్ సంచాలకులు ఎ.పూర్ణిమ తమ సంస్థ ద్వారా అందించే కోర్సులు వాటి ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, జనశిక్షణ సంస్థాన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న బీవీఎస్‌టీ సాయి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): యువత ఉద్యోగ అవకాశాలతో పాటుగా పరిశ్రమల స్థాపనపై దృష్టి పెట్టాలని గోవాలోని ప్రల్హార్ బయో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ బీవీఎస్‌టీ సాయి చెప్పారు. సిద్ధార్థ కళాశాల బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ విభాగం, స్వావలంబి భారత్ అభియాన్ సంస్థ సంయుక్తంగా గురువారం కళాశాల వెబ్‌నార్ హాల్లో ఉపాధి కల్పన–అవకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. సాయి మాట్లాడుతూ విలువలు పాటిస్తూ నిజాయతీ నిబద్ధతతో వినియోగదారునికి సేవలందిస్తే ఆ సంస్థ మనుగడ దీర్ఘ కాలంగా ఉంటుందన్నారు. చార్టెడ్ అకౌంటెంట్ అన్నదేవర గురునాథ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉద్యోగ రంగంలో ఒడిదొడుకులు ఉన్నాయని, అందుకే విద్యార్థులు పారిశ్రామిక రంగం వైపున ఆలోచనలు చేయాలన్నారు. వినియోగ భారతి సంస్థ చైర్మన్ కోదండ రామయ్య మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల యువత పారిశ్రామిక రంగంలోకి ప్రవేశించి ప్రపంచ స్థాయికి ఎదిగారన్నారు. కళాశాల డీన్ రాజేష్ సీ జంపాల మాట్లాడుతూ యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగి దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. అధ్యాపకులు డాక్టర్ ఎండీఎస్ రెహమాన్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం.. భగత్‌సింగ్



రామనర్సయ్య భవన్‌లో జరిగిన భగత్‌సింగ్ వర్ధంతిలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల్లోని పోరాట స్ఫూర్తి అని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి రామన్న చెప్పారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా గురువారం బోయపాటి మాధవరావు రోడ్డులోని భగత్‌సింగ్ గ్రంథాలయం వద్ద భగత్‌సింగ్ చిత్రపటానికి.. రామన్న పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, నాయకులు కార్తీక్, జగదీష్, మురహరిరావు తదితరులు పాల్గొన్నారు.

■ సున్నపుబట్టీల సెంటర్ సమీపంలోని రామనర్సయ్య భవన్‌లో గురువారం భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి జరిగింది. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయు) రాష్ట్ర కార్యదర్శి కె.పోలారి, పీడీఎస్‌యూ నాయకులు రవిచంద్ర, ఐ.రాజేష్, ఐఎఫ్‌టీయూ నగర అధ్యక్షుడు ముని శంకర్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

భౌతికశాస్త్ర పుస్తకాల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు జిల్లా సైన్స్ అధికారి, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు మైనం హుస్సేన్ భౌతికశాస్త్ర పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. నగరంలోని మున్సిపల్ హైస్కూల్స్‌లో పదో తరగతి విద్యార్థులు కామన్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో వన్‌మార్క్, 2 మార్క్ ప్రశ్నలతో ఈ పుస్తకాలను స్వయంగా తయారుచేసినట్లు ఆయన తెలిపారు. కలెక్టర్ ఢిల్లీరావు చేతులమీదుగా వీటిని ప్రారంభించి, జిల్లా విద్యాశాఖ అధికారిణి సీవీ రేణుకా ఆదేశాలతో విద్యార్థులకు అందజేస్తున్నామని వివరించారు. నగరంలో సుమారు 1000 మంది విద్యార్థులకు ఈ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని, వీరు బాగా చదివి నగరానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

మీడియా పాయింట్

కొలిక్కి వచ్చిన శ్రీశైలం భూముల వ్యవహారం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



సాక్షి, అమరావతి: శ్రీశైలం దేవస్థానం భూముల సరిహద్దు వ్యవహారం కొలిక్కి వచ్చిందని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. ఈ మేరకు అటవీ శాఖతో దేవదాయ శాఖ ఒప్పందం చేసుకుందని చెప్పారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తీసుకున్న ప్రత్యేక చొరవకు కతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో రెండో ప్రధాన ఆలయమైన శ్రీశైలాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారన్నారు. అటవీ, రెవెన్యూ శాఖలతో 4 నెలల క్రితం పెద్దిరెడ్డి, ధర్మాన తాను ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి దీనిపై ఒక నిర్ణయానికి వచ్చామన్నారు. మూడు శాఖల ఉన్నతాధికారులు సహకరించి దేవస్థానం భూములు 4,434 ఎకరాలుగా నిర్ధారించారన్నారు. వీటికి హద్దులు నిర్ణయించే ప్రక్రియ త్వరలో ప్రారంభిస్తామన్నారు. కృష్ణానదిని ఆనుకుని ఉన్న 900 ఎకరాల దేవస్థానం భూమిని స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొన్నారు.

మా మధ్య విభేదాలు లేవు

ఎమ్మెల్యేలు పేర్ని, వసంత



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు, తనకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని ఎమ్మెల్యే, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) స్పష్టం చేశారు. ఆయన గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. వసంత కృష్ణప్రసాద్‌పై ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియా, మీడియా వాట్సాప్ గ్రూప్‌లలో అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. 'ఇది ఎవరో చేసిన కిరాతక చర్య. మా పార్టీ తరఫున అభ్యర్థి కోసం ఓట్లను కో–ఆర్డినేట్ చేసే బాధ్యత నాకు ఉంది. నా గ్రూప్‌లో కృష్ణప్రసాద్ లేరు. ఆయన్ను నేను ఎందుకు అడుగుతాను. కృష్ణప్రసాద్ గురువారం ఉదయం 8.45కే అసెంబ్లీకి వచ్చారు. ఆయనపై ఇలా దుష్ప్రచారం చేస్తున్నవారు ఆయన వ్యక్తిగత శత్రువులా, పార్టీపరంగా లాభం పొందేందుకు ప్రయత్నం చేస్తున్నారా అనేది తెలియదు. దీన్ని మేం ఖండిస్తున్నాం' అని నాని అన్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. 'పేర్ని నాని, నేను మంచి స్నేహితులం. పేర్ని నాని నా కన్నా రాజకీయాల్లో సీనియర్, మంత్రిగా పనిచేశారు. నాకు ఏ సమస్య ఉన్నా పేర్ని నానికి చెప్పేవాడిని. మా ఇద్దరి మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. కొందరు గిట్టనివారు కావాలని ఇలాంటి ప్రచారం చేస్తున్నారు. వాళ్లు ఎవరో నాకు తెలుసు. వాళ్ల విజ్ఞతకే వదిలేస్తున్నా' అన్నారు.

సీఎం జగన్‌కు ఎప్పటికీ విధేయుడినే

చంద్రబాబు నాటకాలు అందరికీ తెలుసు : కోలా గురువులు

సాక్షి, అమరావతి : ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, తాను మాత్రం ఎప్పటికీ వైఎస్సార్‌సీపీకి, సీఎం వైఎస్ జగన్‌కు విధేయుడినేనని వైఎస్సార్‌సీపీ నేత, మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు స్పష్టంచేశారు. ఆయన గురువారం 'సాక్షి'తో మాట్లాడారు. పాతికేళ్లుగా రాజకీయంలో తాను కేవలం విలువలతోనే ఉన్నానన్నారు. చంద్రబాబు నాటకాలు, ఎత్తుగడలు అందరికీ తెలుసునని, వాటికి తాను గతంలోనే లొంగలేదని ఆయన తెలిపారు. 2014 ఎన్నికల సమయంలో టీడీపీ తనను ఎన్నో ప్రలోభాలకు గురిచేసినప్పటికీ జగన్‌పై నమ్మకంతో తాను పార్టీకి కట్టుబడి ఉన్నానని గురువులు వెల్లడించారు. జగన్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి, 2024లో పార్టీ తిరిగి అధికారంలోకి రావడానికి కృషిచేస్తానన్నారు. సీఎం జగన్ ఏ బాధ్యత అప్పగించినా నిర్వర్తించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసి ఎన్నికలు జరిగిన తీరును వివరిస్తానని చెప్పారు.

దళిత జాతికి దక్కిన గౌరవం ఇది

కోనసీమ జిల్లాకు అంబేడ్కర్ పేరు పెట్టడమే కాకుండా ఒక దళితుడినైన నాకు ఎమ్మెల్సీ కేటాయించిన గొప్ప వ్యక్తి, ఏపీ అభివృద్ధి ప్రదాత సీఎం జగన్‌కు ధన్యవాదాలు. గతంలో జరిగిన ఎన్నికల్లో ఐదు కోట్ల మంది సీఎం జగన్‌కు ఓటువేసి గెలిపిస్తే.. ఇప్పుడు జగనన్న సీఎంగా నాకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి నన్ను ఎమ్మెల్సీని చేశారు. ఇది దళిత జాతికి దక్కిన గౌరవం.

– బొమ్మి ఇజ్రాయెల్, ఎమ్మెల్సీ

బీసీలందరూ జగన్‌కు అండగా ఉండాలి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు పెద్దపీట వేశారు. స్థానిక సంస్థల్లోనూ బీసీలకు ప్రాధాన్యతనిస్తూ మాటల ప్రభుత్వం కాకుండా చేతల ప్రభుత్వంగా ఆయన నిరూపించారు. ఇది దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది. బీసీలందరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలి. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అఖండ మెజార్టీ వచ్చేలా కృషిచేయాలి.

– పోతుల సునీత, ఎమ్మెల్సీ

ఆరు పద్దులకు ఆమోదం

బడ్జెట్ సమావేశాల్లో ఏకగ్రీవంగా ఆమోదించిన అసెంబ్లీ



సాక్షి, అమరావతి: శాసనసభ సమావేశాల సందర్భంగా ఆరు బడ్జెట్ పద్దులకు ఏకగ్రీవంగా ఆమోదం లభించింది. గురువారం సభలో వ్యవసాయ–సహకార, పశు సంవర్ధక–మత్స్య, పౌర సరఫరాలు, ప్రణాళిక–శాసన వ్యవహారాలు, గవర్నర్, కేబినెట్, జీఏడీ నిర్వహణ, సమాచార, ప్రజా సంబంధాలకు చెందిన పద్దులను ప్రవేశపెట్టారు. వీటిపై చర్చించిన అనంతరం మంత్రులు సమాధానం ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకునే ప్రతి నిర్ణయం రైతులకు అండగా నిలిచిందని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఎన్నడూ లేనివిధంగా ఖరీఫ్‌కు ముందస్తుగా సాగునీరు, వైఎస్సార్ రైతు భరోసాతో పెట్టుబడి సాయం అందించడం మంచి ఫలితాలను ఇస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులపై పైసా భారం పడకుండా వైఎస్సార్ ఉచిత పంటల బీమాను అందిస్తున్నామన్నారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించని పంటలను ఎమ్మెస్పీకి కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. టీడీపీ హయాంలో ఆక్వా జోన్ పరిధిలో 2.56 లక్షల ఎకరాలు, నాన్ ఆక్వా జోన్‌లో 1.90 లక్షల ఎకరాలు భూమి ఉందని పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చాక ఆక్వా జోన్‌లోకి 4.20 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయన్నారు. ఆక్వా రైతులకు సబ్సిడీ విద్యుత్‌కు సంబంధించి టీడీపీ సర్కారు రూ.309 కోట్ల రీయింబర్స్ పెండింగ్‌లో పెట్టగా, తమ ప్రభుత్వం వచ్చాక యూనిట్ రూ.1.50 చొప్పున సబ్సిడీ విద్యుత్ ఇస్తూనే పాత బకాయిలతో కలిపి రూ.2,687 కోట్లు ఖర్చు చేశామన్నారు. పాడి రైతులకు గతంలో ఎన్నడూ లేని విధంగా లీటరు గేదె పాలపై రూ.20 లబ్ధి చేకూరుస్తున్నట్టు చెప్పారు. అమూల్ రేట్లు పెంచడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ డెయిరీలు రేట్లు పెంచాల్సి వచ్చిందని, ఆ మేరకు రైతులకు రూ.2,300 కోట్ల మేర ప్రయోజనం కలిగిందని తెలిపారు.

గ్రామ, వార్డు సచివాలయాల బిల్లుకు సభ ఆమోదం

సాక్షి, అమరావతి : గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థకు చట్టబద్ధత కల్పిస్తూ రూపొందించిన ఏపీ గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల బిల్లు–2023కు గురువారం శాసనసభ ఆమోదం తెలిపింది. పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ సభలో బిల్లును ప్రవేశపెట్టారు. బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదం లభించింది. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో సచివాలయాల వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చిందని మంత్రి సురేశ్ తెలిపారు. సచివాలయాల ద్వారా 500కు పైగా సేవలు ప్రజలకు గ్రామ, వార్డు స్థాయిల్లోనే అందుతున్నాయన్నారు. ఇక సచివాలయాల బిల్లుతో పాటు మరో ఆరు బిల్లులకు సభ ఆమోదం తెలిపింది.

సభ ఆమోదం పొందిన ఆరు బిల్లులు

- ▲ ఏపీ ఎస్సీ సబ్ ప్లాన్, ట్రైబల్ సబ్ ప్లాన్ (సవరణ) బిల్లు–2023
- ▲ ఏపీ స్టేట్ కమిషన్ ఫర్ ఎస్టీ (సవరణ) బిల్లు–2023
- ▲ ఏపీ పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ గ్యారంటీ (సవరణ) బిల్లు–2023
- ▲ ఏపీ మున్సిపల్ లాస్ (సవరణ) బిల్లు–2023
- ▲ ఏపీ మున్సిపల్ లాస్ (రెండో సవరణ) బిల్లు–2023
- ▲ ఏపీ స్టేట్ కమిషన్ ఫర్ షెడ్యూల్ ట్రైబ్స్ (సవరణ) బిల్లు–2023

రైతులను మోసం చేస్తే క్రిమినల్ కేసు

- ఈ ప్రభుత్వంలో ప్రతి పంటకూ గిట్టుబాటు ధర
- 'ఈబీసీ నేస్తం' అర్హులెవరికీ ఆపలేదు
- మైనార్టీలకు సీఎం జగన్ ప్రభుత్వం ప్రాధాన్యం

సాక్షి, అమరావతి: రైతులను మోసం చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. గురువారం అసెంబ్లీ సమావేశాల ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. రైతులను మోసం చేసే దళారులపై 420 కేసులు నమోదు చేయాలని ఆదేశించామన్నారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర తగ్గిన వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందని, రైతులు దళారీల దగ్గర మోసపోకుండా ప్రభుత్వాన్ని సంప్రదించాలని కోరారు. తమ ప్రభుత్వం ప్రతి పంటకూ గిట్టుబాటు ధర కల్పిస్తోందన్నారు. కొన్ని పంటకు మార్క్‌ఫెడ్ ద్వారా వెంటనే డబ్బులిచ్చేస్తున్నామని చెప్పారు. సుబాబుల్ రేట్లు పెంచాలని కంపెనీల యాజమాన్యాలకు చెప్పామన్నారు. పత్తి పంట కొనుగోలు, మద్దతు ధరపై కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, కేంద్రంతో మాట్లాడతామని చెప్పారు. అకాల వర్షాలు, వడగళ్లకు జరిగిన పంట నష్టంపై అంచనాలు తయారు కాగానే ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తామన్నారు. పంటల బీమాను కూడా అందించే ఏర్పాటు చేస్తామన్నారు. ఈబీసీ నేస్తం పథకంలో పెండింగ్ దరఖాస్తులేవీ లేవని చింతల రామచంద్రారెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి చెప్పారు. ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కేపీ నాగార్జునరెడ్డి, వసంత వెంకట కృష్ణప్రసాద్, కాటసాని రామిరెడ్డి చెప్పారు.

మైనార్టీలకు సువర్ణాధ్యాయం: డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

రాష్ట్రంలో 2019 నుంచి మైనార్టీలకు సువర్ణాధ్యాయం మొదలైందని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా చెప్పారు. సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. సీఎం వైఎస్ జగన్ సారథ్యంలోని ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి రూ.21,756.69 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. ఇమామ్, పాస్టర్, మౌజమ్‌లకు గౌరవ వేతనం ఇస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవినీతికి, మధ్యవర్తులకు తావులేకుండా పేదలందరికీ నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే ఎం.అబ్దుల్ హఫీజ్‌ఖాన్ చెప్పారు.

విద్యను ప్రోత్సహించడానికే కళ్యాణమస్తులో టెన్త్ నిబంధన : మంత్రి నాగార్జున

విద్యను ప్రోత్సహించడం కళ్యాణమస్తు పథకంలో ప్రధాన ఉద్దేశమని, అందుకోసమే 10వ తరగతి పాసవ్వాలనే నిబంధన పెట్టామని మంత్రి మేరుగు నాగార్జున స్పష్టం చేశారు. సభలో సభ్యుల ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. ఈ పథకం లబ్ధిదారులకు గత ప్రభుత్వం రూ.68 కోట్లకు పైగా బకాయిలు పెట్టి వెళ్లిపోయిందని అన్నారు. తమ ప్రభుత్వం గత ప్రభుత్వాలు ఇచ్చినదానికంటే ఎక్కువ ఇస్తోందన్నారు. ఈ అంశంపై ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడారు.

పోడియం దగ్గర రెడ్‌లైన్

- అసెంబ్లీలో ఈ ఎర్రగీత దాటితే సస్పెన్షనే
- స్పీకర్ తమ్మినేని సీతారాం వెల్లడి



వెల్ వద్ద ఏర్పాటు చేసిన ఎర్రగీత

సాక్షి, అమరావతి : ప్రజా సమస్యలపై చర్చించకుండా, సభా మర్యాదను పాటించకుండా, శాసనసభ, సభ్యుల విలువైన సమయాన్ని వృథా చేయడాన్ని నివారించడానికి అసెంబ్లీలోని వెల్‌లో కొత్తగా ఎర్ర గీతను ఏర్పాటుచేశారు. ఇకపై సభ్యులెవరైనా ఆ గీత దాటితే ఎలాంటి తీర్మానం అవసరంలేకుండా ఆటోమేటిగ్గా సస్పెండ్ అవుతారని స్పీకర్ తమ్మినేని సీతారాం వెల్లడించారు. 'ఆంధ్రప్రదేశ్ శాసనసభ నిబంధనావళిలోని 344 నియమాన్ని అనుసరించి ఎవరైనా సభ్యులు సభ వెల్‌లో ఉన్న రెడ్ మార్కును దాటి పోడియం దగ్గరకు వస్తే ఎటువంటి తీర్మానం లేకుండా సభ నుంచి మూడు రోజులు లేదా సభ జరిగే మిగిలిన కాలం పాటు సస్పెండ్ చేయబడతారు'.. అని స్పీకర్ వివరించారు. సభ హుందాతనాన్ని, సభ్యుల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం శాసనసభకు ఉన్నందున ఈ నిబంధనను కఠినంగా అమలుచేస్తామని చెప్పారు.

పోలవరం.. మాతోనే సాధ్యం

- ఎందుకోసం బాబు నిర్మాణ బాధ్యతలు తీసుకున్నారు?
- నిధుల కోసం సీఎం జగన్ ఢిల్లీ వెళితే రాజకీయం చేస్తారా?
- ప్రాజెక్ట్ పూర్తి కాకూడదన్నదే బాబు లక్ష్యం
- ఆయన పాకులాటంతా ప్రచారం కోసమే
- పోలవరంపై చర్చలో మంత్రి అంబటి, ఎమ్మెల్యేలు జక్కంపూడి, ధనలక్ష్మి

సాక్షి, అమరావతి : తమ ప్రభుత్వ హయాంలోనే పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తవుతుందని, ఇది దైవ నిర్ణయం అని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు అన్నారు. శాసన సభలో పోలవరం ప్రాజెక్ట్‌పై గురువారం నిర్వహించిన స్వల్పకాలిక చర్చలో వారు మాట్లాడారు. గత చంద్రబాబు ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌ను ఏటీఎంలా వాడుకుంటే, ప్రస్తుత వైఎస్ జగన్ ప్రభుత్వం చిత్తశుద్ధితో శర వేగంతో పనులు చేయిస్తోందని స్పష్టం చేశారు. జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ.. 'కేంద్రం పోలవరాన్ని జాతీయ ప్రాజెక్ట్‌గా ప్రకటిస్తే, రాష్ట్ర విభజన తర్వాత ఈ ప్రాజెక్ట్‌ను మేమే కడతామని చంద్రబాబు ఎందుకు ఒప్పుకున్నారు? 2013, 2014 ధరల ప్రకారం రూ.20,398 కోట్లు మాత్రమే ఇస్తామని కేంద్రం చెబితే బాబు ఎందుకు అంగీకరించారు? వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక, ఈ నిధులతో ప్రాజెక్ట్ నిర్మాణం సాధ్యం కాదని గుర్తించి.. 2017–18 ధరల ప్రకారం రూ.55,656 కోట్ల అంచనాలతో కేంద్రానికి పంపింది. దాన్ని వాళ్లు రూ.47,725.74 కోట్లకు కుదించారు. అయితే కేంద్ర కేబినెట్‌లో ఆమోదించిన అనంతరం ఈ నిధులు విడుదల చేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ ఆ తంతు పూర్తవ్వలేదు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్మాణానికి ఖర్చు చేసిన రూ.2,600 కోట్లు రాబట్టడం కోసం సీఎం ఢిల్లీకి వెళితే ఆ అంశాన్నీ టీడీపీ రాజకీయం చేయడం హేయమైన చర్య. బాబు నిర్వాకం వల్ల దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ మరమ్మతులకు రూ.2,022 కోట్లు అవసరం. ఈ నష్టాన్ని ఎవరు భరిస్తారు?' అని నిలదీశారు. రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ.. 'మహానేత వైఎస్సార్ ప్రారంభించిన పోలవరం ప్రాజెక్టు పనులను ఆయన తనయుడు సీఎం జగన్ పరుగులు పెట్టిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ప్రజల గుండెల్లో వైఎస్సార్, వైఎస్ జగన్‌లు చిరస్థాయిగా నిలిచిపోతారని ఏదోరకంగా అడ్డుకోవడానికి చంద్రబాబు ప్రయత్నించారు' అని అన్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ.. బాబు హయాంలో 'జయము జయము చంద్రన్న' అని పాటలు పాడించుకున్నారు. ఆస్కార్‌కు ఈ పాటను నామినేట్ చేసినట్లయితే బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కింద అవార్డు వచ్చేదని సోషల్ మీడియాలో ట్రోలవుతోంది' అని చెప్పారు.

సంక్షేమం వద్దని ప్రతిపక్షం చెప్పగలదా!?

ఆ పథకాలవల్ల వెనుకబడ్డామని ఎవరైనా నిరూపించగలరా?

- రాష్ట్రంలో అధిక గ్రోత్‌రేటు నమోదు కావడానికి సంక్షేమ పథకాలూ కారణమే
- 13,000 గ్రామాల్లో వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు
- నాడు–నేడు, మిడ్ డే మీల్, స్కాలర్‌షిప్‌లు, విద్యా దీవెన, వసతి దీవెనలన్నీ సంక్షేమ వ్యయం కింద జమకట్టకూడదు
- 'మండలి'లో బడ్జెట్ సమాధానంలో ఆర్థిక మంత్రి బుగ్గన



సాక్షి, అమరావతి : పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అవసరంలేదని ప్రజల ముందుకొచ్చి చెప్పగలరా అంటూ ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. శాసన మండలిలో 2023–24 బడ్జెట్ మీద జరిగిన చర్చకు ఆయన గురువారం సమాధానమిచ్చారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం అన్నది మా ప్రభుత్వ విధానమని.. పేద ప్రజలకు అన్ని విధాలా సాయం అందించాలన్నదే తమ నినాదమని స్పష్టంచేశారు. నాలుగేళ్లుగా సంక్షేమ పథకాలకే ఈ ప్రభుత్వం ఖర్చుచేస్తోందంటూ ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్షాలు సంక్షేమ పథకాలవల్ల రాష్ట్రాభివృద్ధి వెనుకబడిందని నిరూపించగలరా... అంటూ ప్రశ్నించారు. ఏదైనా సంక్షోభ సమయంలో వ్యవస్థలోకి నగదు పంపిణీ చేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థను కాపాడటం అనేది ప్రపంచ దేశాలు చేస్తుంటాయని, వృద్ధిరేటు సాధించడంలో సంక్షేమం కూడా కీలకపాత్ర పోషిస్తుందని బుగ్గన తెలిపారు. 2019–20లో 5.7 శాతం వృద్ధితో రూ.9.25 లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్ర జీఎస్‌డీపీ.. 2022–23లో 16.22 శాతం వృద్ధితో రూ.13.17 లక్షల కోట్లకు చేరుకుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అవినీతికి అవకాశంలేకుండా పూర్తి పారదర్శక పాలనతో ఉత్పత్తిని పెంచుతూ వృద్ధిరేటును నమోదు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. విద్య, వైద్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని.. నాడు–నేడు కింద పాఠశాలలు, ఆస్పత్రుల అభివృద్ధి, మిడ్ డే మీల్, స్కాలర్‌షిప్‌లు, విద్యాదీవెన, వసతి దీవెన వంటి వాటిని సంక్షేమ పథకాలుగా పరిగణించకూడదన్నారు. ఇక ఆరోగ్యరంగానికి పెద్దపీట వేస్తూ 13వేల గ్రామ పంచాయతీల్లో వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుతో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు బుగ్గన తెలిపారు. టీడీపీ హయాంలో అప్పులు భారీగాచేసి అభివృద్ధి చేయలేదని.. కానీ, గత ప్రభుత్వం కంటే ఇప్పుడు తక్కువ అప్పులు చేసినా తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ గణాంకాలతో ఆయన వివరించారు. అలాగే, గత ప్రభుత్వం పరిమితికి మించి చేసిన అప్పులు, పోలవరం వంటి కీలక ప్రాజెక్టులపై తీసుకున్న అనాలోచిత నిర్ణయాలను తమ ప్రభుత్వం సరిచేస్తోందన్నారు.

టీడీపీ హయాంలో పింఛన్ల కోసం కేటాయింపులు..

2014-15లో	రూ.3,378 కోట్లు
2015-16లో	రూ.5,220 కోట్లు
2016-17లో	రూ.5,228 కోట్లు
2017-18లో	రూ.5,472 కోట్లు
2018-19లో	రూ.8,320 కోట్లు

వైఎస్సార్‌సీపీ హయాంలో పింఛన్ల కోసం కేటాయింపులు..

2019-20లో	రూ.14,400 కోట్లు
2020-21లో	రూ.16,923 కోట్లు
2021-22లో	రూ.17,389 కోట్లు
2022-23లో	రూ.18,110 కోట్లు

(సవరించిన అంచనా ప్రకారం)

..అంటే నాలుగేళ్లలోనే మూడింతలు ఎక్కువగా ఈ ప్రభుత్వం పెన్షన్ల కోసం ఖర్చు పెట్టింది.

చితికిన కుటుంబాలకు భరోసా



కరోనాతో తల్లిదండ్రుల్ని కోల్పోయిన చిన్నారులు

బాధిత కుటుంబాల కన్నీటికి అక్షర రూపం

స్పందించి ఆదుకున్న దాతలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: పది రోజుల కిందట ఆస్పత్రికి వెళ్లిన నాన్న ఇంటికి వస్తాడేమోనని గడప మీదే ఎదురుచూస్తోంది ఓ పాప. అంబులెన్స్ ఎక్కిన అమ్మ మళ్లీ ఎప్పుడు వస్తుందని అన్నం ముద్ద తిన్న ప్రతిసారీ అడుగుతున్నాడో పసివాడు. నానమ్మ పక్కన పడుకుంటూ అమ్మా, నాన్న రేపు వచ్చేస్తారు కదా... అని అమాయకంగా అడుగుతున్నారు చిన్నారులు. పాపం వీరికి తెలీదు అమ్మానాన్నలు లేరని.. ఇక రారని. పసిపిల్లల కన్నీటితో కోవిడ్ రాస్తున్న మరణ శాసనాలు ఆగడం లేదు. ఘడియ సేపు అమ్మ కనబడకపోతే ఉగ్గబట్టి ఏడ్చే పిల్లలకు తల్లులు శాశ్వతంగా దూరమైపోతున్నారు. సాయంత్రం నాన్న రాకపోతే అలిగి మాట్లాడడం మానేసే బుజ్జాయిలకు నాన్నా... అని పిలిచే భాగ్యం దూరమైపోతోంది. జిల్లాలో తల్లిదండ్రులిద్దర్నీ కోల్పోయిన చిన్నారులు 11 మంది ఉండగా, తల్లిదండ్రుల్లో ఒకరిని పోగొట్టుకున్న వారు 305 మంది ఉన్నారు. వీరిని ఆదుకోవడమే ధ్యేయంగా సాక్షి నడుం బిగించింది. ఆయా కుటుంబాల వివరాలు సేకరించింది. వారి ఇళ్లకు వెళ్లి కుటుంబంతో పాటు ఆర్థిక స్థితిగతుల్ని పరిశీలించింది. వారి కన్నీటి గాథలకు అక్షర రూపం కల్పించింది. దాతలు స్పందించి ఆదుకోవాలని 2021 జూన్ 6,7,8 తేదీల్లో 20 కుటుంబాల దీన గాథలపై వరుస కథనాలు ప్రచురించింది. దాతలు, వివిధ కమ్యూనిటీలు, స్వచ్ఛంద సంఘాలు స్పందించి లక్షలాది రూపాయలు సాయం అందించాయి. 'సాక్షి' ప్రయత్నానికి బాధిత కుటుంబాలు చేతులెత్తి కృతజ్ఞతలు తెలిపాయి.





క్రాస్ ఓటింగ్ ఎమ్మెల్యేలను గుర్తించాం

- ఆ ఇద్దరిపై సమీక్షించాక తగిన చర్యలు: సజ్జల
- ప్రలోభాలకు తెర తీసిన చంద్రబాబు
- ఈ ఫలితాలతో ప్రమాణస్వీకారం తరహాలో హడావుడి
- అంత ధీమా ఉంటే 175 చోట్ల ఒంటరిగా బరిలోకి దిగాలి



సాక్షి, అమరావతి: 'చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు మా ఎమ్మెల్యేలు 23 మందిని టీడీపీలోకి లాక్కుని రాజకీయం చేశారు. ఇప్పుడూ అదేవిధంగా ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రలోభాల పర్వానికి తెర తీశారు' అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ నుంచి గెలిచిన 23 మంది ఎమ్మెల్యేలలో నలుగురు ఆ పార్టీతో లేరని గుర్తు చేశారు.

క్రాస్ ఓటింగ్ జరిగింది

'ఎమ్మెల్యేలు శ్రీధర్‌రెడ్డి, ఆనం రాంనారాయణరెడ్డిని మేం పరిగణనలోకి తీసుకోలేదు. అయినప్పటికీ టీడీపీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు, జనసేన నుంచి గెలిచిన ఒక ఎమ్మెల్యే మద్దతు మాకే ఉంది. ఏడుగురు వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలుపొందేందుకు ఆ సంఖ్యా బలం సరిపోతుంది. అయితే టీడీపీకి 23 ఓట్లు వచ్చాయి. దీన్నిబట్టి క్రాస్ ఓటింగ్ జరిగిందని అర్థం అవుతోంది. క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన ఇద్దరు ఎమ్మెల్యేలు ఎవరో గుర్తించాం. పార్టీలో అంతర్గతంగా సమీక్షించుకుని వారిపై తగిన సమయంలో తగిన చర్యలు తీసుకుంటాం' అని సజ్జల తెలిపారు.

సీఎం జగన్ వెంటే ప్రజలు

వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో గెలుస్తామని టీడీపీ నాయకులు చెప్పుకోవడం హాస్యాస్పదమని సజ్జల పేర్కొన్నారు. ఏ లెక్కన 175 స్థానాల్లో గెలుస్తారో చెప్పాలన్నారు. గత మూడున్నరేళ్లకుపైగా సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న విప్లవాత్మక కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఆయన వెన్నంటే ఉన్నారని చెప్పారు. ఈ విషయం ఇప్పటికే పలు ఎన్నికల్లో వెల్లడైందన్నారు. మొన్న గ్రాడ్యుయేట్.. ఇవాళ ఈ ఫలితాలను చూసి చంద్రబాబు తనను ప్రమాణ స్వీకారానికి పిలవాలన్నంత హడావుడి చేస్తున్నారని వ్యాఖ్యానించారు. అంత ధీమా ఉంటే 175 స్థానాల్లో టీడీపీ ఒంటరిగా పోటీ చేయాలని సూచించారు.

ఇద్దరు అమ్ముడుపోయారు: జోగి రమేష్, గృహ నిర్మాణ శాఖ మంత్రి

చంద్రబాబు ప్రలోభాలకు ఇద్దరు అమ్ముడుపోయారు. వారు చరిత్ర హీనులుగా మిగలడం ఖాయం. నమ్మిన వారిని మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట. ఆయన్ను నమ్ముకుంటే రాజకీయంగా సమాధే. క్రాస్ ఓటింగ్‌కి పాల్పడిన వారిపై చర్యలు తప్పవు.

ప్రలోభాల్లో చంద్రబాబు సిద్ధహస్తుడు: కురసాల కన్నబాబు, మాజీ మంత్రి

చంద్రబాబుకు ఓట్లు కొనడం కొత్త కాదు. ప్రలోభాల్లో ఆయన సిద్ధహస్తుడు. తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుకు రూ.5 కోట్లు ఎర వేసి పట్టుబడటంతో పారిపోయి వచ్చారు. మా పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసిన వారిపై కచ్చితంగా చర్యలు ఉంటాయి. ఎలా జరిగిందో విశ్లేషించుకుంటాం

ద్రోహులెవరో తేటతెల్లమైంది: కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యే

పార్టీలో ఉంటూ ద్రోహం చేసిందెవరో తేటతెల్లమైంది. వారిని ప్రజలు క్షమించరు. చరిత్రహీనులుగా మిగిలిపోతారు.

మహిళల భద్రత కోసం దిశ యాప్

మండలిలో హోంమంత్రి తానేటి వనిత

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మహిళలపై లైంగిక దాడులు, వేధింపులు జరిగినప్పుడు చర్యలు తీసుకోవడం కాకుండా, ఆ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త కోసమే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దిశ యాప్ తెచ్చినట్లు హోంమంత్రి తానేటి వనిత చెప్పారు. గురువారం శాసనమండలి ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆమె జవాబిస్తూ.. మహిళల భద్రత కోసం రూపొందించిన దిశ యాప్‌ను 1.36 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారని చెప్పారు. యాప్ ద్వారా 1,200 మంది ఆడపిల్లలు, మహిళలు సకాలంలో పోలీసు సహాయం పొందారని తెలిపారు.

దేశంలో 61 శాతం స్పెషాలిటీ డాక్టర్ల కొరత.. రాష్ట్రంలో 5.4 శాతం మాత్రమే : మంత్రి రజిని

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో జీరో వేకెన్సీ పాలసీని సీఎం జగన్ అమలు చేస్తున్నారని ఆ శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండలిలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి జవాబిస్తూ సీఎం చర్యల ఫలితంగా దేశవ్యాప్తంగా స్పెషలిస్టు వైద్యుల కొరత 61 శాతం ఉండగా, మన రాష్ట్రంలో 5.4 శాతం మాత్రమే ఉందని చెప్పారు. గైనకాలజిస్టుల కొరత దేశవ్యాప్తంగా 50 శాతం ఉంటే, మన రాష్ట్రంలో 1.4 శాతం మాత్రమేనన్నారు. గ్రామ పంచాయతీలకు కేంద్రం విడుదల చేసిన నిధులన్నింటినీ పంచాయతీలకే సర్దుబాటు చేశామని, ఆ నిధులను ఏ విధంగానూ మళ్లించలేదని ఉప ముఖ్యమంత్రి (పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ) బూడి ముత్యాలనాయుడు తెలిపారు. రాష్ట్రంలో పేద మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ఈ మూడున్నరేళ్లలో రూ. 811.37 కోట్లు ఖర్చు చేసినట్టు పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పారు. దళారీ వ్యవస్థకు తావే లేకుండా ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పారు. దీనివల్ల రాష్ట్రంలో రైతులు ఇప్పుడు ఎకరాకు రూ. 9 వేల వరకు అదనపు ఆదాయం పొందుతున్నారని చెప్పారు.

అంబేడ్కర్ ఆశయ సాధకుడు జగన్

అసెంబ్లీలో మంత్రి మేరుగు నాగార్జున

సాక్షి, అమరావతి: దేశ చరిత్రలో నిలిచిపోయేలా విజయవాడ నడిబొడ్డున రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. గురువారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. అంబేడ్కర్ ఆశయ సాధకుడు సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. జూలై చివరికల్లా పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యేలు కైలే అనిల్, కంబాల జోగులు, అలజంగి జోగారావు, టీజేఆర్ సుధాకర్‌బాబు కూడా ఈ అంశంపై మాట్లాడారు.

క్లుప్తంగా...

జస్టిస్ బట్టు దేవానంద్ బదిలీకి రాష్ట్రపతి ఆమోదం

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులు మద్రాస్ హైకోర్టుకు బదిలీపై గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏపీ హైకోర్టుకు చెందిన జస్టిస్ బట్టు దేవానంద్, తెలంగాణ హైకోర్టుకు చెందిన జస్టిస్ దేవరాజు నాగార్జున్ లను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేయాలని గతేడాది నవంబర్‌లో సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. దీనిని రాష్ట్రపతి ఆమోదించారు.

పద్మ అవార్డు గ్రహీతలను సన్మానించిన 'సేవా'

సాక్షి, న్యూఢిల్లీ: పద్మశ్రీ అవార్డు గ్రహీతలైన తెలుగు ప్రముఖులు సంకురాత్రి చంద్రశేఖర్, మొదడుగు విజయగుప్తాను సమైక్య తెలుగు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (సేవా) సత్కరించింది. రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకున్న వీరిద్దరినీ సేవా ప్రధాన కార్యదర్శి జీవీఆర్ మురళి శాలువాతో సత్కరించారు. అనంతరం సేవా ప్రతినిధులు దామోదరరావు, అర్జున్, చంద్రశేఖర్ అవార్డు గ్రహీతలను కొనియాడారు.

విదేశాల్లోనూ ఉపాధికి 'స్కిల్' శిక్షణ

- టీపీకేటీ గ్రూప్‌తో ఏపీఎన్ఆర్టీఎస్, ఏపీఎస్ఎస్‌డీసీ ఒప్పందం



సాక్షి, అమరావతి: రాష్ట్ర యువత విదేశాల్లో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ముందడుగు వేసింది. మిడిల్ ఈస్ట్, యూరప్‌తో పాటు ఆస్ట్రేలియా, కెనడా, జపాన్, అమెరికా తదితర దేశాల్లోని అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా నైపుణ్య శిక్షణ ఇవ్వనుంది. ఇందులో భాగంగా గురువారం తాడేపల్లిలోని ఏపీఎస్ఎస్‌డీసీ కార్యాలయంలో టీపీకేటీ గ్రూప్‌తో ఏపీఎస్ఎస్‌డీసీ, ఏపీఎన్ఆర్టీఎస్ త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకున్నాయి. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ సత్యనారాయణ, ఏపీఎన్ఆర్టీఎస్ సీఈవో వెంకట్ ఎస్ మేడపాటి, టీపీకేటీ గ్రూప్ ఎండీ రాజ్‌సింగ్ సమక్షంలో పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా వైద్యం, నిర్మాణం, ఆతిథ్య రంగాల్లోని విదేశీ అవకాశాలపై టీపీకేటీ గ్రూప్ ప్రధానంగా దృష్టి సారిస్తుంది. తొలి దశలో జర్మనీలోని అవకాశాలను అందిపుచ్చుకునేందుకు 15 మంది నర్సింగ్ అభ్యర్థులను ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేసి శిక్షణ ఇస్తారు. వీరికి జర్మనీ భాషపై 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. వీసా ప్రక్రియ పూర్తయిన తర్వాత ఏప్రిల్‌లో జర్మనీకి పంపిస్తారు. అలాగే సీఎం వైఎస్ జగన్ ఆదేశాలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలను కల్పించేందుకు 192 స్కిల్ హబ్స్, 26 స్కిల్ కాలేజీలు, స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఏపీఎస్ఎస్‌డీసీ ప్రణాళికలు సిద్ధం చేసింది.

గంగిరెడ్డి బెయిల్ రద్దు కోరుతూ సీబీఐ పిటిషన్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ-1 నిందితుడిగా ఉన్న ఎర్ర గంగిరెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ హైకోర్టులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) పిటిషన్ దాఖలు చేసింది. ఈ హత్య కేసులో 2019 మార్చి 28న గంగిరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అరెస్ట్ చేసింది. అయితే, 90 రోజులు గడిచినా సిట్ చార్జిషీట్ వేయకపోవడాన్ని పరిగణనలోకి తీసుకున్న పులివెందుల కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. అనంతరం దర్యాప్తు సీబీఐకి బదిలీ కావడంతో.. 2021 అక్టోబర్‌లో ప్రాథమిక చార్జిషీట్ వేసింది. ఆయన బెయిల్ రద్దు చేయాలని కోరుతూ ఏపీ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు నిరాకరించడంతో సుప్రీం కోర్టులో సీబీఐ పిటిషన్ వేసింది. ఈ క్రమంలోనే కేసు తెలంగాణ సీబీఐ కోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ బెయిల్‌పై తెలంగాణ హైకోర్టును ఆశ్రయించాలని సీబీఐకి అత్యున్నత న్యాయస్థానం సూచించింది. దీంతో సీబీఐ తెలంగాణ హైకోర్టులో బెయిల్ రద్దు పిటిషన్ వేసింది. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ చిల్లకూర్ సుమలత గురువారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఎర్ర గంగిరెడ్డికి నోటీసులు జారీ చేసి.. కేసు తదుపరి విచారణను ఈ నెల 29వ తేదీకి వాయిదా వేశారు.

మాగుంట రాఘవ బెయిలు పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఈడీ అరెస్టు చేసిన మాగుంట రాఘవ బెయిలు పిటిషన్‌పై విచారణను రౌస్ అవెన్యూ కోర్టు వాయిదా వేసింది. రాఘవ పిటిషన్ గురువారం జస్టిస్ ఎంకే నాగ్‌పాల్ ధర్మాసనం ముందుకొచ్చింది. ఈ సమయంలో మాగుంట రాఘవను తీహార్ జైలు అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరు పరచలేదు. దీంతో న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేసి తదుపరి విచారణకు తప్పకుండా హాజరుపర్చాలని ఆదేశించారు. తదుపరి విచారణ ఈ నెల 25కు వాయిదా వేశారు.

అధికార పక్షానికి 6

క్రాస్ ఓటింగ్‌తో ఒక ఎమ్మెల్సీ నెగ్గిన టీడీపీ

సాక్షి, అమరావతి: ఎమ్మెల్యేల కోటాలో ఖాళీ అయిన ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఆరు స్థానాలను సాధించింది. టీడీపీ ఒక స్థానాన్ని దక్కించుకుంది. శాసనసభలో మొత్తం సభ్యుల సంఖ్య 175 కాగా వైఎస్సార్‌సీపీకి 151 మంది ఎమ్మెల్యేల బలముంది. టీడీపీ నుంచి 23 మంది గెలుపొందినా చంద్రబాబు పోకడలు నచ్చక నలుగురు సభ్యులు ఆదిలోనే ఆ పార్టీకి దూరమయ్యారు. పవన్ కళ్యాణ్ వ్యవహార శైలితో ఆ పార్టీకి ఉన్న ఒకే ఒక సభ్యుడూ జనసేనకు దూరమయ్యారు. వీటిని పరిగణనలోకి తీసుకుంటే టీడీపీకి సాంకేతికంగా 19 మంది సభ్యులే ఉన్నట్లు స్పష్టమవుతోంది. టీడీపీకి దూరమైన నలుగురు ఎమ్మెల్యేలు, జనసేనకు దూరమైన ఒక ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ వెంట నడుస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక స్థానాన్ని దక్కించుకోవాలంటే 22 మంది ఎమ్మెల్యేల మొదటి ప్రాధాన్యత ఓట్లు అవసరం. వైఎస్సార్ సీపీకి శాసనసభలో స్పష్టమైన ఆధిక్యత ఉండటంతో ఏడు స్థానాలకూ అభ్యర్థులను పోటీకి పెట్టింది. తమకు సంఖ్యాబలం లేకపోయినప్పటికీ ప్రలోభాలకు తెర తీస్తూ ఒక స్థానం నుంచి అభ్యర్థిని చంద్రబాబు బరిలోకి దింపారు.

175 ఓట్లు చెల్లుబాటు

ఎమ్మెల్యేల కోటాలో ఖాళీ అయిన ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ శాసనసభ కమిటీ హాల్ నెంబర్-1లో పోలింగ్ నిర్వహించారు. 175 మంది ఎమ్మెల్యేలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 5 గంటలకు ఎన్నికల పరిశీలకుడు ఎంటీ కృష్ణబాబు పర్యవేక్షణలో



ఓటు వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

రిటర్నింగ్ అధికారి పీవీ సుబ్బారెడ్డి ఓట్ల లెక్కింపును ప్రారంభించారు. పోలైన 175 ఓట్లు నిబంధనల మేరకు ఉండటంతో అన్నీ చెల్లుతాయని రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

మొదటి ప్రాధాన్యత ఓట్లతో ఆరుగురు విజయం..

తొలుత మొదటి ప్రాధాన్యత ఓట్లను లెక్కించగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు పెన్మత్స వీవీ సూర్యనారాయణరాజు, పోతుల సునీత, బొమ్మి ఇజ్రాయెల్, చంద్రగిరి ఏసురత్నం, మర్రి రాజశేఖర్‌లకు 22 ఓట్లు చొప్పున వచ్చాయి. టీడీపీ అభ్యర్థి పంచుమర్తి అనురాధకు 23 ఓట్లు లభించాయి. దీంతో వారు మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలుపొందినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. మరో ఇద్దరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు జయమంగళ వెంకటరమణ, కోలా గురువులకు 21 చొప్పున మొదటి ప్రాధాన్యత ఓట్లు వచ్చాయి. వారిద్దరికీ మొదటి ప్రాధాన్యత ఓట్లు సమానంగా రావడంతో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. ఈ క్రమంలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు అత్యధికంగా వచ్చిన జయమంగళ వెంకటరమణ గెలుపొందినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

ప్రలోభాల రాజకీయాలకు చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్

తెలంగాణ శాసనమండలికి 2015లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో సంఖ్యాబలం లేకపోయినా టీడీపీ అభ్యర్థిని బరిలోకి దించిన చంద్రబాబు ఓటుకు కోట్లను వెదజల్లి సాక్ష్యాధారాలతో 2015 మే 31న తెలంగాణ ఏసీబీ విభాగానికి దొరికిపోయారు. ఆ కేసు నుంచి తప్పించుకునేందుకు రాష్ట్ర ప్రయోజనాలను తెలంగాణ సర్కార్‌కు తాకట్టు పెట్టి రాత్రికి రాత్రే హైదరాబాద్ నుంచి పరారై కృష్ణా కరకట్టపై ఉన్న అక్రమ కట్టడంలోకి చేరుకున్నారు. 2014 నుంచి 2019 మధ్య టీడీపీ అధికారంలో ఉండగా వైఎస్సార్‌సీపీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లా కొనుగోలు చేశారు. 1995లో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి ఎమ్మెల్యేలను తన వైపు తిప్పుకోవడంలోనూ ప్రలోభాలనే చంద్రబాబు ఎంచుకున్నారు. చంద్రబాబు కేవలం ప్రలోభాల రాజకీయాలు మాత్రమే చేస్తారని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. రాజకీయాల్లో ప్రలోభాలకు చంద్రబాబును బ్రాండ్ అంబాసిడర్‌గా అభివర్ణిస్తున్నారు.

గడప గడపకూ విఫలమైన వారే లక్ష్యంగా..

నిర్విఘ్నంగా కొనసాగుతున్న సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల ప్రజాదరణ నానాటికీ పెరుగుతోంది. 2019 ఎన్నికల తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు తిరుపతి లోక్‌సభ, బద్వేలు, ఆత్మకూరు శాసనసభ స్థానాల ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రికార్డు మెజార్టీతో విజయం సాధించడమే అందుకు తార్కాణం. మూడేళ్లుగా చేపట్టిన సంక్షేమాభివృద్ధి పథకాలు, అందిస్తున్న సుపరిపాలనను ప్రతి ఇంటికీ వివరిస్తూ ప్రజల ఆశీస్సులు కోరేందుకు 2022 మే 11న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడే మనం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులమని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారితో మమేకమై సమస్యలు పరిష్కరిస్తూ ఆశీస్సులు పొందాలని ఆదిలోనే ఎమ్మెల్యేలకు సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి ఎప్పటికప్పుడు వర్క్ షాప్‌లు నిర్వహిస్తూ మరింత ప్రభావవంతంగా నిర్వహించేలా ఎమ్మెల్యేలకు సూచనలు చేస్తున్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించడంలో వెనుకబడ్డ ఎమ్మెల్యేలను పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచిస్తున్నారు. ఆ మేరకు గడప గడపకూ సమర్థంగా నిర్వహించలేక.. ప్రజలతో మమేకమవ్వలేక వైఎస్సార్ సీపీకి దూరమైన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డికి తోడు మరో ఇద్దరు ఎమ్మెల్యేలను రూ.కోట్లు వెదజల్లి సంతలో పశువుల్లా కొనుగోలు చేసి.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొడ్డిదారిన విజయం సాధించాలని చంద్రబాబు వ్యూహం రచించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో విఫలమైన వారితోపాటు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ టికెట్ దక్కదనే సంకేతాలున్న ఎమ్మెల్యేలే లక్ష్యంగా ప్రలోభాలకు చంద్రబాబు తెరతీశారు. ఈ క్రమంలో ఇద్దరు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి టీడీపీ అభ్యర్థికి క్రాస్ ఓటింగ్ చేయించారు. దీంతో టీడీపీ అభ్యర్థి పంచుమర్తి అనురాధకు 23 ఓట్లు వచ్చాయి.

ఏపీలో విత్తన పరిశోధన, శిక్షణ సంస్థ

- దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు
- గన్నవరం వద్ద 8 ఎకరాల్లో రూ.45 కోట్లతో నిర్మాణం

సాక్షి, అమరావతి: దేశంలోనే తొలి విత్తన పరిశోధన, శిక్షణా సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు కాబోతుంది. కృష్ణా జిల్లా గన్నవరం సమీపంలోని 8 ఎకరాల విస్తీర్ణంలో రూ.45 కోట్ల వ్యయంతో డాక్టర్ వైఎస్సార్ విత్తన పరిశోధన, శిక్షణా సంస్థ ఏర్పాటుకు వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. జాతీయ విత్తన పరిశోధన, శిక్షణా కేంద్రం ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఉంది. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఈ తరహా కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామ స్థాయిలో రైతుల ముంగిటకు సరఫరా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఏపీ విత్తనాభివృద్ధి సంస్థకు అనుబంధంగా రాష్ట్ర స్థాయి విత్తన పరిశోధన సంస్థను ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి విత్తన జన్యు బ్యాంక్, సీడ్ గ్రో అవుట్ టెస్ట్ ఫామ్, సీడ్ టెస్టింగ్ ల్యాబ్, గ్రీన్ హౌస్, సీడ్ ప్రాసెసింగ్, కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు, విత్తనాలు నిల్వ చేసేందుకు ప్రత్యేకంగా గోదాములు నిర్మించనుంది. రైతుల కోసం ట్రైనింగ్ సెంటర్‌తో పాటు వ్యవసాయ పట్టభద్రులు, పీజీ, డిప్లొమా చదివే విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు ఈ రంగంలో పరిశోధనల వైపు అడుగు వేసే వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చేందుకు ట్రైనింగ్ సెంటర్, హాస్టల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది.

సంస్థ లక్ష్యాలివే..

రాష్ట్రంలో విత్తన నాణ్యతను పరీక్షించే నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, మానవ వనరుల అభివృద్ధి, సీడ్ సైన్స్, టెక్నాలజీలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేయడం, ఈ రంగంలో ఉన్న ఇతర సంస్థలతో సమన్వయం చేసుకోవడం, ఏటా కనీసం 1,000 మంది అగ్రి గ్రాడ్యుయేట్స్, 2 వేల మంది అగ్రి డిప్లొమా విద్యార్థులకు కెపాసిటీ బిల్డింగ్ ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. వచ్చే ఏడాది ఖరీఫ్ నాటికి ఈ కేంద్రం సేవలను అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఉంది. కాగా, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు మాట్లాడుతూ.. ఏ వాతావరణాన్ని అయినా తట్టుకోగలిగేలా, అధిక దిగుబడులనిచ్చే కొత్త రకాల విత్తనాలను రూపొందించడంలో, సంకర జాతులను అభివృద్ధి చేయడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.

ఆవిష్కరణలకు ప్రోత్సాహం

- స్టార్టప్‌ల కోసం విశాఖలో ఐస్పేస్ మల్టీ డొమైన్ ఇన్నొవేషన్ హబ్
- 5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో స్టార్టప్ ఎకోసిస్టమ్ అభివృద్ధి



సాక్షి, అమరావతి: యువతరం ఆలోచనలను ప్రోత్సహిస్తూ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా స్టార్టప్ ఎకో సిస్టమ్ అభివృద్ధి కోసం నూతన పారిశ్రామిక విధానంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంది. పారిశ్రామికవేత్తలుగా రాణించే నైపుణ్యం కలిగిన యువతను గుర్తించి చేయూతనిచ్చేలా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ క్లబ్స్, ఇంక్యుబేషన్ సెంటర్స్, సెలెక్ట్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూషన్ లాంటి వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు. ముఖ్యంగా ఐటీ, బయోటెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే విధంగా విశాఖ కేంద్రంగా ఐ-స్పేస్ పేరుతో మల్టీ డొమైన్ ఇన్నొవేషన్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పాలసీలో పేర్కొన్నారు. ఒక ఆలోచనను పూర్తిస్థాయి వ్యాపార ఆవిష్కరణగా మార్చడానికి అవసరమైన ఆర్ అండ్ డీ, కటింగ్ ఎడ్జ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ప్రొడక్ట్ వాలిడేషన్, ఉత్పత్తి పరిశీలన లాంటి వ్యవస్థలన్నీ ఒకచోట ఉండేలా దీన్ని అభివృద్ధి చేయనున్నారు. తొలిదశలో 5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐ స్పేస్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ ఇంక్యుబేటర్స్, కో వర్కింగ్ స్పేస్, ఏంజెల్/వెంచర్ క్యాపిటలిస్టులను అందుబాటులో ఉంచడంతోపాటు చేయూతనిచ్చే విధంగా మెంటార్స్, టెక్నోప్రెన్యూర్స్ ఉంటారు. వీటితోపాటు ఇంటెలెక్చువల్ ప్రాపర్టీస్, పేటెంట్ రిజిస్ట్రేషన్స్, లీగల్ సర్వీసెస్, ఫండ్ సోర్సింగ్, ప్యాకేజింగ్ లాంటి సేవలు కూడా అందుబాటులో ఉంటాయి.

కార్పస్ ఫండ్

స్టార్టప్‌లకు అవసరమైన సీడ్ క్యాపిటల్ సాయం అందించేందుకు ప్రభుత్వం కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేయనుంది. నూతన ఆవిష్కరణల కోసం రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్స్ (ఆర్ అండ్ డీ) ఏర్పాటును ప్రోత్సహించనుంది. ఆర్ అండ్‌డీ సెంటర్ల కోసం వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం రీయింబర్స్ చేయనున్నట్లు పాలసీలో పేర్కొన్నారు. ఆర్ అండ్ డీ ల్యాబ్, టెస్టింగ్ ల్యాబ్స్ వ్యయంలో 50 శాతం వరకు, గరిష్టంగా రూ.3 కోట్ల వరకు రీయింబర్స్ చేస్తారు.

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో 100 శాతం పోలింగ్

రిటర్నింగ్ అధికారి పీవీ సుబ్బారెడ్డి

సాక్షి, అమరావతి: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ జరిగిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పీవీ సుబ్బారెడ్డి తెలిపారు. 175 మంది అసెంబ్లీ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారని, అన్ని ఓట్లు చెల్లుబాటు అయ్యాయని తెలిపారు. తొలి ఓటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేశారని చెప్పారు. చివర్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 4 గంటలకు ముగిసిందని తెలిపారు. ఒకవైపు అసెంబ్లీ జరుగుతుండగానే మరోవైపు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కొనసాగిందని చెప్పారు. సాయంత్రం 5 గంటలకు కౌంటింగ్ ప్రారంభమై రాత్రి వరకు సాగిందన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని, పరిశీలకులుగా కృష్ణబాబు వ్యవహరించారని చెప్పారు.

వదలని వానలు

- మరో మూడురోజులు వర్షాలు
- కోస్తాంధ్రలో కొన్నిచోట్ల, రాయలసీమలో అక్కడక్కడ వానలు
- కొనసాగుతున్న ద్రోణి ప్రభావం
- అనకాపల్లి జిల్లాలో 9.1 సెంటీమీటర్ల భారీ వర్షపాతం



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో వర్షాలు పడుతూనే ఉన్నాయి. దాదాపు వారం రోజుల నుంచి వానలు కురుస్తున్నాయి. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరుగాను, కొన్నిచోట్ల భారీగాను వర్షాలు పడుతున్నాయి. అంతర్గత తమిళనాడు నుంచి దక్షిణ ఛత్తీస్‌గఢ్ వరకు ఉన్న ఉపరితల ద్రోణి ప్రస్తుతం రాయలసీమ నుంచి దక్షిణ జార్ఖండ్ వరకు తెలంగాణ, ఒడిశాల మీదుగా సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. దీని ప్రభావంతో రానున్న మూడురోజులు ఉత్తర, దక్షిణ కోస్తాల్లో కొన్నిచోట్ల, రాయలసీమలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. అదే సమయంలో కోస్తాంధ్రలో ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉందని పేర్కొంది. గురువారం అనకాపల్లి, కాకినాడ, ఎస్పీఎస్సార్ నెల్లూరు, కృష్ణాజిల్లాల్లో మోస్తరు నుంచి భారీవర్షాలు కురిశాయి. రాష్ట్రంలో అత్యధికంగా అనకాపల్లి జిల్లా కొక్కిరాపల్లిలో 9.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సామర్లకోటలో 7.8 సెంటీమీటర్లు, యలమంచిలిలో 7.7, కావలిలో 4.6, గుడివాడలో 4.2, మల్లాదిలో 3.7, ఉప్పలపాడులో 3.5 సెంటీమీర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

చెదిరిన బతుకుల్లో వెలుగు రేఖ

ఐదుగురు చిన్నారులకు బంగారు భవిష్యత్

పత్తికొండ టౌన్/రూరల్: కర్నూలు జిల్లా పత్తికొండ మండల పరిధిలోని బుగ్గతండా గ్రామానికి చెందిన రమణమ్మ, రాంబాబునాయక్ దంపతులకు ఐదుగురు ఆడపిల్లలు. తల్లి రమణమ్మ 2016 సెప్టెంబర్‌లో కామెర్ల సోకడంతో మరణించింది. భార్య మరణంతో మతిస్థిమితం కోల్పోయిన రాంబాబునాయక్ పిల్లలు.. మల్లిక, శశిరేఖ, ఇందు, లోకేశ్వరి, సింధులను వదిలేసి ఎక్కడికో వెళ్లిపోయాడు. దీంతో చిన్నారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పిల్లల దీనస్థితిని 'సాక్షి' వెలుగులోకి తేవడంతో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి మానవతావాదులు ముందుకొచ్చి చిన్నారులకు సుమారు రూ.20 లక్షల మేర ఆర్థిక సాయం అందించారు. ఈ నగదును చిన్నారుల పేరుతో పత్తికొండ ఎస్‌బీఐలో డిపాజిట్ చేశారు. మల్లిక పత్తికొండ కేజీబీవీలో 10వ తరగతి, శశిరేఖ పత్తికొండ అంబేడ్కర్ బాలికల గురుకులంలో 8వ తరగతి, ఇందు బనవాసి బాలికల గురుకులంలో 7వ తరగతి, లోకేశ్వరి పత్తికొండ కేజీబీవీలో 5వ తరగతి, ఆఖరు అమ్మాయి సింధు మేనమామ నెనావత్ రంగస్వామి సంరక్షణలో ఉంటూ బుగ్గతండాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతోంది. నాడు 'సాక్షి' చొరవ వల్లే ఈ పిల్లల బతుకులు చల్లగా ఉన్నాయని స్థానికులు ప్రశంసిస్తున్నారు.



తల్లిదండ్రులు దూరమవడంతో అనాథలైన చిన్నారులు

ఏపీ ఇన్ పార్లమెంట్

గ్రామాలకు వరం.. బార్క్ నీటిశుద్ధి పరిజ్ఞానం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం

రాజ్యసభ

సాక్షి, న్యూఢిల్లీ: బాబా అణుపరిశోధనా కేంద్రం (బార్క్) అభివృద్ధి చేసిన నీటి శుద్ధి పరిజ్ఞానం సాయంతో అతి తక్కువ ఖర్చుతో గ్రామీణ ప్రాంతాలకు శుద్ధిచేసిన, సురక్షితమైన తాగు నీటిని అందుబాటులోకి తీసుకు వస్తున్నట్టు ప్రధానమంత్రి (పీఎంవో) శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు గురువారం రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానమిస్తూ.. దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో శుద్ధి చేసిన తాగునీరు అందించే లక్ష్యంతో ఆకృతి ప్రోగ్రాం పేరిట కేంద్ర ప్రభుత్వం అనేక మంది గ్రామీణ పారిశ్రామికవేత్తలకు అల్ట్రా ఫిల్టరేషన్ మెంబ్రేన్ ఆధారిత నీటిశుద్ధి సాంకేతికతను బదలాయించినట్టు తెలిపారు. బార్క్ రూపొందించిన నీటిశుద్ధి సాంకేతిక పరిజ్ఞానం ప్రస్తుతం మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, బిహార్, ఒడిశా, గుజరాత్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో విస్తరించినట్టు తెలిపారు. వాణిజ్యపరంగా దీనిని విస్తరించేందుకు 14కు పైగా ప్రైవేట్ సంస్థలకు వివిధ రకాల టెక్నాలజీలను బదలాయించినట్టు తెలిపారు. బార్క్ రూపొందించిన మెంబ్రేన్ ఆధారిత నీటిశుద్ధి సాంకేతికత పూర్తిగా దేశీయ పరిజ్ఞానంతో రూపొందించారని, తక్కువ ఖర్చుతో కూడుకున్నదని మంత్రి వివరించారు. ఈ టెక్నాలజీల ఆధారంగా రూపొందించిన డొమెస్టిక్ వాటర్ ప్యూరిఫయర్స్ మార్కెట్లో లభ్యమయ్యే వాణిజ్యపరమైన రకాలతో పోలిస్తే 30 నుంచి 40 శాతం తక్కువ ధరలో అందిస్తున్నట్టు చెప్పారు. ఇంట్లో కుళాయికి అమర్చే డొమెస్టిక్ వాటర్ ప్యూరిఫయర్ రూ.5 వేలు, గంటకు 10 లీటర్ల నీటిని శుద్ధిచేసే సామర్థ్యం గల డీడబ్ల్యూఆర్ఓ-పీఓయూ వాటర్ ప్యూరిఫయర్ రూ.10 వేలు, కమ్యూనిటీ సైజ్ యూఎఫ్ ఆధారిత ఆర్సెనిక్/ఐరన్ రిమూవల్ యూనిట్ రూ.10 లక్షలు, బీడబ్ల్యూఆర్ఓ మెంబ్రేన్ ఆధారిత కమ్యూనిటీ సైజ్ ఆర్వో యూనిట్ రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షలు, గంటకు 10 వేల లీటర్ల నీటిని శుద్ధిచేసే సామర్థ్యం గల ఎస్‌బ్ల్యూఆర్ఓ మెంబ్రేన్ ఆధారిత కమ్యూనిటీ సైజ్ ఆర్వో యూనిట్ రూ.70 లక్షల నుంచి రూ.85 లక్షల మధ్యలో లభిస్తుందని జితేంద్రసింగ్ వివరించారు.

ఉచిత న్యాయ సేవల కోసం రూ.200 కోట్లు

పేదలకు ఉచితంగా న్యాయ సేవలందించేందుకు నల్సాకు ఈ ఏడాది రూ.200 కోట్లు కేటాయించినట్టు కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజుజు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. తాలూకా కోర్టుల నుంచి సుప్రీంకోర్టు వరకూ ఏప్రిల్ 2022 నుంచి జనవరి 2023 వరకూ 9.75 లక్షల మందికి ఉచిత సేవలందించినట్టు వెల్లడించారు.

ఏపీలో ఆరు అబ్జర్వేటరీలు

భూకంప కార్యకలాపాలను పర్యవేక్షించడానికి ఏపీలో ఆరు చోట్ల అబ్జర్వేటరీలు ఏర్పాటు చేసినట్టు ఎర్త్ సైన్సెస్ మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. విజయవాడ, విశాఖపట్నం, అనంతపురం, తిరుపతి, కర్నూలు, రాజమండ్రి నగరాల్లో వీటిని ఏర్పాటు చేసినట్టు వివరించారు.


లోక్‌సభ

పోలవరానికి 1,27,263 ఎకరాలను సేకరించాలి

పోలవరం ప్రాజెక్టుకు 1,27,263 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందని కేంద్ర రివైజ్డ్ కాస్ట్ కమిటీ నిర్ధారించినట్టు జలశక్తి శాఖ సహాయ మంత్రి ప్రహ్లాద్ పటేల్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ బీవీ సత్యవతి అడిగిన ప్రశ్నకు గురువారం లోక్‌సభలో సమాధానమిస్తూ.. ఫిబ్రవరి 2023 వరకూ 1,13,119 ఎకరాలు సేకరించారని మంత్రి పేర్కొన్నారు. మిగిలిన భూసేకరణ వివిధ దశల్లో ఉందన్నారు. షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 2023 నాటికి మొత్తం భూసేకరణ పూర్తిచేయాల్సి ఉందన్నారు. మార్చి 2023 నాటికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ కొంత ఆలస్యమైందని తెలిపారు. ప్రాజెక్టు అమలు తీరు, జాప్యాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్టు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు మార్గాని భరత్‌రామ్, వంగా గీతా విశ్వనాథ్ అడిగిన ప్రశ్నకు మంత్రి ప్రహ్లాద్‌పటేల్ లిఖితపూర్వక సమాధానమిస్తూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా నీరు అందించేందుకు అమలు చేస్తున్న జల్‌జీవన్ మిషన్-హర్ ఘర్ జల్ పథకం 2024 కల్లా పూర్తికావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.

మాకు రావాల్సిన స్థానం గెలిచాం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు



సాక్షి, అమరావతి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమకు రావాల్సిన ఎమ్మెల్సీ స్థానాన్ని తాము గెలుచుకున్నామని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు చెప్పారు. టీడీపీ అభ్యర్థి పంచుమర్తి అనూరాధ ఎమ్మెల్సీగా గెలిచిన సందర్భంగా గురువారం ఆయన ఉండవల్లిలోని చంద్రబాబు నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ఖాళీ అయిన 7 ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి టీడీపీకి వస్తుందని తెలిపారు. తమ పార్టీకి 23 మంది సభ్యులున్నా దుర్మార్గంగా ప్రలోభాలు పెట్టారని.. అయినా తమ విజయాన్ని ఆపలేకపోయారన్నారు. తమ పార్టీకి రావాల్సిన స్థానాన్ని రాకుండా చేయడానికి తమ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టారని, వేధించారని తెలిపారు. సీఎం జగన్ చెప్పే దేవుడు ఇప్పుడు స్క్రిప్టును తిరగరాశాడన్నారు. 'దేవుడి స్క్రిప్టుని దేవుడు తిరగరాశాడు.. మీరు చెప్పిన విధంగా మీ పతనానికి బీజం వేశాడు' అని పేర్కొన్నారు.

అసాధారణ విజయం: పయ్యావుల

ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అసాధారణ విజయం సాధించిందని ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ పయ్యావుల కేశవ్ అన్నారు. గురువారం అసెంబ్లీ వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. తమకు సంఖ్యాబలం ఉందని, అందుకే పోటీ పెట్టామని తెలిపారు. తమకున్న సంఖ్యా బలం ప్రకారం వైఎస్సార్‌సీపీ అసలు పోటీయే పెట్టకూడదన్నారు. ఎమ్మెల్యేలకు ఈ ప్రభుత్వంపై నమ్మకం లేదని ఎమ్మెల్సీ ఎన్నికలు స్పష్టం చేశాయన్నారు. సీక్రెట్ బ్యాలెట్‌లో అంతరాత్మ ప్రబోధం మేరకు 23 స్థానాలు తమకు వచ్చాయన్నారు. చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతో తమకు ఓట్లు వేశారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తర్వాత చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో కేక్ కట్ చేసి నాయకులకు తినిపించారు. ఎమ్మెల్సీగా గెలిచిన అనూరాధను ఆయన అభినందించారు.

● యంగ్ టాలెంట్

చిన్న వయసులోనే యూనిక్ ఫొటో ప్రాజెక్ట్‌లతో 'వావ్' అనిపించుకుంటోంది ఇండియన్-అమెరికన్ జైరా రే. 'లెన్స్' భాష తెలిసిన జైరా భారతీయ కుటుంబ బంధాలను ఛాయాచిత్రాలలోకి తర్జుమా చేస్తోంది.

విజువల్ ఐ


జైరా

జైరా రే ఇండియన్-అమెరికన్ ఫొటోగ్రాఫర్, విజువల్ ఆర్టిస్ట్. న్యూయార్క్ నగరంలో పుట్టిన రే పద్నాలుగు సంవత్సరాల వయసులో ఫొటోలు తీయడం మొదలు పెట్టింది. హైస్కూల్ రోజుల్లో నగర అన్వేషణ తనకు ఇష్టమైన పని. ఆ అన్వేషణలో ప్రతి శబ్దం, నిశ్శబ్దం, ప్రతి దృశ్యం తన మనసులో ముద్రించుకుపోయేవి.

కంపోజిషన్, లైటింగ్, స్కేల్‌పై ఒక అవగాహన రావడానికి 'విజువల్ ఐ'ని డెవలప్ చేసుకోవడానికి ఆ సంచారం తనకు ఉపయోగపడింది.

ఫొటోగ్రాఫీ అంటే కెమెరా క్లిక్ అనిపించడం కాదు. దాని మర్మం ఏమిటో అనుభవంతో తెలుసుకోవాలి.

ఆ లెక్కన జైరా చాలా తెలుసుకుంది. కమర్షియల్ వర్క్స్ కోసం కెనాన్ షూటర్‌ని వాడే జైరా వ్యక్తిగత అభిరుచి కోణంలో సోనీ మిర్రర్ లెస్ కెమెరా వాడుతుంది. ఏ లెన్స్‌ను ఎప్పుడు ఉపయోగించాలి అనే విషయంలోనూ తనకు స్పష్టత ఉంది. మామియా 645లో 45 ఎం.ఎం. లెన్స్, 85 ఎంఎం లెన్స్ అంటే ఇష్టం. ఇష్టమైన ఫిల్మ్‌స్టాక్‌లు పోర్ట్రా 400, కోడాక్ గోల్డ్.

మొన్నటి వరకు జైరా అభిరుచికి మాత్రమే పరిమితమైన ఫొటోగ్రాఫీ భవిష్యత్‌లో కెరీర్‌గా మారనుంది. దీనికి తొలి అడుగు... బ్రౌన్ లవ్!


తన ప్రాజెక్ట్ వర్క్ కోసం 'బ్రౌన్ లవ్' థీమ్‌ను ఎంచుకుంది జైరా. దక్షిణ ఆసియా డయాస్పోరాలోని కుటుంబ బంధాలు, ప్రేమను డాక్యుమెంట్ చేసే ప్రాజెక్ట్ ఇది. కోవిడ్ వల్ల న్యూయార్క్‌కు మాత్రమే పరిమితమైన ఈ ప్రాజెక్ట్ ఆ తరువాత భారతదేశంలోని ఢిల్లీ, కోల్‌కత్తా.... మొదలైన నగరాలకు కూడా విస్తరించింది. అమెరికాలో హాలీవుడ్ సినిమాల కంటే బాలీవుడ్ సినిమాలు చూస్తూ పెరిగిన జైరాకు భారతీయ కుటుంబ వ్యవస్థలోని విలువలు, అనుబంధాల గురించి బాగా తెలుసు. అందుకే 'బ్రౌన్ లవ్' అనేది జైరా మనసుకు దగ్గరైన ప్రాజెక్ట్ అయింది.

జైరా చిత్రాలలో ఆర్టిస్టిక్ యాంగిల్ అనేది సంతకమై మెరుస్తుంది. 'ఆర్ట్ అనేది కథలను మోసుకెళుతూ వాటి గురించి చెప్పే అద్భుత వాహిక. నా ఫొటో ప్రాజెక్ట్‌ల ద్వారా ఎన్నో కథలు చెప్పాలనుకుంటున్నాను' అంటుంది జైరా రే.

● సక్సెస్ స్టోరీ

మాటే మంత్రమై...

చిన్న వయసులో ఉన్నప్పుడు ఇండోర్ (మధ్యప్రదేశ్)లో జరిగిన మ్యాజిక్ షోకు వెళ్లాడు రాజ్ షమని. మెజిషియన్ టోపి నుంచి కుందేలు పిల్లను బయటికి తీశాడు. మంత్రదండం నుంచి పూలవర్షం కురిపించాడు. ఈ అబ్బురాలను చూసి 'మెజిషియన్ అయితే ఎన్ని అద్భుతాలు సాధించవచ్చో కదా!' అనుకున్నాడు రాజ్. పెద్దయ్యాక రాజ్ మెజిషియన్ కాలేదుగానీ 'మాటల మాంత్రికుడు' అయ్యాడు! సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్‌గా బోలెడు పేరు తెచ్చుకున్నాడు....


రాజ్ షమని

పదహారు సంవత్సరాల వయసులో ఇండోర్‌లో తండ్రి చేసే వ్యాపారానికి చేదోడువాదోడుగా ఉండేవాడు రాజ్ షమని. తండ్రితో పాటు డిష్ సోప్స్ అమ్మేవాడు. 'కాలాన్ని కనిపెట్టుకొని ఉండాలి' అనేది వ్యాపారసూత్రం. ఆ వయసులో అతడికి ఇది తెలుసో లేదోగానీ డిష్ సోప్ నుంచి పౌడర్‌కు, పౌడర్ నుంచి లిక్విడ్‌కు, డిష్‌వాషర్ జెల్‌కు బిజినెస్‌ను మార్చాడు.

అంతకు ముందు ఉండీ లేనట్లుగా ఉన్న వ్యాపారం కొత్త ఊపిరి పోసుకొని లాభాల బాటలో పరుగెత్తింది.

రాజ్‌కు తన గురించి తాను తెలుసుకునేలా చేసింది. కొన్ని సంవత్సరాల తరువాత...

సోషల్ మీడియాలో తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ముంబైకి వచ్చాడు రాజ్.

'మరీ ఎక్కువగా ఉత్సాహపడుతున్నావు. ఇక్కడ బాగానే ఉంది కదా' అన్నారు ఇండోర్ ఫ్రెండ్స్. అయితే రాజ్ షమని ఒక్క విజయం దగ్గర ఆగిపోయే టైప్ కాదు. ఉత్సాహమే అతని ఇంధనం.

కొన్ని సంవత్సరాల కష్టం తరువాత మన దేశంలోని మోస్ట్-ఫాలోవ్డ్ కంటెంట్ క్రియేటర్‌లలో ఒకరిగా పేరు తెచ్చుకున్నాడు రాజ్ షమని. మరో విశేషం...

మన దేశంలోని ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు సంబంధించిన పాడ్‌కాస్ట్‌లలో రాజ్ షమని చేసిన 'ఫిగర్ ఔట్' పాడ్‌కాస్ట్ టాప్‌లో నిలిచింది. పన్నెండు నెలల వ్యవధిలో 100 మిలియన్ వ్యూలు వచ్చాయి.

తన స్ఫూర్తిదాయక ప్రసంగాలతో ఎంతో మంది స్టార్టప్‌ల వైపు రావడానికి కారణమైన రాజ్ తొమ్మిది స్టార్టప్‌లలో ఏంజెల్ ఇన్వెస్టర్‌గా ఉన్నాడు.

'వినియోగదారుల ఇష్టాలపైనే వ్యాపారాన్ని నిర్మించాలి' అని చెప్పే రాజ్ షమని డిజిటల్ కంటెంట్ క్రియేటర్స్ తమ కన్స్యూమర్ బ్రాండ్స్‌ను ఎస్టాబ్లిష్ చేసుకోవడం, విజయవంతం చేయడంలో సహాయపడే 'హౌజ్ ఆఫ్ ఎక్స్' వెంచర్ స్టార్ట్ చేశాడు. ఈ వెంచర్ ఇన్వెస్టర్‌ల జాబితాలో నితిన్ కామత్(జెరోదా-కో ఫౌండర్), వినీత సింగ్ (షుగర్ కాస్మెటిక్స్)లాంటి వ్యాపారదిగ్గజాలు ఉండడం విశేషం.

మోటివేషనల్ స్పీకర్‌గా కూడా మంచి పేరు తెచ్చుకుంటున్నాడు 26 సంవత్సరాల రాజ్ షమని.

ఇప్పటివరకు ఇరవైకి పైగా దేశాల్లో స్ఫూర్తిదాయక ప్రసంగాలు ఇచ్చిన రాజ్ షమని 'బిల్డ్, డోన్ట్ టాక్' పేరుతో వ్యక్తిత్వ వికాస పుస్తకం రాశాడు. ఈ పుస్తకం గురించి ఇలా పరిచయం చేసుకుంటాడు రాజ్...

'మన స్కూల్లో మ్యాథ్స్, సైన్స్ లాంటి సబ్జెక్ట్‌లు తెలుసుకుంటాం. అయితే ఒక వస్తువును ఎలా అమ్మాలి? స్నేహసంబంధాలను ఏర్పర్చుకోవడం ఎలా? మానసిక ఆరోగ్యంపై ఎలా శ్రద్ధ చూపాలి? ఆర్థిక విషయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి....మొదలైన విషయాలు స్కూల్‌లో తెలుసుకునే అవకాశం లేకపోవచ్చు. అందుకే ఈ పుస్తకం బడిలోకి రండి. ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు'

'హౌజ్ ఆఫ్ ఎక్స్' ఇన్వెస్టర్‌లలో ఒకరైన నితిన్ కామత్ ఇలా అంటాడు...

'ఐడియాలు, ప్రాడక్ట్ ఎంత ముఖ్యమో వ్యక్తులు కూడా అంతే ముఖ్యం. సోషల్ మీడియాలో రాజ్ షమని సాధించిన విజయాలే మా నమ్మకానికి కారణం'

ఒక్క విజయం దగ్గరే ఆగిపోయే అలవాటు లేని రాజ్ షమని, తన విజయాలకు మాత్రమే పరిమితం కావాలనుకోవడం లేదు. ఇతరులను కూడా గెలుపు బాటలో నడిపించాలనుకుంటున్నాడు.

● టెక్.. టాక్



మోటోరోలా మోటో జీ 53

డిస్‌ప్లే: 6.50 అంగుళాలు
రిజల్యూషన్: 720×1600 పిక్సెల్స్
మెమోరీ: 64జీబి 4జీబి ర్యామ్ 128జీబి 4జీబి ర్యామ్ 128జీబి 6జీబి ర్యామ్ 128జీబి 8జీబి ర్యామ్
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్
వోఎస్: ఆండ్రాయిడ్ 13

లెన్సా ఏఐ

లెన్సా ఏఐ అనేది సరికొత్త ఏఐ పవర్డ్ ఫొటో ఎడిటర్. యూజర్‌లు తమ ఫొటోలను జస్ట్ ఒక్క క్లిక్‌తో కస్టమ్ అవతార్‌గా క్రియేట్ చేసుకోవచ్చు. ప్రిస్మా ల్యాబ్ కంపెనీకి చెందిన ఈ యాప్ ఫొటోల ఎడిటింగ్, వీడియో మేకింగ్, ఏఐ పవర్డ్ టూల్స్‌ను ఉపయోగించి ఆర్ట్‌ను క్రియేట్ చేయడం....మొదలైన వాటిలో ఉపయోగపడుతుంది. వార్షిక సబ్‌స్క్రిప్షన్ ₹ 2,499 వీక్లీ, మంత్లీ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌లు కూడా ఉన్నాయి. యాపిల్ యాప్‌స్టోర్, గూగుల్ ప్లేస్టోర్‌లో దీన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



స్పామ్ ఇమెయిల్స్‌ను బ్లాక్ చేయడానికి...



1. జీమెయిల్ ఓపెన్ చేసిన తరువాత బ్లాక్ చేయాలనుకున్న స్పామ్ ఈమెయిల్‌ను క్లిక్ చేయాలి.
2. 'మోర్' లేదా టాప్‌రైట్‌లోని 'ఐ' ఐకాన్‌ను క్లిక్ చేయాలి.
3. బ్లాక్-క్లిక్
4. సెండర్‌ను బ్లాక్ చేసిన తరువాత అక్కడి నుంచి వచ్చే మెసేజ్‌లు ఆటోమేటిక్‌గా జీమెయిల్ స్పామ్ ఫోల్డర్‌లోకి వెళతాయి.

● గేమింగ్

ఆకాశ శత్రువులు



ఫస్ట్ పర్సన్ బిల్డింగ్ అండ్ రైడింగ్ గేమ్ 'మీట్ యువర్ మేకర్' ఏప్రిల్ 4న విడుదల అవుతుంది. వరల్డ్ మ్యాప్‌లోని రైడింగ్ ఔట్‌పోస్ట్స్ యాక్టివేటింగ్ చేయడం ద్వారా ప్లేయర్స్ ర్యాంకింగ్ పాయింట్స్‌ను సంపాదించుకోవాల్సి ఉంటుంది. డ్రాగ్ అండ్ డ్రాప్, డిలిట్ ఎవ్రీ థింగ్...మొదలైన కొత్త బిల్డింగ్ ఫీచర్స్ ఉన్నాయి. లీ ప్లే సిస్టమ్, మ్యాచ్ మేకింగ్ ఫీచర్‌లలో ఇంప్రూవ్‌మెంట్ తీసుకువచ్చారు. 'ఛాలెంజ్ యువర్ ఫ్రెండ్స్' అంటూ వచ్చిన ట్రైలర్ ఆకట్టుకుంది.

ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 5, ప్లేస్టేషన్ 4, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ మైక్రోసాఫ్ట్‌విండోస్. **జానర్:** స్ట్రాటజీ వీడియో గేమ్

సినిమా

సాక్షికి శుభాకాంక్షలు

- సినీ ప్రముఖుల అభినందనలు

'సాక్షి' ప్రారంభమై పదిహేనేళ్లు అయిందంటే నమ్మలేకపోతున్నాను. ప్రారంభ వేడుకకి మొన్న మొన్నే వెళ్లినట్లుగా అనిపిస్తోంది. ఆ వేడుక ఇంకా గుర్తుంది. 'సాక్షి'కి నా ప్రత్యేక అభినందనలు'' అన్నారు నిర్మాత అల్లు అరవింద్. 'సాక్షి' దినపత్రిక ఆరంభమై నేటితో 15 ఏళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా అల్లు అరవింద్ శుభాకాంక్షలు తెలిపారు. ''సాక్షి' పదిహేనేళ్లు పూర్తి చేసుకుంది. ఇంకా బ్రహ్మాండంగా ముందుకు సాగాలని కోరుకుంటున్నాను'' అన్నారు నిర్మాత అచ్చిరెడ్డి. ''సాక్షి' ఇలాంటి విజయవంతమైన వసంతాలను ఎన్నో చూడాలి'' అన్నారు కన్నడ హీరో శివరాజ్‌కుమార్. 'సాక్షి' పదిహేనేళ్లు పూర్తి చేసుకుని, పదహారో ఏడాదిలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా శుభాకాంక్షలు'' అన్నారు దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి. ''తెలుగు ప్రేక్షకులకు అద్భుతమైన వాస్తవాలను అందించాలని, స్ఫూర్తినిచ్చే వార్తలు ఇవ్వాలనే ప్రజాసంకల్పాన్ని ధ్యేయంగా చేసుకుని అందులో విజయం సాధిస్తూ, ప్రతి ఏడాది ప్రజలకు మరింత చేరువవుతున్నందుకు అభినందనలు'' అన్నారు నిర్మాత కె.అచ్చిరెడ్డి. ఇంకా హీరోలు 'అల్లరి' నరేశ్, ఆది సాయికుమార్, కార్తికేయ, విశ్వక్ సేన్, కిరణ్ అబ్బవరం, నటులు తనికెళ్ల భరణి, సుమన్, సాయికుమార్, 'సీనియర్' నరేశ్, అలీ, దర్శకులు కృష్ణవంశీ, బి.గోపాల్, నందినీ రెడ్డి, నిర్మాతలు సి.కల్యాణ్, 'దిల్' రాజు, రచయిత పరుచూరి గోపాలకృష్ణ, రచయిత, నిర్మాత కోన వెంకట్ తదితరులు 'సాక్షి'కి శుభాకాంక్షలు తెలిపి, మరిన్ని విజయవంతమైన వసంతాలను చూడాలని ఆకాంక్షించారు.

భయాన్ని చూపిస్తాడు!


● ఎన్టీఆర్, జాన్వీ కపూర్, రాజమౌళి

ఎన్టీఆర్ హీరోగా పాన్ ఇండియా సినిమా షురూ అయింది. 'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ చిత్రం తర్వాత ఎన్టీఆర్-డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'ఎన్‌టీఆర్ 30' (వర్కింగ్ టైటిల్). ఈ చిత్రంతో దివంగత అందాల తార శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ టాలీవుడ్‌కు హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. నందమూరి కల్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కొసరాజు హరికృష్ణ, సుధాకర్ మిక్కిలినేని నిర్మిస్తున్న ఈ సినిమా గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఎన్టీఆర్, జాన్వీపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి కొరటాల శివ కెమెరా స్విచ్చాన్ చేయగా, డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి క్లాప్ కొట్టారు. దర్శకుడు ప్రశాంత్ నీల్ గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత శ్యామ్ ప్రసాద్ రెడ్డి స్క్రిప్ట్‌ను యూనిట్‌కి అందించారు. కొరటాల శివ మాట్లాడుతూ – ''నేటి తరంలో బెస్ట్ యాక్టర్స్‌లో ఒకరైన ఎన్టీఆర్‌తో సినిమా తీయడం నా అదృష్టం. ఈ కథలో మనుషుల కన్నా ఎక్కువగా భయమంటే ఏంటో తెలియని మృగాలుంటారు. దేవుడన్నా, చావు అన్నా భయం లేదు. కానీ, వారికి ఒకరంటే భయం (ఎన్టీఆర్). వారిని భయపెట్టడానికి ఈ సినిమాలో నా ప్రధాన పాత్ర ఏ రేంజ్‌కి వెళ్తుంది? అనేది భావోద్వేగంగా ఉంటుంది'' అన్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో వచ్చే ఏడాది ఏప్రిల్ 5న రిలీజ్ చేయనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచంద్రన్, కెమెరా: రత్నవేలు.

శకుంతలకు 15 కేజీల బంగారం


● సమంత

కాళిదాసు రచించిన ప్రేమకావ్యం అభిజ్ఞాన శాకుంతలం ఆధారంగా దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కించిన చిత్రం 'శాకుంతలం'. శకుంతలగా సమంత, దుష్యంత్ మహారాజు పాత్రలో దేవ్ మోహన్, మేనకగా మధుబాల నటించారు. 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 14న విడుదల కానుంది. ఈ సినిమాలో ప్రధాన పాత్రధారులు ధరించిన బంగారు ఆభరణాలతో కొత్త పోస్టర్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో గుణశేఖర్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలోని ప్రధాన పాత్రధారుల కోసం రూ.14 కోట్లు విలువ చేసే బంగారు, వజ్రాభరణాలను ఉపయోగించాం. ప్రముఖ డిజైనర్ నీతూ లుల్లా నేతృత్వంలో దాదాపు 7 నెలలు కష్టపడి ఈ బంగారు, వజ్రాభరణాలను సిద్ధం చేశాం. శకుంతల పాత్ర కోసం 15 కేజీల బంగారంతో 14 రకాల ఆభరణాలు రెడీ చేశాం. దుష్యంత్ పాత్రకి దాదాపు పది కేజీల బంగారం వినియోగించాం. మేనక పాత్రకు 6కోట్లతో వజ్రాలు పొదిగిన దుస్తులు రూపొందించాం'' అన్నారు. ఈ కార్యక్రమంలో దేవ్ మోహన్, నిర్మాత హర్షిత, డిజైనర్ నీతూ తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకులు ఆ నమ్మకాన్ని ఇచ్చారు - విశ్వక్ సేన్



''నిజానికి కామెడీ నా బలం కాదు. యాక్షన్, డార్క్ డ్రామా, ఇంటెన్స్ ఎమోషన్స్‌ని బాగా డైరెక్ట్ చేస్తా. అయితే 'దాస్ కా ధమ్కీ' సినిమాతో కామెడీ కూడా బాగా తీయగలననే నమ్మకాన్ని ఇచ్చారు ప్రేక్షకులు'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. ఆయన హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'దాస్ కా ధమ్కీ'. 'కరాటే' రాజు (విశ్వక్ సేన్ తండ్రి) నిర్మించిన ఈ సినిమా బుధవారం విడుదలైంది. ఈ సందర్భంగా విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''దాస్ కా ధమ్కీ' మేం అనుకున్నదానికంటే పెద్ద సక్సెస్ అయ్యింది. నా కెరీర్ బెస్ట్ ఓపెనింగ్స్ (రూ.8 కోట్ల 88లక్షలు) వచ్చాయి. హీరో, డైరెక్షన్, ప్రొడక్షన్.. ఈ మూడు బాధ్యతలు నిర్వహించడం ఒత్తిడిగా ఉంటుంది. నా 'ఫలక్‌నామా దాస్' కంటే పదింతలు 'దాస్ కా ధమ్కీ'కి ఖర్చు పెట్టాం. సినిమా చేయడం కష్టం కాదు కానీ విడుదల చేయడం మాత్రం కష్టంతో కూడుకున్న పని. ఈ మూవీ ఫస్ట్ డ్రాఫ్ట్‌ని రచయిత ప్రసన్న నుంచి కొన్నాను. నేను నటించిన 'గామి' రిలీజ్‌కి రెడీగా ఉంది. సితార బ్యానర్‌లో ఓ సినిమా, రామ్ తాళ్లూరితో ఓ సినిమా చేయాలి. అలాగే నా సొంత బ్యానర్‌లో ఓ మూవీ ఉంటుంది'' అన్నారు.


ఇండియన్ సినిమాలు... ఫారిన్ విలన్లు!

భారతీయ కథలు ఇప్పుడు దేశీ ప్రేక్షకులతో పాటు విదేశీ ప్రేక్షకులను కూడా ఆకట్టుకుంటున్నాయి. ఇప్పటికే విదేశీ ఫైట్ మాస్టర్స్ ఇండియన్ సినిమాలకు ఫైట్స్ కంపోజ్ చేస్తున్నారు. ఇప్పుడు ఫారిన్ ఆర్టిస్టులు కూడా అరంగేట్రం చేస్తున్నారు. 'ఆర్ఆర్ఆర్'లో ఎన్టీఆర్ సరసన ఫారిన్ బ్యూటీ ఒలీవియా మోరిస్ నటించారు. అంతకుముందు అమీ జాక్సన్ వంటి తారలు కూడా వచ్చారు. ఇప్పుడు ఫారిన్ విలన్లు వస్తున్నారు. వారి గురించి తెలుసుకుందాం.

హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబోలో 1996లో వచ్చిన 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') సినిమాకు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోంది. కమల్-శంకర్ కాంబోలోనే సెట్స్‌పై ఉన్న ఈ సీక్వెల్‌లో ముంబై బేస్డ్ బ్రిటిష్ యాక్టర్ బెనెడిక్ట్ గారెట్ ఓ కీ రోల్ చేశారు. ఆల్రెడీ ఆయన క్యారెక్టర్ తాలూకు షూటింగ్ కూడా పూర్తయింది. ''ఇండియన్ 2'లో నా వంతు షూటింగ్‌ను పూర్తి చేశాను. అద్భుతమైన అనుభవం దక్కింది. ఈ సినిమా తెర మీద ఎలా ఉంటుందో చూడాలని ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నాను'' అని పేర్కొన్నారు బెనెడిక్ట్. కాగా ఈ చిత్రంలో బెనెడిక్ట్‌ది విలన్ రోల్ అనే ప్రచారం. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రకుల్‌ప్రీత్ సింగ్, బాబీ సింహా, సిద్ధార్థ్ కీలక పాత్రలు చేస్తున్నారు. ఇక కోలీవుడ్‌లో సుమారు ఆరేళ్ల క్రితం సెట్స్‌పైకి వెళ్లి ఇంకా రిలీజ్‌కు నోచుకోని చిత్రం 'ధృవనక్షత్రం'. విక్రమ్ హీరోగా గౌతమ్ మీనన్ దర్శకత్వంలో రూపొందుతున్న స్పై యాక్షన్ ఫిల్మ్ ఇది. గతంలో ఆగిపోయిన ఈ సినిమా షూటింగ్‌ని ఇటీవలే మళ్లీ ఆరంభించారు. 'ఇండియన్ 2'లో నటించిన బెనెడిక్ట్ గారెట్ ఈ మూవీలోనూ నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఈ ఏడాదిలోనే రిలీజ్ చేయాలనుకుంటున్నారు. మరోవైపు ప్రస్తుతం విక్రమ్ నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'తంగలాన్'. ఈ చిత్రానికి పా. రంజిత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో ఇంగ్లిష్ యాక్టర్ డేనియల్ కాల్టాగిరోన్ ఓ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఆయనది ప్రతినాయకుడి పాత్ర అని కోలీవుడ్ టాక్. ఇక 'తంగలాన్' విడుదల తేదీపై త్వరలోనే సరైన స్పష్టత రానుంది.

ఇలా... రానున్న రోజుల్లో మరికొందరు ఇంగ్లిష్ యాక్టర్స్ ఇండియన్ సినిమాల్లో కనిపించే అవకాశం ఉంది.


● బెనెడిక్ట్


● కమల్ హాసన్


● డేనియల్


● విక్రమ్

సెప్టెంబరులో ఖుషి


● విజయ్ దేవరకొండ, సమంత

విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఖుషి'. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 1న 'ఖుషి' రిలీజ్ చేయనున్నట్లు గురువారం ప్రకటించి, కొత్త పోస్టర్ రిలీజ్ చేసింది చిత్ర యూనిట్. ''కశ్మీర్‌తో పాటు ఇతర అందమైన లొకేషన్స్‌లో చిత్రీకరిస్తున్నాం. మిడ్ మూన్‌లో రెండు విభిన్నమైన నేపథ్యాల మధ్య రాబోతున్న ఈ కథ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేలా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: హిషామ్ అబ్దుల్ వాహబ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: దినేష్ నరసింహన్.

నిజమేది.. రుజువేది...


● సంతోష్ శోభన్, మాళవిక, నందినీ రెడ్డి

సంతోష్ శోభన్, మాళవికా నాయర్ జంటగా నటించిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. నందినీ రెడ్డి దర్శకత్వంలో మిత్రవిందా మూవీస్‌తో కలిసి స్వప్న సినిమాస్ పతాకంపై ప్రియాంకా దత్ నిర్మించిన ఈ చిత్రం మే 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని టైటిల్ ట్రాక్ 'అన్నీ మంచి శకునములే..'ను విడుదల చేసింది చిత్ర యూనిట్. సంగీత దర్శకుడు మిక్కీ జె. మేయర్ స్వరకల్పనలో కార్తీక్ సాహిత్యం అందించిన ఈ పాటను రెహమాన్ పాడారు. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో నిర్మాత అశ్వనీదత్ మాట్లాడుతూ– ''స్వప్న సినిమాస్‌పై నేను 'స్టూడెంట్ నంబర్ 1' సినిమా తీశాను. కొంతగ్యాప్ తర్వాత నా కుమార్తెలు ప్రియాంకా దత్, స్వప్నాదత్ అమెరికా నుంచి తిరిగి రాగానే వారికి ఈ బాధ్యతలు అప్పగించాను. అప్పుడు నాకు మంచి శకునము ఆరంభం అయింది'' అని అన్నారు. ''రెండు కుటుంబాల మధ్య జరిగే కథే ఈ చిత్రం'' అన్నారు నందినీ రెడ్డి.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ షురూ


● మాధవ్, రాఘవేంద్రరావు

హీరో రవితేజ సోదరుడు, నటుడు రఘు తనయుడు మాధవ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం గురువారం ఆరంభమైంది. గౌరీ రోణంకి దర్శకత్వంలో యలమంచి రాణి సమర్పణలో జేజేఆర్ రవిచంద్ నిర్మాత. తొలి సన్నివేశానికి నిర్మాత సురేశ్ బాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు రాఘవేంద్రరావు క్లాప్ కొట్టి, చిత్ర స్క్రిప్ట్‌ను దర్శక-నిర్మాతలకు అందజేశారు. గౌరి రోణంకి మాట్లాడుతూ– ''యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. కలర్‌ఫుల్‌గా ఉంటుంది'' అన్నారు. ''మంచి పాయింట్‌తో తెరకెక్కుతున్న చిత్రం ఇది'' అన్నారు జేజేఆర్ రవిచంద్. ''ఏప్రిల్‌లో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు మాధవ్. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, కెమెరా: రామ్.

సాక్షి బిజినెస్
శుక్రవారం
24-3-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	289	57,925
నిఫ్టీ ▽	75	17,077

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	11,852	△ 182
డోజోన్స్	32,204	△ 174
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,500	▽ 67
డాక్స్	15,210	▽ 6
షాంఘై	3,287	△ 21
నికాయ్	27,420	▽ 47

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	59,086
బంగారం (22 క్యారట్)	58,849
వెండి (కేజీ)	69,136

58,000 దిగువకు సెన్సెక్స్

రెండు రోజుల లాభాలకు బ్రేక్



ముంబై: బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ షేర్లలో అమ్మకాలతో స్టాక్ సూచీలు గురువారం నష్టాలతో ముగిశాయి. యూఎస్ ఫెడ్ రిజర్వ్ 25 బేసిస్ పాయింట్ల వడ్డీరేట్ల పెంపు మార్కెట్ వర్గాలను మెప్పించలేకపోయింది. మిశ్రమ అంతర్జాతీయ సంకేతాలు, అధిక వెయిటేజీ రిలయన్స్ షేరు(1%) పతనం సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు వెంటనే కోలుకొని లాభాల బాటపట్టాయి. మిడ్ సెషన్ వరకు లాభాల్లో ట్రేడైన సూచీలు తర్వాత అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. స్విస్ నేషనల్ బ్యాంక్ వడ్డీరేట్ల పెంపుతో యూరప్ మార్కెట్ల నష్టాల ప్రారంభం మన మార్కెట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. ఉదయం సెన్సెక్స్ 154 పాయింట్ల నష్టంతో 58,061 మొదలైంది. ఇంట్రాడేలో 57,839 వద్ద కనిష్టాన్ని.., 58,396 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 289 పాయింట్ల నష్టంతో 58 వేల దిగువన 57,925 వద్ద నిలిచింది. నిఫ్టీ 17,045 – 17,205 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 75 పాయింట్లను కోల్పోయి 17,077 వద్ద స్థిరపడింది. ఫార్మా, మెటల్, ఎఫ్‌ఎంసీజీ, ఆటో షేర్లకు స్వల్ప కొనుగోళ్ల మద్దతు లభించింది. డాలర్ మారకంలో రూపాయి విలువ 39 పైసలు పెరిగి 82.27 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ రెండు నెలల కనిష్టానికి దిగిరావడం దేశీయ కరెన్సీ బలపడింది.

• గ్లోబల్ సర్ఫేసెస్ షేరు బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.140)తో పోలిస్తే 16% ప్రీమియంతో రూ.163 వద్ద లిస్టయ్యింది. 22.25% ఎగసి రూ.171.15 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 22% లాభంతో రూ.170.90 వద్ద స్థిరపడింది.

ఆన్‌లైన్ కంపెనీలకూ బాధ్యతలు

• జవాబుదారీతనాన్ని పెంచేందుకు నిబంధనలు
• కేంద్రం కసరత్తు



న్యూఢిల్లీ: విక్రేతల మోసాలకు కూడా ఈ–కామర్స్ సంస్థలను బాధ్యులుగా చేసే దిశగా నిబంధనలను కఠినతరం చేయడంపై కేంద్రం దృష్టి సారించింది. వాటిలో జవాబుదారీతనాన్ని మరింతగా పెంచేలా రూల్స్‌ను రూపొందించడంపై వినియోగదారుల వ్యవహారాల శాఖ కసరత్తు చేస్తోంది. ఇందుకు సంబంధించి, మధ్యవర్తిత్వ సంస్థలుగా అవి పోషిస్తున్న పాత్ర గురించి తెలియజేయాలంటూ కొన్ని ప్రశ్నలను ఈ–కామర్స్ కంపెనీలకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ పంపించింది. వాటికి సమాధానాలు వచ్చిన తర్వాత మార్గదర్శకాల రూపకల్పన ప్రారంభమవుతుందని వినియోగదారుల వ్యవహారాల శాఖ తెలిపింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లాంటి ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు సాధారణంగా విక్రేతలు, కొనుగోలుదారులను అనుసంధానించే మధ్యవర్తిత్వ సంస్థలుగా వ్యవహరిస్తున్నాయి. వీటికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం 2000లోని సెక్షన్ 79 ప్రకారం నిర్దిష్ట బాధ్యతల నుంచి కొన్ని మినహాయింపులు ఉంటున్నాయి. అయితే, ప్రతిపాదిత మార్పుల ప్రకారం దాన్ని మార్చి, మధ్యవర్తిత్వ సంస్థలుగా వాటికి మరింత జవాబుదారీతనాన్ని కట్టబెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. డిజిటల్ ఎకానమీలో వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేలా ఈ–కామర్స్ నిబంధనలను పునర్‌వ్యవస్థీకరించే ప్రక్రియ చేపట్టినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లలో విక్రయించే ఉత్పత్తులు లోపభూయిష్టంగా ఉన్నట్లు తేలితే .. ఆయా ఈ–కామర్స్ సంస్థలనే బాధ్యులను చేయాలని భావిస్తున్నట్లు వివరించాయి. ఈ–కామర్స్ సంస్థలో నమోదు చేసుకున్న విక్రేత నిర్లక్ష్యంగా వ్యవహరించి, వినియోగదారులు ఆర్డరు చేసిన ఉత్పత్తులు లేదా సర్వీసులను అందించడంలో విఫలమైనా సదరు ఆన్‌లైన్ షాపింగ్ సంస్థే బాధ్యత వహించేలా నిబంధనలు ఉండవచ్చని పేర్కొన్నాయి.

భారత పర్యటనలో 'ప్రపంచ బ్యాంక్' అజయ్ బంగా

ప్రధాని, ఆర్థిక మంత్రి తదితరులతో సమావేశాలు



న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాంకు ప్రెసిడెంట్‌గా అమెరికా ప్రతిపాదించిన అజయ్ బంగా తాజాగా భారత్ పర్యటనకు వచ్చారు. రెండు రోజుల పర్యటనలో (మార్చి 23, 24) భాగంగా ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్ జైశంకర్ తదితరులతో సమావేశం కానున్నారు. భారత్ అభివృద్ధి ప్రణాళికలు, ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ఆర్థికాభివృద్ధిపరమైన సవాళ్లు వంటి అంశాలపై ఈ సందర్భంగా చర్చించనున్నారని అమెరికా ఆర్థిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే, నేషనల్ స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో కలిసి ఏర్పాటు చేసిన వృత్తి విద్యా కోర్సుల సంస్థల నెట్‌వర్క్ 'లెర్నెట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్'ను కూడా బంగా సందర్శించనున్నారు. దీనికి ప్రపంచ బ్యాంక్ పాక్షికంగా నిధులు సమకూర్చింది. మాస్టర్‌కార్డ్ చీఫ్‌గా ఉన్న బంగా పేరును ప్రపంచ బ్యాంక్‌కు కొత్త ప్రెసిడెంట్‌గా ప్రతిపాదించిన వెంటనే భారత ప్రభుత్వం మద్దతు తెలిపిందని అమెరికా ఆర్థిక శాఖ తెలిపింది. ఇప్పటికే బంగ్లాదేశ్, ఫ్రాన్స్, ఈజిప్ట్, జర్మనీ, ఇటలీ, సౌదీ అరేబియా, బ్రిటన్ తదిన్‌దేశాలు కూడా మద్దతు ప్రకటించినట్లు వివరించింది. తన అభ్యర్థిత్వానికి మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాల్లో భాగంగా ఆయన మూడు వారాలుగా వివిధ దేశాలను సందర్శిస్తున్నారు. ఆఫ్రికాతో ప్రారంభించి యూరప్, లాటిన్ అమెరికా, ఆసియా దేశాల తర్వాత ఆఖరుగా భారత్ వచ్చారు.

స్టార్టప్స్ కోసం రూ. 700 కోట్ల ఫండ్



న్యూఢిల్లీ: స్టార్టప్స్‌కు నిధులు సమకూర్చేందుకు రూ.700 కోట్లకు పైగా కార్పస్ ఉన్నట్లు రీసెర్చ్, డెవలప్‌మెంట్ సంస్థ సి–డాట్ వెల్లడించింది. ఆవిష్కరణలకు అందించే నిధులకు ఎటువంటి పరిమితిని ప్రభుత్వం విధించలేదని సంస్థ సీఈవో రాజ్‌కుమార్ ఉపాధ్యాయ్ తెలిపారు. సాంకేతిక భాగస్వామ్యానికి పొరుగున ఉన్న దేశాలు ఆసక్తిగా ఉన్నాయని, దేశీయ ఆవిష్కరణలు భారత్ వెలుపల విస్తరణకు ఆస్కారం ఉందన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-3-2023	
విశాఖ	450–00
చిత్తూరు	473–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	438–00
విజయవాడ	438–00
రిటైల్ ధర (డజను)	66.00
23-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425–00
వరంగల్	427–00
రిటైల్ ధర	4.95

వాహనాలు మరింత ప్రియం

• కార్లు రూ. 30,000 వరకు
• ద్విచక్ర వాహనాలు రూ. 2,500
• ఏప్రిల్ 1 నుంచి కొత్త ధరలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా అన్ని రకాల వాహనాల ధరలు ప్రియం కానున్నాయి. కాలుష్యాన్ని కట్టడి చేసే చర్యల్లో భాగంగా భారత్ స్టేజ్–6 రెండవ దశ ఉద్గార ప్రమాణాలు వచ్చే నెల నుంచి అమలులోకి వస్తుండడమే ఇందుకు కారణం. ప్యాసింజర్, ద్విచక్ర, వాణిజ్య వాహనాలకు ఏప్రిల్ 1 నుంచి కొత్త ధరలు వర్తించనున్నాయి. చాలా కంపెనీలు ఇప్పటికే ధరలను సవరిస్తున్నట్టు ప్రకటించాయి. మారుతీ సుజుకీ, హోండా కార్స్, టాటా మోటార్స్, హీరో మోటోకార్ప్ వంటి సంస్థలు వీటిలో ఉన్నాయి.

ఖరీదు రూ.30,000 వరకు..

ప్రమాణాలకు అనుగుణంగా కంపెనీలు తమ వాహనాలను అప్‌గ్రేడ్ చేశాయి. దీంతో ప్యాసింజర్ కార్లు మోడల్, వేరియంట్‌నుబట్టి రూ.10,000 మొదలుకుని రూ.30,000 వరకు ధరలు పెరగనున్నాయి. ప్రారంభ స్థాయి ద్విచక్ర వాహనాలు రూ.2,500 దాకా భారం కానున్నాయి. ఇప్పటికే ముడిసరుకు వ్యయాలకు అనుగుణంగా కంపెనీలు వాహనాల ధరలను పెంచుతూ వస్తున్నాయి. అన్ని రకాల వాహన విభాగాల్లోనూ తయారీ కంపెనీలు ధరలను సవరించాయి.

వాహనాల్లో మార్పులు..

నూతన ఉద్గార ప్రమాణాల కింద వాహనాలకు ఆధునిక సాంకేతికత వినియోగించాల్సి వస్తోంది. ప్రోగ్రామ్‌తో కూడిన ఫ్యూయల్ ఇంజెక్టర్స్, సెల్ఫ్ డయాగ్నోస్టిక్ డివైసెస్ ఏర్పాటు తప్పనిసరి అయింది. వాహనం నుంచి వెలువడే కాలుష్య స్థాయిని తెలిపే పరికరం అమర్చాల్సి ఉంటుంది. యూరప్‌లో అమలులో ఉన్న యూరో–6 ప్రమాణాలకు సమానంగా భారత్ స్టేజ్–6 రెండవ దశ ఉద్గార ప్రమాణాలను తీర్చిదిద్దారు. దీంతో వాహనాల్లోని ఇంజిన్లను అప్‌గ్రేడ్ చేయాల్సి వస్తోంది. ఇప్పటికే పరిశ్రమలో 7,00,000 ప్యాసింజర్ కార్లకు బుకింగ్స్ నమోదై ఉన్నాయి. ధర పెరగడం వల్ల డిమాండ్ తగ్గే అవకాశం లేదని కంపెనీలు ధీమాగా ఉన్నాయి.

వ్యయ భారంతో..

ప్రమాణాలకు అనుగుణంగా ఇంజన్లలో మార్పుల ప్రక్రియ ఖర్చుతో కూడుకున్నది. అధికంగా డిమాండ్ ఉన్న మోడళ్లను మాత్రమే కంపెనీలు అప్‌గ్రేడ్ చేస్తున్నాయి. డిమాండ్ తక్కువ ఉన్న మోడళ్లకు స్వస్తి పలకడం తప్పడం లేదు. ఏప్రిల్ 1 నుంచి ఇటువంటివి కనుమరుగు కానున్నాయి. వీటిలో మారుతీ సుజుకీ ఆల్టో 800, హోండా జాజ్, డబ్ల్యూఆర్–వి, అమేజ్ డీజిల్, సిటీ జనరేషన్–4, సిటీ జనరేషన్–5 డీజిల్, మహీంద్రా ఆల్టరస్ జీ4, కేయూవీ100, మరజ్జో, స్కోడా ఆక్టావియా, సూపర్బ్, హ్యుండై ఐ20 డీజిల్, వెర్నా డీజిల్, రెనో క్విడ్ 800, నిస్సాన్ కిక్స్, టాటా ఆల్ట్రోజ్ డీజిల్, టయోటా ఇన్నోవా క్రిస్టా పెట్రోల్ మోడళ్లు ఉన్నాయి.

బ్లాక్ సంస్థకు హిండెన్‌బర్గ్ షాక్...

షేర్లు 20 శాతం డౌన్

న్యూఢిల్లీ: షార్ట్‌సెల్లింగ్ రిపోర్టుతో అదానీ గ్రూప్‌ను అతలాకుతలం చేసిన అమెరికన్ రీసెర్చ్ సంస్థ హిండెన్‌బర్గ్ తాజాగా మరో కంపెనీని టార్గెట్ చేసుకుంది. ఈసారి ట్విటర్ సహ–వ్యవస్థాపకుడు జాక్ డార్సీకి చెందిన చెల్లింపుల కంపెనీ బ్లాక్‌ను లక్ష్యంగా పెట్టుకుంది. ఇన్వెస్టర్లను బ్లాక్ తప్పుదోవ పట్టించిందంటూ నివేదికను ప్రచురించింది. 1 బిలియన్ డాలర్ల పైగా మోసానికి పాల్పడిందంటూ ఆరోపించింది. దాదాపు రెండేళ్ల పరిశోధన తర్వాత ఈ రిపోర్టును రూపొందించినట్లు పేర్కొంది. ఈ నివేదికతో అమెరికా మార్కెట్లో బ్లాక్ షేర్లు ఒక దశలో 20 శాతం పైగా క్షీణించి 58 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి. అదానీ గ్రూప్ కంపెనీల ఖాతాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ హిండెన్‌బర్గ్ ఈ ఏడాది జనవరిలో ఆరోపించడం, ఫలితంగా అదానీ సంస్థల షేర్లు భారీగా పతనం కావడం తెలిసిందే. అంతకు ముందు 2020లో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ నికోలా కార్పొరేషన్‌పై కూడా హిండెన్‌బర్గ్ పలు ఆరోపణలు చేసింది. దీనితో ఆ కంపెనీ షేరు పతనం కావడంతో పాటు సంస్థ వ్యవస్థాపకుడు ట్రెవర్ మిల్టన్‌పై క్రిమినల్ కేసులు కూడా నమోదయ్యాయి.

ఎల్ఐసీ సారథిగా సిద్ధార్థ మహంతి

ఎంపిక చేసిన ఎఫ్ఎస్ఐబీ



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ నూతన సారథిగా సిద్ధార్థ మహంతిని ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇనిస్టిట్యూషన్స్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) గురువారం ఎంపిక చేసింది. ప్రభుత్వరంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల చీఫ్‌లు, సారథుల ఎంపికను ఎఫ్ఎస్ఐబీ చూస్తుంటుంది. నిబంధనల ప్రకారం నలుగురు మేనేజింగ్ డైరెక్టర్ల నుంచి చైర్మన్‌ను ఎంపిక చేస్తారు. మొత్తం మీద అనుభవం, ఇతర అంశాల ఆధారంగా ఎల్ఐసీ చైర్‌పర్సన్ పదవికి సిద్ధార్థ మహంతిని సిఫారసు చేసినట్లు ఎఫ్ఎస్ఐబీ ప్రకటన విడుదల చేసింది. ఎఫ్ఎస్ఐబీ సిఫారసుపై తుది నిర్ణయాన్ని ప్రధాని అధ్యక్షతన గల కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ తీసుకుంటుంది. ఒకవేళ మహంతి నియామకం ఖరారు కాకపోతే ఆయన ఈ ఏడాది జూన్ 30న పదవీ విరమణ చేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఎల్ఐసీ చైర్మన్‌గా ఎంపికైతే 62 ఏళ్లు వచ్చే వరకు కొనసాగొచ్చు. ఇతర ఉన్నత ఉద్యోగులకు రిటైర్మెంట్ వయసు 60 ఏళ్లుగా ఉంది.

సాక్షి స్పోర్ట్స్

వెస్లీ మదెవెరె 'హ్యాట్రిక్'

నెదర్లాండ్స్ జట్టుతో హరారేలో గురువారం జరిగిన రెండో వన్డేలో జింబాబ్వే జట్టు ఒక్క పరుగు తేడాతో గెలిచింది. వెస్లీ మదెవెరె ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జింబాబ్వే విజయంలో కీలకపాత్ర పోషించాడు. మదెవెరె 43 పరుగులు చేయడంతోపాటు 'హ్యాట్రిక్' తీశాడు. ముందుగా జింబాబ్వే 49.2 ఓవర్లలో 271 పరుగులకు ఆలౌటైంది. సీన్ విలియమ్స్ (77 : 11 ఫోర్లు), మదాండె (52 : 5 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. అనంతరం నెదర్లాండ్స్ జట్టు సరిగ్గా 50 ఓవర్లలో 270 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. మాక్స్ ఒడౌడ్ (81 : 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), టామ్ కూపర్ (74 : 9 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. ఇన్నింగ్స్ 44వ ఓవర్ వేసిన మదెవెరె తొలి మూడు బంతుల్లో వరుసగా అకెర్‌మన్, తేజ నిడమనూరు, మీకెరన్‌లను అవుట్ చేసి 'హ్యాట్రిక్' నమోదు చేశాడు. బ్రాండెస్ (1997లో ఇంగ్లండ్‌పై), ఉత్సెయ (2014లో దక్షిణాఫ్రికాపై) తర్వాత జింబాబ్వే తరఫున వన్డేల్లో 'హ్యాట్రిక్' సాధించిన మూడో బౌలర్‌గా మదెవెరె నిలిచాడు.



భారత్ ఖాతాలో రెండు పతకాలు

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీ






పతకాలతో రిథమ్, వరుణ్, నర్మద, రుద్రాంక్ష్

భోపాల్: వరుసగా రెండో రోజు ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత్‌కు రెండు పతకాలు లభించాయి. గురువారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రిథమ్ సాంగ్వాన్–వరుణ్ తోమర్ (భారత్) జోడీ రజతం నెగ్గగా... 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో నర్మద–రుద్రాంక్ష్ పాటిల్ (భారత్) ద్వయం కాంస్య పతకం సాధించింది. ఎయిర్ పిస్టల్ ఫైనల్లో రిథమ్–వరుణ్ జంట 11–17తో కియాన్ వె–లియు జిన్‌యావో (చైనా) జోడీ చేతిలో ఓడిపోయింది. ఎయిర్ రైఫిల్ కాంస్య పతక పోరులో నర్మద–రుద్రాంక్ష్ ద్వయం 16–8తో కియాంగ్‌యు జాంగ్–యు హావోనన్ (చైనా) జంటపై గెలిచింది. రెండో రోజు తర్వాత భారత్ ఒక స్వర్ణం, ఒక రజతం, రెండు కాంస్యాలతో కలిపి నాలుగు పతకాలతో రెండో స్థానంలో ఉంది.

నేడు డబ్ల్యూపీఎల్ ఎలిమినేటర్



మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో ఈరోజు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని ముంబై ఇండియన్స్ జట్టుతో అలీసా హీలీ కెప్టెన్సీలోని యూపీ వారియర్స్ జట్టు ఎలిమినేటర్ మ్యాచ్‌లో తలపడనుంది. రాత్రి గం. 7:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఆదివారం జరిగే ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఆడుతుంది.

నిఖత్ పంచ్ అదిరె...



వలెన్సియాపై నిఖత్ పంచ్..

• ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ ఫైనల్లో భారత స్టార్
• నీతూ, లవ్లీనా, స్వీటీ కూడా పసిడి పోరుకు అర్హత



నీతూ



లవ్లీనా



స్వీటీ

న్యూఢిల్లీ: సొంతగడ్డపై భారత మహిళా బాక్సర్లు తమ పంచ్ పవర్‌ను ప్రదర్శించారు. ప్రపంచ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఏకంగా నలుగురు భారత బాక్సర్లు ఫైనల్లోకి దూసుకెళ్లారు. తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ (50 కేజీలు), నీతూ (48 కేజీలు), లవ్లీనా బొర్గోహైన్ (75 కేజీలు), స్వీటీ బూరా (81 కేజీలు) తుది పోరుకు అర్హత సాధించి స్వర్ణ పతకాలకు విజయం దూరంలో నిలిచారు. గురువారం జరిగిన సెమీఫైనల్స్‌లో నిఖత్ జరీన్ 5–0తో 2016 రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత ఇన్‌గ్రిత్ వలెన్సియా (కొలంబియా)ను చిత్తుగా ఓడించగా... నీతూ 5–2తో ఆసియా చాంపియన్ అలువా బల్కిబెకోవా (కజకిస్తాన్)పై, లవ్లీనా 4–1తో లీ కియాన్ (చైనా)పై, స్వీటీ 4–3తో స్యు ఎమ్మా గ్రీన్‌ట్రీ (ఆస్ట్రేలియా)పై గెలుపొందారు. గత ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 52 కేజీల విభాగంలో పోటీపడి స్వర్ణం సాధించిన నిఖత్ ఈసారి 50 కేజీల విభాగంలో బరిలోకి దిగింది. టోక్యో ఒలింపిక్స్‌లో భారత దిగ్గజ బాక్సర్ మేరీకోమ్‌ను ఓడించిన వలెన్సియాను నిఖత్ తక్కువ అంచనా వేయకుండా ఆరంభం నుంచే పక్కా ప్రణాళికతో ఆడింది. రింగ్‌లో వేగంగా కదులుతూనే అవకాశం దొరికినప్పుడల్లా వలెన్సియాపై పంచ్‌లు విసిరింది. ప్రత్యర్థి తనపై ఆధిపత్యం చలాయించకుండా కూడా నిఖత్ జాగ్రత్త పడింది. ముందుగా తొలి రెండు రౌండ్‌లలో ఎదురుదాడి చేసి స్పష్టమైన ఆధిక్యం సంపాదించిన నిఖత్ మూడో రౌండ్‌లో మాత్రం ప్రత్యర్థికి పుంజుకునే అవకాశం ఇవ్వకుండా రక్షణాత్మకంగా ఆడి కట్టడి చేసింది.

నేడు విశ్రాంతి దినం. శనివారం, ఆదివారం ఫైనల్స్ జరుగుతాయి. శనివారం సాయంత్రం 6 గంటలకు మొదలయ్యే ఫైనల్స్‌లో లుత్సయిఖాన్ అల్టాంటిసెట్‌సెగ్ (మంగోలియా)తో నీతూ... లీనా వాంగ్ (చైనా)తో స్వీటీ తలపడతారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు మొదలయ్యే ఫైనల్స్‌లో ఎన్గుయెన్ థి టామ్ (వియత్నాం)తో నిఖత్ జరీన్... కైట్లిన్ పార్కర్ (ఆస్ట్రేలియా)తో లవ్లీనా పోటీపడతారు.

2 ఒకే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నలుగురు లేదా అంతకంటే ఎక్కువమంది భారత బాక్సర్లు ఫైనల్ చేరడం ఇది రెండోసారి. 2006లో న్యూఢిల్లీయే ఆతిథ్యమిచ్చిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఐదుగురు భారత బాక్సర్లు (మేరీకోమ్, సరితా దేవి, జెన్నీ, లేఖ, నగిశెట్టి ఉష) ఫైనల్ చేరారు. ఉష రజతం నెగ్గగా, మేరీకోమ్, సరిత, జెన్నీ, లేఖ స్వర్ణ పతకాలు గెలిచారు.

3 మేరీకోమ్ తర్వాత ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కనీసం రెండుసార్లు ఫైనల్‌కు చేరిన భారత బాక్సర్లుగా నిఖత్ జరీన్, స్వీటీ గుర్తింపు పొందారు. మేరీకోమ్ ఏకంగా ఏడుసార్లు ఫైనల్‌కు చేరి ఆరుసార్లు స్వర్ణం, ఒకసారి రజతం సాధించింది. నిఖత్ గత ఏడాది, స్వీటీ 2014లో ఫైనల్‌కు చేరారు.

ఇక ఐపీఎల్ ఫ్రాంచైజీల ఇష్టం...

ఆటగాళ్లకు విరామంపై రోహిత్ వ్యాఖ్య



చెన్నై: భారత రెగ్యులర్ ఆటగాళ్లు పదే పదే గాయాలబారిన పడటం, కీలక మ్యాచ్‌లకు దూరం కావడంపై కెప్టెన్ రోహిత్ శర్మ స్పందించాడు. వారికి తగినంత విశ్రాంతి కల్పించడంపై అతను కీలక వ్యాఖ్య చేశాడు. 'ఇకపై ఆటగాళ్లంతా ఐపీఎల్ ఫ్రాంచైజీలకు చెందినవారే. టోర్నీ ముగిసేవరకు వారి పర్యవేక్షణలోనే ఉంటారు. ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చే విషయంపై బోర్డు సూచనలు అందరికీ ఇచ్చింది. కానీ వాటిని ఫ్రాంచైజీలు పాటిస్తాయా లేదా అనేది సందేహమే. అన్నింటికి మించి క్రికెటర్లేమీ చిన్నపిల్లలు కారు. వారికే తమ శరీరం గురించి, గాయాల గురించి స్పష్టత ఉంటుంది. దానిని బట్టి ప్రణాళిక రూపొందించుకోవాల్సిందే తప్ప వేరే వాళ్లు చేసేదేమీ లేదు. అయినా భారత జట్టుకు ఆడుతున్నప్పుడు తగినంత విరామం ఇస్తూనే ఉన్నాం' అని రోహిత్ అభిప్రాయపడ్డాడు. ఏ క్రికెటర్ కూడా గాయపడాలని కోరుకోడని, అందరికీ అన్ని మ్యాచ్‌లు ఆడాలనే ఉంటుందని కెప్టెన్ అన్నాడు. 'గాయాలు తిరగబెట్టడంపై మాట్లాడేందుకు నేనేమీ నిపుణుడిని కాను. అయితే గాయాల ఆటగాళ్ల కెరీర్‌లో భాగం. అందుబాటులో ఉన్న వైద్య సిబ్బంది వారి పరిస్థితిని మెరుగుపర్చేందుకు అత్యుత్తమ చికిత్స అందిస్తుందనే విషయం నాకు తెలుసు. కానీ అనూహ్యంగా జరిగే వాటి గురించి ఎవరూ చెప్పలేరు' అని రోహిత్ విశ్లేషించాడు.

ఐపీఎల్‌కు బెయిర్‌స్టో దూరం



లండన్: ఇంగ్లండ్ విధ్వంసక బ్యాటర్ జానీ బెయిర్‌స్టో ఈసారి ఐపీఎల్‌లో ఆడబోవడం లేదు. అతనికి ఐపీఎల్ కోసం నిరభ్యంతరకర పత్రం (ఎన్‌ఓసీ) ఇచ్చేందుకు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) నిరాకరించింది. వేలంలో పంజాబ్ కింగ్స్ జట్టు బెయిర్‌స్టోను రూ. 6 కోట్ల 75 లక్షలకు తీసుకుంది. గత ఏడాది సెప్టెంబర్‌లో గోల్ఫ్ ఆడుతూ కాలికి గాయం కావడంతో బెయిర్‌స్టో టి20 ప్రపంచకప్‌తో పాటు పాకిస్తాన్, న్యూజిలాండ్‌లతో సిరీస్‌లకు దూరమయ్యాడు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న బెయిర్‌స్టో వెంటనే ఐపీఎల్ ఆడితే గాయం తీవ్రమై ముమ్ముందు మరిన్ని ఇంగ్లండ్ మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం ఉండటంతో ఈసీబీ అతడిని ఐపీఎల్‌కు పంపరాదని నిర్ణయించింది. అయితే పంజాబ్‌కే ఆడనున్న లివింగ్‌స్టోన్, స్యామ్ కరన్‌లకు మాత్రం ఎలాంటి సమస్య లేకుండా ఎన్‌ఓసీ మంజూరు చేసింది.

శ్రీకాంత్ పరాజయం



బాసెల్: స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత కథ ముగిసింది. మాజీ చాంపియన్ కిడాంబి శ్రీకాంత్‌తోపాటు హెచ్ఎస్ ప్రణయ్, మిథున్ మంజునాథ్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయారు. శ్రీకాంత్ 20–22, 17–21తో చెయుక్ యియు లీ (హాంకాంగ్) చేతిలో... ప్రణయ్ 8–21, 8–21తో క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో... జాతీయ చాంపియన్ మిథున్ 19–21, 10–21తో చియా హావో లీ (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి చవిచూశారు. మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ పీవీ సింధు ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. తొలి రౌండ్‌లో సింధు 21–9, 21–16తో జెన్‌జిరా స్టాడెల్‌మన్ (స్విట్జర్లాండ్)పై విజయం సాధించింది.

లలిత్ బాబు శుభారంభం



న్యూఢిల్లీ: ఢిల్లీ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ఎం.ఆర్.లలిత్ బాబు శుభారంభం చేశాడు. తొలి రౌండ్ గేమ్‌లో లలిత్ బాబు 31 ఎత్తుల్లో భారత్‌కే చెందిన ఆదిత్య జైన్‌పై గెలిచాడు. ఇదే టోర్నీలో ఆడుతున్న తెలంగాణ ప్లేయర్లు మట్టా వినయ్ కుమార్, ఆదిరెడ్డి అర్జున్, జె.రామకృష్ణ, పొట్లూరి సాయి శ్రీజ, వేల్పుల సరయు, లక్ష్మీ సందీప్ నాయుడు, శిబి శ్రీనివాస్ ఇన్‌స్టీన్, ఉప్పాల శ్రీరామ్ ఆదర్శ్, తోట ధ్రువ తొలి రౌండ్ గేముల్లో నెగ్గారు.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.